సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 335

మంగళవారం 25-2-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

అమ్మాయిలు అదరగొట్టేశారు

మహిళల టి20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్‌పై భారత్ విజయం -స్పోర్ట్స్‌లో

కోవిడ్ కల్లోలం

ప్రపంచ మార్కెట్ల భారీ పతనం. సెన్సెక్స్ 807 పాయింట్లు డౌన్ -బిజినెస్‌లో

దోస్త్ మేరా దోస్త్..!

మోదీ 'నమస్తే ట్రంప్'.. ట్రంప్ 'నమోస్తుతి'

కిక్కిరిసిన మొతెరా స్టేడియంలో జనరంజకంగా ట్రంప్ ప్రసంగం

మోదీపై ప్రశంసల జల్లు

ట్రంప్‌ను ప్రత్యేక స్నేహితుడిగా అభివర్ణించిన ప్రధాని మోదీ

సోమవారం అహ్మదాబాద్‌లోని మొతెరా స్టేడియంలో ప్రజలకు ట్రంప్, మోదీ అభివాదం

అమెరికా భారత్‌ను అభిమానిస్తుంది.. గౌరవిస్తుంది.. అమెరికా భారత్‌కు ఎన్నటికీ విశ్వసనీయ మిత్రుడిగా ఉంటుంది. ఈ సందేశాన్ని ఈ దేశ పౌరులకు ఇవ్వడం కోసం నేను, మెలానియా 8 వేల మైళ్లు ప్రయాణించి ఇక్కడికి వచ్చాం. ఒక సామాన్య భారతీయుడు ఏం సాధించగలడనేదానికి భారత ప్రధాని మోదీనే సజీవ తార్కాణం. మోదీ హయాంలో భారత్‌లోని ప్రతి గ్రామానికీ విద్యుత్ సౌకర్యం లభించింది. 32 కోట్ల మందికి ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చింది. భారత్ సామర్థ్యం ఆశ్చర్యకరం. అద్భుతం. స్వతంత్ర దేశంగా భారత్ సాధించిన అభివృద్ధి మిగతా దేశాలకు స్ఫూర్తిదాయకం. భారత్ సాధించిన పురోగతి ఈ శతాబ్దంలోనే అసాధారణ విజయం.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి విచ్చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు స్వాగతం. భారత్‌కు మీరు ప్రత్యేక స్నేహితుడు. మీ భారత పర్యటన ఈ దశాబ్దం ప్రారంభంలో చోటుచేసుకున్న అతిపెద్ద కార్యక్రమం. స్వస్థ, సంతోషకర అమెరికా కోసం మీరు చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇస్తోంది. మీ దేశంలోని భావితరాల కోసం మీరు చేపట్టిన ప్రణాళికలు అభినందనీయం. భారత్, అమెరికా సహజ మిత్రదేశాలు. మీ పర్యటన ఇరు దేశాల సంబంధాల్లో కొత్త చరిత్ర సృష్టిస్తుంది.

ప్రధాని నరేంద్ర మోదీ

లవ్‌యూ ఇండియా

రాట్నం తిప్పి.. నూలు వడికి

సుచిన్.. షోజే..చీవాలా!!

చేతిలో చెయ్యేసి

రాజహంసలా..

పూర్తి వివరాలు 9,10ల్లో

ఢిల్లీలో సీఏఏపై ఘర్షణ

హెడ్‌కానిస్టేబుల్ సహా నలుగురు మృతి

- సీఏఏపై ఢిల్లీలో సోమవారం కూడా ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఢిల్లీ ఈశాన్య దిక్కున ఉన్న మౌజ్‌పూర్ ప్రాంతంలో సీఏఏ మద్దతుదారులు, వ్యతిరేకులు ఇద్దరూ ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. ఈ ఘటనల్లో పోలీస్ హెడ్ కానిస్టేబుల్, ముగ్గురు పౌరులు మరణించినట్లు అధికారులు తెలిపారు. - వివరాలు 12లో

మలేసియా ప్రధాని రాజీనామా

- మలేసియాలో రాజకీయం రసకందాయంలో పడుతోంది. సోమవారం చోటుచేసుకున్న పరిణామాల్లో భాగంగా ప్రధాని మహాతీర్ మహమ్మద్ తన పదవికి రాజీనామా చేశారు. - 12లో

అనివార్య కారణాల వల్ల ఈరోజు సాగుబడి, భవిత పేజీలు ఇవ్వలేక పోతున్నాం. పాఠకులు గమనించగలరు.

ఇకంపుకాత్

...లేటెస్ట్ ట్రెండ్ అదేనట!

కన్నబిడ్డను చూడకుండానే..

స్వైన్‌ఫ్లూతో గాంధీ ఆస్పత్రిలో చేరిన గర్భిణి

ఆడశిశువుకు జన్మనిచ్చి.. కన్నుమూత

సీజన్‌తో సంబంధం లేకుండా విజృంభిస్తున్న వైరస్

ఇప్పటివరకు 148 కేసులు నమోదు.. ఇద్దరు మృతి

సాక్షి, హైదరాబాద్

నవమాసాలు మోసి, బిడ్డను కని.. అమ్మతనాన్ని ఆనందించకుండానే ఆ తల్లి కన్నుమూసింది. మరోపక్క పుట్టిన బిడ్డ కనీసం ముర్రుపాలకూ నోచుకోలేదు. తల్లి స్పర్శకు నోచుకోక ఆస్పత్రి ఎన్ఐసీయూలో ప్రస్తుతం ఆ శిశువు క్షేమంగా ఉన్నా.. తల్లిని కోల్పోవడం విషాదాన్ని మిగిల్చింది. కరీంనగర్‌కు చెందిన గర్భిణి షహనాజ్ (24) తీవ్ర జ్వరం, జలుబు, తలనొప్పితో బాధపడుతుండటంతో వరంగల్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. స్వైన్‌ఫ్లూగా అనుమానించిన వైద్యులు.. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి సిఫార్సు చేశారు. శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్న ఆమెను బంధువులు వెంటిలేటర్ సాయంతో ఈ నెల 18న రాత్రి పొద్దుపోయాక గాంధీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు ఆమెకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, స్వైన్‌ఫ్లూ పాజిటివ్‌గా తేలింది. అప్పటికే ఆమెకు నెలలు నిండటం, పరిస్థితి విషమంగా ఉండటంతో 19వ తేదీన సిజేరియన్ చేశారు. ఆడశిశువు జన్మించింది. శిశువుకు పరీక్షలు నిర్వహించగా, ఫ్లూ నెగెటివ్ రావడంతో బిడ్డను ఇదే ఆస్పత్రి పీడియాట్రిక్ విభాగంలోని ఎన్ఐసీయూకు తరలించారు. వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే ప్రమాదం ఉండటంతో తల్లిని ఐసోలేషన్ వార్డుకు తరలించి చికిత్స అందించారు. ఫ్లూ బారి నుంచి కాపాడేందుకు వైద్యులు ఎంతగా ప్రయత్నించినా.. పరిస్థితి విషమించి షహనాజ్ సోమవారం కన్నుమూసింది. బిడ్డను కళ్లారా చూడకుండానే

మిగతా 2వ పేజీలో ▶

ట్రంప్ దంపతులకు సీఎం కానుకలు

నేడు ఢిల్లీకి ముఖ్యమంత్రి కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దంపతులతోపాటు వారి కుమార్తె ఇవాంకకు సీఎం కేసీఆర్ కానుకలు అందించనున్నారు. ట్రంప్ గౌరవార్థం రాష్ట్రపతి మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు ప్రత్యేక ఆహ్వానితుడిగా కేసీఆర్ హాజరు కానున్నారు. ఇందుకోసం ఆయన మంగళవారం ఢిల్లీ వెళ్లనున్నారు. కార్యక్రమంలో ఆయన ట్రంప్‌కు పోచంపల్లి శాలువా కప్పి చార్మినార్ మెమెంటో అందించనున్నారు. మెలానియా, ఇవాంకలకు పోచంపల్లి, గద్వాల చీరలను బహూకరించనున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా పరిచయం

హైదరాబాద్ తరహా అన్ని మున్సిపాలిటీల్లో అమలు

- వార్డు ప్రజలతో పారిశుధ్య సిబ్బంది మమేకం అద్భుతం
- పట్టణ ప్రగతిలో వార్డు కమిటీలదే క్రియాశీలక పాత్ర
- ఏప్రిల్ 2 నుంచి టీఎస్‌బీపాస్ అమలు
- పురపాలికల్లో అవినీతిరహిత పాలనకు నాంది
- మహబూబ్‌నగర్‌లో పట్టణ ప్రగతి ప్రారంభోత్సవంలో కేటీఆర్

2 లో

"'అసలు సమస్యలు దళిత, గిరిజన, మురికివాడల్లోనే అత్యధికంగా ఉంటాయనేది సీఎం కేసీఆర్ నమ్మకం. అందుకే ప్రభుత్వం చేపట్టే ఏ కార్యక్రమమైనా అది దళిత, గిరిజన, మురికివాడల నుంచే ప్రారంభించాలని సూచించారు. ఈ మేరకు పట్టణంలోని మురికివాడ అయిన పాత తోటలో పర్యటించి అక్కడి ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకుని పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని ప్రారంభించుకున్నాం' – మంత్రి కేటీఆర్

సోమవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని పాతతోటలో వేణమ్మతో కరచాలనం చేసి ముచ్చటిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

శ్రీశైలం నుంచి సాగర్‌కు నీటి విడుదల చేయండి

ఏపీకి కృష్ణా బోర్డు ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నాగార్జునసాగర్‌కు నీటి విడుదలకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్‌ను కృష్ణా బోర్డు ఆదేశించింది. శ్రీశైలం నుంచి సాగర్‌కు 63 టీఎంసీల నీటిని విడుదల చేయాలని గతంలో ఆదేశించినప్పటికీ 50 రోజుల్లో కేవలం 10.94 టీఎంసీలు మాత్రమే విడుదల చేశారని తెలిపింది. శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేయకుంటే సాగర్ కింద రెండు రాష్ట్రాల తాగు, సాగునీటి అవసరాలు తీరడం కష్టమేనని పేర్కొంది. ఈ మేరకు బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం సోమవారం రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలకు లేఖ రాశారు. శ్రీశైలం నుంచి 50 రోజుల వ్యవధిలో 2,524 క్యూసెక్కుల మేర మాత్రమే సాగర్‌కు విడుదల చేస్తుండటంతో ఆవిరి నష్టాలు గణనీయంగా ఉన్నాయని, శ్రీశైలంలో రోజుకు 470 క్యూసెక్కులు, సాగర్‌లో 300 క్యూసెక్కుల ఆవిరి నష్టాలు చోటుచేసుకుంటున్నట్లు లేఖలో తెలిపారు.

పోలీస్ నియామకాలపై సుప్రీం నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: 2015లో జరిగిన పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో అర్హులకు అన్యాయం జరిగిందంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. అభ్యర్థి బండ శ్రీనివాస్‌గౌడ్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై ప్రతివాదులైన తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డులు 4 వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని జస్టిస్ ఎ.ఎం.ఖన్విల్కర్, జస్టిస్ దినేశ్ మహేశ్వరితో కూడిన ధర్మాసనం సోమవారం ఆదేశించింది.

ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ సెక్రటరీ బల్వీందరే..

ప్రెస్ కౌన్సిల్ చైర్మన్ జస్టిస్ సీకే ప్రసాద్ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) సెక్రటరీ జనరల్‌గా బల్వీందర్ సింగ్ జమ్మూను తాము గుర్తిస్తున్నట్లు ప్రెస్ కౌన్సిల్ చైర్మన్ జస్టిస్ సీకే ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను ఐజేయూ యూనియన్ సెక్రటరీ జనరల్ అని తప్పుగా చెప్పుకున్న సబీనా ఇందర్‌జిత్ ప్రతిపాదించిన ప్యానెల్‌ను తిరస్కరించామన్నారు. ప్రభాత్ డాష్ స్థానంలో ప్రెస్ కౌన్సిల్‌కు నామినేషన్ కోసం కేరళకు చెందిన బషీర్ మదాలా, మణిపూర్‌కు చెందిన బిజోయ్ కాకింగ్‌టాబాం పేర్లను ఆమె ప్రతిపాదించి వారిని బలిపశువులు చేసిందని ఆరోపించారు. ఢిల్లీలో జరిగిన సమావేశంలో ప్రెస్ కౌన్సిల్ చైర్మన్ ఆనంద్‌రానా (నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్) నామినేషన్‌ను అంగీకరించారని తెలిపారు. తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఐజేయూ కార్యకలాపాలకు అంతరాయం కలిగించాలనుకున్న సబీనా ఇందర్‌జిత్ వ్యవహారం ఇప్పుడు మరోసారి బట్టబయలైందన్నారు. శ్రీనివాస్ రెడ్డి, అమర్, బల్వీందర్ జమ్మూ, అమర్‌నాథ్ యూనియన్‌కు ప్రాతినిధ్యం వహించారని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు ఏపీ ప్రాధాన్యమిస్తోంది

బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ బీఎంకే రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తోందని ఏపీ రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ బీఎంకే రెడ్డి తెలిపారు. తెలంగాణలో అమలు చేస్తున్న అటవీ సంరక్షణ చర్యలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో విజయవంతమైన విధానాలను పరిశీలించేందుకు అటవీ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమైనట్లు చెప్పారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న రెడ్డి.. సోమవారం అరణ్యభవన్‌లో తెలంగాణ అటవీ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అటవీ శాఖ అమలుచేస్తున్న వివిధ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పీసీసీఎఫ్ ఆర్.శోభ వివరించారు. హరితహారం విశిష్టత, గత ఐదేళ్లుగా సాధించిన ప్రగతితో పాటు, జంగల్ బచావో, జంగల్ బడావో నినాదాన్ని అమలు చేస్తూ అటవీ సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను తెలిపారు. స్థానిక సంస్థల నిధుల్లో 10 శాతం పచ్చదనం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తోందని ఆమె వెల్లడించారు. సమావేశంలో అదనపు పీసీసీఎఫ్‌లు లోకేశ్ జైస్వాల్, ఎంసీ పర్గెయిన్, సిద్ధానంద్ కుక్రేటీ, డిప్యూటీ కన్జర్వేటర్ రామ్మూర్తి పాల్గొన్నారు.

అమెరికా ప్రయోజనాల కోసమే ట్రంప్ పర్యటన: సీపీఎం

సాక్షి, హైదరాబాద్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పర్యటన ఆ దేశ ప్రయోజనాల కోసమే తప్ప భారత్‌కు ఒరగబెట్టేదేమి లేదని సీపీఎం విమర్శించింది. అమెరికాలో నివసిస్తున్న 40 లక్షల మంది భారతీయులకు గ్రీన్‌కార్డులు, శాశ్వత లీగల్ రెసిడెన్సీలు, అక్కడ పుట్టిన శిశువులకు ఇచ్చే పౌరసత్వం తదితరాల రద్దును సోమవారం నుంచి అమలు చేస్తుండటంతో అక్కడ నివసిస్తున్న భారతీయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొంది. దీని గురించి ప్రధాని మోదీ ఏమీ మాట్లాడటం లేదని సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. ట్రంప్-మోదీల మధ్య జరుగుతున్న చర్చలు, ఒప్పందాలు దేశ సార్వభౌమత్వాన్ని కాలరాసే పద్ధతుల్లో ఉన్నాయని దుయ్యబట్టారు.

మూడ్రోజులు పొడి వాతావరణం

సాక్షి, హైదరాబాద్: దక్షిణ ఛత్తీస్‌గఢ్, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. మరోవైపు రాష్ట్రంలో ప్రధానంగా ఆగ్నేయ దిశ నుంచి గాలులు వీస్తున్నాయి. దీంతో రాగల మూడ్రోజులు పొడి వాతావరణం ఉండే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇక గడిచిన 24 గంటల్లో రంగారెడ్డి జిల్లా తాళ్లపల్లిలో 13 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదైంది. నాగర్‌కర్నూలు జిల్లా కొండారెడ్డిపల్లి, మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్, వికారాబాద్ జిల్లా కోటిపల్లి, మేడ్చల్ జిల్లా భాగ్యనగర్ నందనవనం, రంగారెడ్డి జిల్లా మంగళ్‌పల్లి, రాజేంద్రనగర్‌లలో 14 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

ప్రగతి బాటలో పట్టణం!

- రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రగతి కార్యక్రమం షురూ
- పలుచోట్ల ప్రారంభించిన మంత్రులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 140 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలోని 3,456 మున్సిపల్ వార్డుల్లో సోమవారం పట్టణ ప్రగతి కార్యక్రమం మొదలైంది. పలుచోట్ల మంత్రులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాల రూపురేఖలు మార్చడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ మార్గదర్శనంలో పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలు రూపుదిద్దుకున్నాయని పేర్కొన్నారు. పట్టణ ప్రగతిలో ప్రజల భాగస్వామ్యంతోనే పచ్చదనం-పరిశుభ్రత విజయవంతమవుతుందని స్పష్టంచేశారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పనులు నిర్వహించాలని సూచించారు. హరితహారం, పారిశుద్ధ్యం, విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.

ఈ పదవి మీరు పెట్టిన భిక్ష: ఈటల

''నాకు మంత్రి పదవి మా అమ్మ ఇవ్వలే. హుజూరాబాద్ ప్రజలు ఓట్లు వేస్తే వచ్చింది. ఈ పదవి మీరు పెట్టిన భిక్ష. నా కారులో మీరు పెట్రోలు పోస్తే నేను తిరుగుతున్నాను అని ప్రతిక్షణం గుర్తుపెట్టుకుని పనిచేస్తున్నాను''అని మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. హుజూరాబాద్‌లో పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నడిచే ఎద్దును పొడుస్తారని, పనిచేసేవాడి దగ్గరికే ప్రజలు వస్తారని.. ఈ నేపథ్యంలో ప్రతి కౌన్సిలర్ రోజూ ఉదయం వార్డుల్లో తిరగాలని సూచించారు. పుట్టక ముందు నుంచి చని పోయిన తర్వాత వరకు ఏం కావాలో అవన్నీ ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం మనదని వ్యాఖ్యానించారు. గుడిసెల్లో ఉండేవారికి, ప్లాస్టిక్ కవర్ల కింద ఉన్నవారికి ముందుగా 500 డబుల్ బెడ్‌రూం ఇళ్లు రెడీ అవుతున్నాయని చెప్పారు. అలాగే సొంత జాగాలో ఇల్లు కట్టుకునేందుకు అవకాశం ఇవ్వాలని సీఎం కేసీఆర్‌తో మాట్లాడుతున్నట్టు వెల్లడించారు. ప్రజలు కూడా తమ బాధ్యత మరవకుండా అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ అధికారులు చెత్తా చెదారం లేని, మురికి నీరు లేని, పచ్చని చెట్లతో ఉన్న పట్టణం తయారు చేయాలని సూచించారు.

సైకిల్‌పై తిరిగిన పువ్వాడ...

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 11వ డివిజన్ మాణిక్యనగర్‌లో పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు. మురికి కాలువలో పూడిక తొలగించి, మొక్కలు నాటారు. అనంతరం సైకిల్‌పై పలు ప్రాంతాల్లో తిరుగుతూ అక్కడ నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ అనురాగ్ జయంతిని ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలో జరిగిన పట్టణ ప్రగతి కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లెనిన్ నగర్‌లో మంత్రి సబితా ఇంద్రారెడ్డి పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ప్రతిభకు పట్టం కడదాం..

సాక్షి ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ 6వ ఎడిషన్ • ఎంట్రీలకు మార్చి 31 చివరి గడువు

సాక్షి, హైదరాబాద్: ప్రతిభ ఏదైనా పట్టం కట్టేందుకు 'సాక్షి'సిద్ధమైంది. రంగం ఏదైనా ప్రతిభే కొలమానంగా అవార్డులను అందించనుంది. త్యాగం, నైపుణ్యం, ప్రతిభ, కళ ఎక్కడ ఏ రూపంలో ఉన్నా వెలికితీస్తోంది. 'సాక్షి'ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ పేరిట సత్కరిస్తోంది. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా 'సాక్షి'ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ 6వ ఎడిషన్‌కు ఎంట్రీలను ఆహ్వానిస్తోంది. మార్చి 31న సాయంత్రం 6 గంటల వరకు ఎంట్రీలను పంపవచ్చు. ఈసారి ఎంట్రీలను ఆన్‌లైన్‌లో కూడా అప్‌లోడ్ చేయవచ్చు. ప్రతిభను గుర్తెరిగిన ఇతరులెవరైనా.. ఆయా వ్యక్తులు, సంస్థల తరపున ఎంట్రీలను పంపవచ్చు. కొన్ని అంశాల్లో యువతరానికి, ప్రవాస భారతీయులకు కూడా అవార్డులు ఉన్నాయి. సందర్భాన్ని బట్టి 'జ్యూరీ ప్రత్యేక ప్రశంస'కూడా లభించవచ్చు. సమాజ హితం కోరే ముఖ్యులతో ఏర్పాటైన 'జ్యూరీ'సాక్షికి లభించిన ఎంట్రీల నుంచి విజేతలను నిర్ణయిస్తుంది. నైపుణ్యాలను ప్రశంసించడం, సేవలను కొనియాడడం, సాధనను అభినందించడం ఎవరైనా చేయదగినదే. ఈ భావన కలిగిన వారంతా తమకు తెలిసిన ప్రతిభామూర్తుల్ని గుర్తించి, వారి పేర్లను ప్రతిపాదిస్తూ అవార్డుల కోసం ఎంట్రీలను పంపుతారని 'సాక్షి'అభిలషిస్తోంది. సాక్షి చేస్తున్న ఈ కృషికి అందరూ చేయూతనివ్వండి. నామినేషన్‌ల ఎంట్రీలను నేరుగా అప్లికేషన్ ఫామ్‌లో ఇచ్చిన చిరునామాకు పంపవచ్చు. లేదా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు 'www.sakshiexcellenceawards.com' వెబ్‌సైట్‌కు లాగిన్ కావచ్చు. పూర్తి వివరాల కోసం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు (వర్కింగ్ డేస్‌లో) 040-23322330 నంబరు ద్వారా లేదా 'sakshi excellenceawards2019@sakshi.com' మెయిల్ ద్వారా సంప్రదించవచ్చు.

భారతి సిమెంట్

రాష్ట్రవ్యాప్తంగా 'పరిచయం'

హైదరాబాద్ తరహా అన్ని మున్సిపాలిటీల్లో అమలు • మహబూబ్‌నగర్‌లో పట్టణ ప్రగతి కార్యక్రమం ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'గ్రేటర్ హైదరాబాద్‌లో 'పరిచయం'కార్యక్రమంతో పారిశుద్ధ్య సిబ్బంది, వార్డుల్లో ఉండే కుటుంబాలతో పరిచయం పెంచుకొనేలా చేశాం. సిబ్బంది తమతమ వార్డుల్లో పర్యటిస్తూ ఆ ప్రాంత ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. ఫలితంగా నగరంలో పారిశుద్ధ్యం మెరుగుపడుతోంది. ప్రజలు కూడా శానిటేషన్‌పై శ్రద్ధ వహిస్తున్నారు. పట్టణ ప్రగతి కార్యక్రమం ద్వారా మనం ఆశిస్తున్న లక్ష్యం నెరవేరాలంటే ఇది రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లోనూ అమలు కావాలి. అందుకు ఇక్కడి నుంచే మున్సిపల్ శాఖ డైరెక్టర్ సత్యనారాయణను ఆదేశిస్తున్నా' అని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పరిచయం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అధికారులు వార్డుల వారీగా నియమించిన పారిశుద్ధ్య సిబ్బంది పేరు, సెల్‌ఫోన్ నంబర్లను విధిగా ఆయా ప్రాంతాల్లో గోడలపై రాయించాలని ఆదేశించారు. పట్టణ ప్రగతి కార్యక్రమం ప్రారంభోత్సవంలో భాగంగా సోమవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలసి ఆయన మహబూబ్‌నగర్‌లో పర్యటించారు. ముందుగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి కేటీఆర్.. పాత తోట మురికివాడలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలతో ముచ్చటించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారికి పింఛన్లు, తాగునీరు వస్తున్నాయా లేదా ఆరా తీశారు. ఈ సందర్భంగా చాలా మంది మహిళలు మంత్రికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇప్పించాలని వేడుకున్నారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. అనంతరం అప్పన్నపల్లిలోని వైట్‌హౌజ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణ ప్రగతి-అమలు అంశంపై నూతనంగా నియమితులైన వార్డు అధికారులు, కమిటీ సభ్యులు, కౌన్సిలర్లకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. అన్ని మున్సిపాలిటీల్లోనూ ఇప్పటికే తడి, పొడి చెత్త కోసం ప్రత్యేక డబ్బాలు పంపిణీ చేస్తే కొందరు వాటిలో బియ్యం, పప్పు నిల్వ ఉంచుకున్నారని మంత్రి చెప్పారు. తడిచెత్తతో వర్మి కంపోస్టు ఎరువులు, పొడిచెత్తతో విద్యుత్ ఉత్పత్తి చేయొచ్చనే విషయాన్ని గ్రహించాలన్నారు. తన నియోజకవర్గం సిరిసిల్లలో తడి, పొడి చెత్త వేరు చేయడం వల్ల వాటిని రైతులకు విక్రయిస్తున్న మెప్మా సభ్యులు ప్రతి నెల రూ.3 లక్షల వరకు సంపాదిస్తున్నారని మంత్రి వివరించారు. అన్ని మున్సిపాలిటీలకు కేటాయించిన బడ్జెట్‌లో పచ్చదనం కోసం 10 శాతం పచ్చదనం పరిరక్షణ కోసం కేటాయించామన్నారు. పట్టణప్రగతిలో భాగంగా నియమించిన గ్రీన్ బ్రిగేడ్ సభ్యులు వార్డుల్లో పర్యటిస్తూ.. ప్రతి ఇంటికి ప్రజలు ఏ మొక్కలు అడిగినా ఆ మొక్కల్ని పంపిణీ చేయాలన్నారు. మొక్కలు పెరిగేలా సంబంధిత కౌన్సిలర్లే చొరవ తీసుకోవాలన్నారు. నాటిన మొక్కల్లో 85 శాతం వరకు బతకకపోతే కౌన్సిలర్ తన పదవిని కోల్పోతారని హెచ్చరించారు.

ఏప్రిల్ రెండు నుంచి టీఎస్‌బీపాస్..

పురపాలికల్లో అవినీతి రహిత పాలన కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 2 నుంచి టీఎస్‌బీపాస్‌ను అమల్లోకి తెస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఇళ్లు, భవన నిర్మాణాల కోసం ప్రజలు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోసం మున్సిపల్ కార్యాలయానికి రానవసరం లేదని చెప్పారు. 75 గజాల వరకు స్థలంలో ఇంటి నిర్మాణానికి మున్సిపల్ అనుమతులు అవసరం ఉండబోవని స్పష్టం చేశారు. 75 గజాల నుంచి 600 గజాల వరకు నిర్మాణానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే 21 రోజుల్లోపే అనుమతులు వస్తాయన్నారు. రాలేదంటే మున్సిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారి అనుమతులను పోస్టు ద్వారా ఇంటికే పంపిస్తారన్నారు. స్వీయ ధ్రువీకరణతో ఇంటి పనులు నిర్ణయించుకుని చెల్లించొచ్చని, ఇచ్చిన సమాచారం తప్పని నిర్ధారణ అయితే అందుకు 25 రేట్లు అధికంగా జరిమానా పడుతుందన్నారు. ఇంటి నిర్మాణ సమాచారం తప్పుగా ఇస్తే అనుమతులు రద్దు అవుతాయన్నారు.

సోమవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని పాత తోట మురికివాడలో పాదయాత్ర చేస్తున్న మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్

ప్రజలకు దగ్గరయ్యేందుకే..

'వచ్చే నాలుగేళ్ల వరకు ఎలాంటి ఎన్నికల్లేవు. అయినా టీఆర్ఎస్ ప్రభుత్వం నూతన సంస్కరణలు, పథకాలకు శ్రీకారం చుడుతోంది. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి ఇలా ఏ కార్యక్రమమైనా ప్రజలకు మంచి చేయాలన్నదే మా ఉద్దేశం. ఇందులో రాజకీయ ఆపేక్ష ఏ మాత్రం లేదు'అని కేటీఆర్ స్పష్టం చేశారు. టీఆర్ఎస్సేతర కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులనూ అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీలు దామోదర్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిపై హత్యాచారం.. దోషికి ఉరి

- 'పోక్సో' చట్టం కింద ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారి..
- చిత్తూరు జిల్లా అంగళ్లు పంచాయతీలో దారుణ కృత్యం
- పోక్సో కోర్టులో విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు
- సంచలనాత్మక తీర్పునిచ్చిన న్యాయమూర్తి వెంకట హరినాథ్

చిత్తూరు అర్బన్: ఒకటో తరగతి చదువుతున్న అభం శుభం తెలియని చిన్నారిపై అత్యంత దారుణంగా లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన కిరాతకుడికి న్యాయస్థానం ఉరి శిక్ష విధించింది. ఏపీలో చిత్తూరు నగరంలోని పోక్సో (లైంగిక దాడుల నుంచి చిన్న పిల్లల పరిరక్షణ) న్యాయస్థానం పూర్తి అదనపు ఇన్‌చార్జి న్యాయమూర్తి, మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎం.వెంకట హరినాథ్ సోమవారం ఈ మేరకు తీర్పునిచ్చారు. కేసు వివరాలను ప్రత్యేక అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.లోకనాథరెడ్డి, మదనపల్లె డీఎస్పీ రవి మనోహరాచారి విలేకరులకు వివరించారు. చిత్తూరు జిల్లా బి.కొత్తకోటకు చెందిన ఐదేళ్ల చిన్నారి గతేడాది నవంబర్ 7వ తేదీ రాత్రి కుర బలకోట మండలం అంగళ్లు పంచాయతీలో జరిగిన ఓ వివాహానికి తల్లిదండ్రులతో కలసి వచ్చింది. అందరూ భోజనాలు చేసిన తర్వాత ఆడుకుంటూ ఒంటరిగా కన్పించిన బాలికపై మదనపల్లెలోని బసినికొండకు చెందిన మహ్మద్ రఫీ (25) కన్ను పడింది. లారీడ్రైవర్ అయిన రఫీ ఆమెకు ఐస్‌క్రీమ్ ఆశ చూపించి కల్యాణ మండపంలో ఉన్న బాత్‌రూమ్‌కు తీసుకెళ్లాడు. పాప అరవకుండా నోరు గట్టిగా నొరు మూసి లైంగిక దాడికి పాల్పడ్డాడు. తర్వాత చిన్నారినే కనికరం కూడా లేకుండా గొంతునులిమి చంపేశాడు. మృతదేహం కన్పించకుండా కల్యాణ మండపం పక్కన పడేసి వెళ్లిపోయాడు. రాత్రంతా పాప కోసం గాలించిన తల్లిదండ్రులు మరుసటిరోజు తెల్లవారుజామున పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులకు కల్యాణ మండపం ప్రహరీ పక్కనున్న ఓ గుంతలో పాప మృతదేహం లభించింది. అక్కడి సీసీ కెమెరాల్లో ఉన్న ఫుటేజీల ఆధారంగా నిందితుడి ఊహా చిత్రాన్ని రూపొందించి సమీప ప్రాంతాల్లోని ప్రజలను విచారించగా రఫీ ఘాతుకం బట్ట బయలైంది. ఎస్పీ సెంథిల్ కుమార్ ఆదేశాలతో రంగం లోకి దిగిన ప్రత్యేక బృందం పరారీలో ఉన్న రఫీని పట్టుకుంది. నవంబర్ 16న పోలీసులు అతన్ని అరెస్టు చేసి మదనపల్లె జూనియర్ మునిసిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. రఫీ తన 15వ ఏటే ఓ బాలికపై అత్యాచారయత్నం చేశాడని, ఆ కేసుకు సంబంధించి కొన్నాళ్లు జువనైల్ హోమ్‌లో కూడా ఉన్నట్లు విచారణలో గుర్తించారు.

దోషి రఫీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ

అప్పటికే తెలంగాణలో దిశ కేసు వెలుగు చూసిన నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం చిన్నారి హత్యకేసు విచారణ చిత్తూరులోని పోక్సో కోర్టులో నిర్వహించాలని ఆదేశాలు జారీచేసింది. ఇందుకోసం ప్రత్యేకంగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ లోకనాథరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. మరోవైపు పోలీసులు 17 రోజుల్లోనే అన్ని సాక్ష్యాలను సేకరించి న్యాయస్థానంలో నేరాభియోగ పత్రాన్ని (చార్జిషీట్) దాఖలు చేశారు. గతేడాది డిసెంబర్ 12వ తేదీన విచారణ ప్రారంభించిన పోక్సో కోర్టు.. నిందితుడు అరెస్టయిన వంద రోజుల్లోనే విచారణ పూర్తిచేసి తీర్పునిచ్చింది.

హేయమైన నేరం

చిన్నారిపై అత్యాచారానికి పాల్పడి, హత్య చేయడం హేయమైన, నీచమైన నేరంగా న్యాయమూర్తి పేర్కొన్నారు. రఫీని దోషిగా నిర్ధారించి ఉరిశిక్ష విధిస్తున్నట్లు తీర్పునిచ్చారు. అలాగే రూ.3 వేల జరిమానా చెల్లించాలని, చెల్లించని పక్షంలో అదనంగా 9 నెలల జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. తీర్పు ప్రతులను హైకోర్టుకు పంపుతామని, ఉరిశిక్ష తేదీని హైకోర్టు ఖరారు చేస్తుందని న్యాయమూర్తి వెంకట హరినాథ్ తెలిపారు.

72 పేజీల తీర్పు...

- న్యాయమూర్తి మొత్తం 72 పేజీలలో తన తీర్పు వెలువరించారు. పోక్సో చట్టంలోని సెక్షన్ 5 (జే) (4) రెడ్‌విత్ సెక్షన్ 6 ప్రకారం 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1,000 జరిమానా విధించారు.
- మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినందుకు ఐపీసీ సెక్షన్ 376-ఏ, 376-ఏబీ ప్రకారం, పిల్లలపై లైంగిక దాడికి పాల్పడ్డందుకు పోక్సో చట్టం సెక్షన్ 5 (ఎం) రెడ్‌విత్ సెక్షన్ 6 ప్రకారం జీవితఖైదు, రూ.వెయ్యి ఫైన్ విధించారు.
- హత్యానేరానికి గానూ ఐపీసీ 302 ప్రకారం యావజ్జీవ కఠినకారాగార శిక్ష విధించారు.
- మృతదేహం దొరక్కుండా సాక్షాలను తారుమారు చేయడానికి ప్రయత్నించినందుకు ఐపీసీ 201 ప్రకారం ఐదేళ్ల జైలుశిక్ష, వెయ్యి జరిమానా విధించారు.
- ఈ దారుణ నేరానికి పాల్పడినందుకు తుదిగా ముద్దాయికి ఉరిశిక్ష విధిస్తున్నట్లు న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు.

పోక్సో చట్టం కింద మొదటి మరణ శిక్ష: హోంమంత్రి

ఏపీలో పోక్సో చట్టం కింద పడిన మొదటి మరణ శిక్ష ఇది అని హోంమంత్రి మేక తోటి సుచరిత పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె ట్వీట్ చేశారు. 'చిత్తూరు సెషన్స్ కోర్టు చరిత్రాత్మక తీర్పు చెప్పింది. ఐదేళ్ల బాలికపై లైంగిక దాడి, హత్య కేసులో అరెస్టైన నిందితుడిని దోషిగా నిర్ధారించి మరణ శిక్ష విధించింది..' అంటూ ట్వీట్ చేశారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాత 17 రోజుల్లోనే చార్జిషీట్ దాఖలు చేసి, నిందితుడికి ఉరి శిక్ష పడేలా చేయడంలో పోలీసులు చేసిన కృషిని ప్రశంసిస్తూ ఆమె మరో ట్వీట్ చేశారు.

కన్నబిడ్డను చూడకుండానే..

▶ మొదటి పేజీ తరువాయి

మృతి చెందడం, తల్లిపాల కోసం బిడ్డ గుక్కపట్టి ఏడవటం కలచివేసింది.

విజృంభిస్తోన్న వైరస్

చలికాలంలో విజృంభించే హెచ్1ఎన్1 స్వైన్‌ఫ్లూకారక వైరస్.. ప్రస్తుతం సీజన్‌తో సంబంధం లేకుండా విస్తరిస్తోంది. జనవరి నుంచి రాష్ట్రంలో 148 కేసులు నమోదు కాగా, వీరిలో హైదరాబాద్ జిల్లావాసులే యాభై మందికిపైగా ఉన్నారు. బాధితుల్లో ఇప్పటికే ఒకరు మృతిచెందగా, తాజాగా బాలింత మృతితో మృతుల సంఖ్య రెండుకు చేరింది. గాలి ద్వారా ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. ప్రస్తుతం గాంధ

మిడ్‌మానేరు దిగువన ఎత్తిపోతలు మొదలు!

- అనంతగిరికి నీటి తరలింపునకు వీలుగా ముంపు గ్రామం ఖాళీకి చర్యలు
- ఈ వారంలోగా పంపులు నడిపించాలని ముఖ్యమంత్రి ఆదేశం
- 27న ప్రాజెక్టు పరిధిలో నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ పర్యటన

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మిడ్‌మానేరు నుంచి నీటిని కొండపోచమ్మ సాగర్ తరలించే ప్రక్రియను ఈ వారంలోనే మొదలు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే మిడ్‌మానేరు వరకు నీటి తరలింపు ప్రక్రియ పూర్తయినా, దిగువన పునరావాస సమస్యల కారణంగా ఆలస్యమవుతున్న నీటి ఎత్తిపోతలను పంపింగ్‌కు అన్ని విధాలా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించింది. అనంతగిరి రిజర్వాయర్ కిందున్న ముంపు గ్రామాల ప్రజలను ఖాళీ చేయించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు ప్రభుత్వ ఆదేశాలు వెళ్లాయి.

ఖాళీ చేయించి నింపాల్సిందే..

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నుంచి ఎల్లంపల్లి మీదుగా మిడ్‌మానేరుకు నీటి తరలింపు ప్రక్రియ కొనసాగుతోంది. మిడ్‌మానేరు రిజర్వాయర్‌లో 25.87 టీఎంసీల నిల్వలకు గానూ 24 టీఎంసీల మేర నిల్వలుండేలా చూస్తున్నారు. అయితే మిడ్‌మానేరు నుంచి నీటిని దిగువన ఉన్న అనంతగిరి, రంగనాయక్‌సాగర్ రిజర్వాయర్‌ల మీదుగా కొండపోచమ్మ సాగర్‌కు ఇప్పటికే తరలించాల్సి ఉన్నా ఈ ప్రక్రియ కొనసాగడం లేదు. మిడ్‌మానేరు నుంచి నీటిని అనంతగిరి రిజర్వాయర్‌లోకి తరలించేలా 64.5 మెగావాట్ల సామర్థ్యం గల 4 పంపులు గతేడాది చివరి నాటికే సిద్ధమయ్యాయి. 12.03 కి.మీ.ల టన్నెల్ సైతంపూర్తయింది. అయితే అనంతగిరి రిజర్వాయర్ కింద కొచ్చగుట్టపల్లి, అనంతగిరి గ్రామాలు పూర్తిగా ముంపునకు గురవుతుండగా, రూ.75 కోట్లతో భూసేకరణ ప్రక్రియ చేపట్టి, కొచ్చగుట్టపల్లిలో నిర్వాసితుల పునరావాస ప్రక్రియ పూర్తిచేశారు. అయితే అనంతగిరి గ్రామంలో మాత్రం 839 గృహాలను, 1,140 కుటుంబాలను తరలించాల్సి ఉన్నా, పునరావాస ప్రక్రియ పూర్తి కాలేదు. దీంతో రిజర్వాయర్‌లోకి నీటి తరలింపు సాధ్యం కావడం లేదు. అయితే ఈ గ్రామం ఖాళీ చేయించేలా పునరావాస ప్రక్రియకు రూ.150 కోట్ల పరిహార చెల్లింపులు పూర్తి కావడంతో మూడు, నాలుగు రోజుల్లోనే గ్రామాన్ని ఖాళీ చేయించాలని జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెళ్లాయి. దీంతో ఆ ప్రక్రియ సోమవారం నుంచి వేగం పుంజుకుంది. ఈ గ్రామాన్ని ఖాళీ చేసిన వెంటనే మిడ్‌మానేరు నుంచి పంపింగ్ మొదలు పెట్టనున్నారు. ఇటు ఈ వారంలోగా మిడ్‌మానేరు దిగువకు ఎత్తిపోతలు చేపట్టాలని సీఎం కేసీఆర్ సైతం ఇంజనీర్లను ఆదేశించారు. దీంతో ఈ నెల 27న నీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రజత్‌కుమార్ ప్రాజెక్టు పరిధిలో పర్యటించనున్నారు. అనంతగిరి దిగువన రంగనాయక్‌సాగర్ రిజర్వాయర్‌లోకి అట్నుంచి నీటిని తరలించేలా ఇప్పటికే ప్యాకేజీ-10, 11, 12ల్లో మోటార్లను పూర్తి స్థాయిలో సిద్ధం చేసి ఉంచారు. ప్యాకేజీ-10, 11లో 135 మెగావాట్ల సామర్థ్యమున్న 4 చొప్పున మోటార్లు, ప్యాకేజీ-12లో 43 మెగావాట్ల సామర్థ్యం గల 8 మోటార్లు ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోసేందుకు సిద్ధం చేశారు. ఇక్కడి నుంచి నీటిని 15 టీఎంసీల సామర్థ్యం గల కొండపోచమ్మ సాగర్‌లో నిల్వ చేసేలా దీనికిందున్న రెండు గ్రామాల ఖాళీకి చర్యలు మొదలయ్యాయి.

రోహింగ్యాలకు పింఛన్లా?

- కేసీఆర్, కేటీఆర్ స్పందించాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: దొంగపత్రాలతో భారత గుర్తింపు కార్డులు తీసుకుని, ప్రభుత్వ పింఛన్లు పొందుతున్న రోహింగ్యాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో అక్రమంగా నివసిస్తోన్న వేలాదిమంది రోహింగ్యాలు గుర్తింపు కార్డులతోపాటు, పాస్‌పోర్టు వంటి అత్యున్నత ధ్రువీకరణలు పొందుతున్న విషయంపై సోమవారం లక్ష్మణ్ ఆధ్వర్యంలోని బీజేపీ నాయకుల బృందం డీజీపీ మహేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేసింది. దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన రోహింగ్యాలలో చాలామంది ఐఎస్ఐ, అల్‌ఖైదా సానుభూతిపరులు ఉన్నారని ఆరోపించారు. వీరి వల్ల దేశభద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని, వెంటనే చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, రోహింగ్యాలు ధ్రువపత్రాలు తీసుకుంటూ పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు పొందుతున్నారని ఆరోపించారు. 189 మంది రోహింగ్యాలు ఆధార్, ఓటర్ కార్డు, పాసుపోర్టు వంటి ధ్రువీకరణలు సంపాదిస్తుంటే.. పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వీరికి ఆధార్ నుంచి నోటీసులు వస్తుంటే ఎంఐఎం అధినేత, ఎంపీ ఒవైసీ ఎందుకు ఉలిక్కిపడుతున్నారని ప్రశ్నించారు. విదేశీయులకు మజ్లిస్ పార్టీ మద్దతివ్వడం, ఈ మొత్తం వ్యవహారంపై అధికార పార్టీ చూసీచూడనట్లు వ్యవహరించడంపై మండిపడ్డారు. పాముకు పాలు పోసి పెంచుతున్న ఇలాంటి నాయకులకు టీఆర్ఎస్ మద్దతిస్తోందని, అది ఏదో ఒకరోజు తప్పకుండా కాటేస్తుందని హెచ్చరించారు. రోహింగ్యాలు నగరంలో భూములు కబ్జాచేసి, శాశ్వత కట్టడాలు కడుతుంటే టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహిస్తోందని విమర్శించారు. మార్చి 15వ తేదీన సీఏఏకు అనుకూలంగా నగరంలో తలపెట్టిన అమిత్‌షా సభను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామచంద్రరావు, నగర ప్రధాన కార్యదర్శులు, ఆలె జితేందర్, టి.రాజశేఖర్‌రెడ్డి, గౌతమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాన్సులేట్ ముట్టడికి యత్నం

- ట్రంప్ పర్యటనను వ్యతిరేకిస్తూ నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల ప్రతినిధులు
- అమెరికన్ కాన్సులేట్ కార్యాలయ ముట్టడికి యత్నించిన వారిని బలవంతంగా తరలిస్తున్న పోలీసులు

హైదరాబాద్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటనను నిరసిస్తూ తెలంగాణ రైతు సంఘం సమాఖ్య, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సంయుక్తంగా సోమవారం బేగంపేటలోని అమెరికన్ కాన్సులేట్ కార్యాలయ ముట్టడికి యత్నించారు. డొనాల్డ్ ట్రంప్ గో బ్యాక్, వి డోంట్ నీడ్ యువర్ చికెన్ లెగ్స్ అంటూ ఫ్లకార్డులను ప్రదర్శిస్తూ అమెరికన్ కాన్సులేట్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు ప్రవేశద్వారం వద్ద నిరసన తెలిపారు. కార్యాలయ రోడ్డులోకి దూసుకెళ్లేందుకు యత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. నిరసన ప్రదర్శన తీవ్రతరం కావడంతో పోలీసులు వారిని బలవంతంగా ప్రత్యేక వాహనంలో ఎక్కించి బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం సమాఖ్య అధ్యక్షుడు టి.సాగర్, ఏఐఏడబ్ల్యూయూ జాతీయ కార్యదర్శి పి.వెంకట్ మాట్లాడుతూ ట్రంప్ పర్యటన వల్ల దేశానికి ఒరిగేదేమీ లేదన్నారు. ట్రంప్ వ్యాపార ధోరణితోనే ఈ పర్యటన సాగిస్తున్నారన్నారు. అరెస్టయిన వారిలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, సీపీఐఎంఎల్ అనురాధ, తెలంగాణ రైతు సంఘం సమాఖ్య ఉపాధ్యక్షురాలు శోభన, కార్యదర్శి పద్మ, ఐద్వా నగర కార్యదర్శి అరుణ జ్యోతి, సీఐటీయూ నగర అధ్యక్షుడు ఈశ్వర్ రావు తదితరులున్నారు.

గాంధీభవన్ ట్రస్టీ మృతి పట్ల ఉత్తమ్ సంతాపం

సాక్షి, హైదరాబాద్: గాంధీభవన్ ట్రస్టీ డాక్టర్ ఎం.రాధాకిషన్ మృతి పట్ల టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సోమవారం ఓ ప్రకటనలో ఉత్తమ్ ఆకాంక్షించారు. రాధాకిషన్ మృతి పట్ల సంతాపం ప్రకటించిన వారిలో గాంధీభవన్ ట్రస్టీ సూర్యానాయక్, ఏపీసీసీ అధ్యక్షుడు శైలజానాథ్ ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాఖ్య మార్కెటింగ్ సమాఖ్య లిమిటెడ్
55-17-2 ఉ 4, 5వ అంతస్తు, స్టాటస్ కార్పొరేట్, బంజారాహిల్స్ ఎన్నెడీ, ఆలీనగర్, విజయవాడ-520 007
Email : procurement.apmarkfed@gmail.com
Webpage : www.apmarkfed.in
సవరణ
ఆంధ్రప్రదేశ్‌లో వివిధ గోదాములలో ఉన్న కందుల మందుల మమ్మకు e-Auction Platforms ద్వారా విక్రయము చేయుటకు షార్ట్ టెండర్ ప్రకటన తేది. 20.02.2020 న పత్రికా మరియు మీడియా స్టాండర్డ్ దిన పత్రికలలో ప్రచురితమైన పైన ఉదహరించిన సంక్షిప్త టెండర్ ప్రకటనకు సంబంధించిన ఈ-ఆక్షన్ తేదీని, తేది 11.03.2020 కు మార్చడమైనది. దయచేసి గమనించగలరు. ఇతర నియమ నిబంధనలలో ఎటువంటి మార్పు లేదు.
సం/- మేనేజింగ్ డైరక్టర్

తెలంగాణ ప్రభుత్వం
రీజినల్ ఆఫీసర్ కార్యాలయము, పంచాయతీరాజ్ రీజియన్, నిజామాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No. 582 & 583/2019-20 తేది: 20.02.2020
పనుల సంఖ్య(2). పనిపేరు: నిజామాబాద్ జిల్లాలో బోధన్ అసెంబ్లీ నియోజకవర్గంలో యెడపల్లి మండలంలోని యెడపల్లి గ్రామం వద్ద మినీ స్టేడియం మరియు ఆడిటోరియం & కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం కోసం దిగువ సంతకదారుచే ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు కోరబడుచున్నవి.
ECV: రూ. 200 లక్షలు. టెండరు షెడ్యూళ్లను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ సైట్ నుండి 24.02.2020 ఉ. 10.30 గం. నుండి అప్‌లోడ్ చేసుకోవచ్చును. ఆన్‌లైన్ టెండర్ దాఖలుకు ఆఖరు తేదీ: 02.03.2020 మ. 3.00 గం.వరకు. ఇతర వివరాలు మరియు తదుపరి నవరణలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.in నుండి పొందవచ్చును. ఫోన్ నం. 08462-239502.
సం/- రీజినల్ ఆఫీసర్, P.R. రీజియన్, నిజామాబాద్
DIPR RO.No. 2509-DP/CL/ADVT/1/2019-20; Dt : 24.02.2020

TS Ed.CET-2020 NOTIFICATION
OSMANIA UNIVERSITY, HYDERABAD (Conducted on behalf of TSCHE)
Telangana State Education Common Entrance Test (TS Ed.CET-2020) through Computer Based Test (CBT) for the year 2020 will be conducted by Osmania University, Hyderabad in accordance with G.O. Ms. No. 13 SE (Trg.) Dept. Dt. 27-05-2017 and amendments for admission into B.Ed (Two years) regular course offered in the Colleges of Education in Telangana State for the Academic Year 2020-2021. Eligible candidates should submit their application ONLINE mode only from 27-2-2020. Application registration fee of Rs. 650/- (Rs.450/- for SC / ST/ PH) should be paid at TS Online / AP Online / through Payment Gateway. The detailed information regarding the eligibility, syllabus, model paper, related instructions and procedure for Online submission of Applications are available on the website https://edcet.tsche.ac.in

Last date for Submission of online applications			Date & Time of Test:
	Without late fee	20-04-2020	23-05-2020
	With late fee of Rs. 500/-	25-04-2020	
	With late fee of Rs. 1,000/-	30-04-2020	11:00 A.M to 1:00PM &
	With late fee of Rs. 2,000/-	04-05-2020	3:00 PM to 5:00 PM

Date: 24-2-2020 CONVENER, TS. Ed.CET - 2020

తెలంగాణ ప్రభుత్వం
మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, హైదరాబాద్
Rc.No.E/115/2020 తేది: 24-02-2020
MJPTBCW రెసిడెన్షియల్ జూనియర్ & డిగ్రీ కళాశాలలలో ప్రవేశం కొరకు
MJPTBCWRJC & RDC-CET-2020
ప్రవేశ ప్రకటన
మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ జూనియర్ కళాశాలల్లో 2020-21 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశం కొరకు తేది 19-04-2020 నాడు జరుగు MJPTBCWRJC & RDC-CET-2020 ప్రవేశ పరీక్షకు 10వ తరగతి మార్చి 2020 మరియు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం మార్చి 2020 పరీక్షకు హాజరౌతున్న తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల విద్యార్థుల నుండి ఆన్‌లైన్‌లో mjptbcwreis.telangana.gov.in & mjptbcwreis.cgg.gov.in ద్వారా దరఖాస్తులు కోరబడుచున్నవి.
జూనియర్ కళాశాలలు (ఇంగ్లీషు మీడియం)
• జూనియర్ కళాశాలలు (బాలురు-12, బాలికలు-7) • గ్రూపులు: MPC, BiPC, CEC, HEC & MEC
మహిళా డిగ్రీ కళాశాల-1 (ఇంగ్లీషు మీడియం)
• కోర్సులు: 1) B.Sc., MPC (Maths, Physics, Chemistry) 2) B.Sc., MSCS (Maths, Statistics, Computer Science) 3) B.Sc., MPCS (Maths, Physics & Computer Science) 4) B.Sc., BZC (Botany, Zoology, Chemistry) 5) B.Sc., BBC (Bio-Chemistry, Bio-Technology & Chemistry) 6) B.A., HEP (History, Economics, Political Science) 7) B.A., HPE (History, Political Science & English) 8) B.Com., (General) 9) B.Com., (Computers)
ప్రవేశము కొరకు ఆన్‌లైన్‌లో mjptbcwreis.telangana.gov.in & mjptbcwreis.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేయుటకు.
ముఖ్యమైన తేదీలు: • ప్రారంభ తేది 27-02-2020 • చివరి తేది 07-04-2020 • హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ తేది 13-04-2020 • ప్రవేశ పరీక్ష తేది 19-04-2020 • దరఖాస్తు రుసుము రూ.200/-
సూచనలు:- • జూనియర్ మరియు డిగ్రీ కళాశాల ప్రవేశ పరీక్ష తేది 19-04-2020 ఉదయం 10 గం॥ నుండి మధ్యాహ్నం 12:30 గం॥ వరకు నిర్వహించబడును. • ప్రవేశ పరీక్ష తెలుగు మరియు ఇంగ్లీషు మాధ్యమంలో నిర్వహించబడును. • విద్యార్థుల ఎంపిక: ప్రవేశ పరీక్షలో ప్రతిభ మరియు రిజర్వేషన్ ద్వారా ఎంపిక చేయబడును. • తదుపరి వివరాలు మరియు ఇన్స్ట్రక్షన్ బ్రోచర్‌కై mjptbcwreis.cgg.gov.in ను సందర్శించండి. • వివరాలకు కార్యాలయ పనివేళల్లో 040-23328266 ఫోన్ నెంబర్‌లో సంప్రదించగలరు.
సం/- మల్లయ్య బట్టు, కార్యదర్శి,
మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ
DIPR Ro. No.704PP/CL/ADVT/1/2019-20, Dt:24-02-2020

సైబర్ నేరాలను అరికట్టే పరిశోధన కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి

అత్యాధునిక సాంకేతికతతో సైబర్ నేరాల అదుపు

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి

హైదరాబాద్: అత్యాధునిక పరిశోధన, శిక్షణతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోనే సైబర్ నేరాలను అదుపు చేయవచ్చునని ఇందుకు పోలీసు అధికారులు ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని సైబర్ నేరాలను అరికట్టడానికి కృషి చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం రామంతాపూర్‌లోని కేంద్ర గూఢచార (డిటెక్టివ్) శిక్షణ సంస్థలో 'నేషనల్ సైబర్ రీసెర్చ్ ఇన్నోవేషన్ కెపాసిటీ బిల్డింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలోనే ప్రసిద్ధి పొందిన ఈ శిక్షణ కేంద్రంలో సైబర్ ఇన్నోవేషన్‌ను ప్రారంభించడం సంతోషకరమన్నారు. పెరుగుతున్న సైబర్ నేరాల అదుపునకు, సామాజిక భద్రతల కోసం ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిక్షణ కేంద్రం ద్వారా వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ద్వారా ప్రచారమయ్యే సైబర్ నేరాల విషయంలో పరిశోధనతో పాటు ఈ నేరాలను వేగంగా పరిష్కరించడానికి దోహదపడుతుందన్నారు. పోలీస్ విభాగం న్యాయపరిరక్షణ సంస్థలకు ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇనిస్ట్యూట్ సావనీర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ పరిశోధన అభివృద్ధి మండలి డైరెక్టర్ జనరల్ వీఎన్‌కే.కౌముది మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం పోలీస్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సైబర్ నేరాల నివారణలో సెంట్రల్ ఆఫ్ ఎక్సెలెన్సీగా గుర్తింపు పొందిందన్నారు. కేంద్ర డిటెక్టివ్ ట్రైనింగ్ శిక్షణ సంస్థ డైరెక్టర్ ఆర్.ఎస్.జయకుమార్ సంస్థ సాధించిన విజయాలు, కార్యకలాపాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్, రాచకొండ పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న సీఎస్ సోమేశ్‌కుమార్

ప్రజా ఉద్యమంలా పట్టణ ప్రగతి

ఇబ్రహీంపట్నంలో కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎస్

హైదరాబాద్: పట్టణ ప్రగతిని ప్రజా ఉద్యమంలా కొనసాగించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. రెండు విడతలుగా నిర్వహించిన పల్లె ప్రగతితో వచ్చిన స్పందన, స్ఫూర్తితో ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారన్నారు. మార్చి 4 వరకు నిర్వహించే ఈ కార్యక్రమంతో అర్బన్ వ్యవస్థ రూపురేఖలు మారిపోతాయన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించి ఎస్సీ, బీసీ వార్డుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. మార్కెట్ యార్డులో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 140 మున్సిపాలిటీలు, 3,456 వార్డుల్లో పట్టణ ప్రగతి ప్రారంభమైందన్నారు. ప్రతి వార్డుకు 60 మందితో 4 కమిటీలను ఏర్పాటు చేసి, సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. 75 గజాల స్థలంలో ఇంటి నిర్మాణానికి ఎలాంటి రుసుమూ లేకుండానే అనుమతిస్తామని తెలిపారు. ఈచ్ వన్ టీచ్ వన్ పేరుతో నిరాక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో 32.79 లక్షల మంది నిరక్షరాస్యులున్నట్లు గుర్తించామన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఇబ్రహీంపట్నంలో మిషన్ భగీరథ పనులు నిలిచిపోయినట్లు దృష్టికి వచ్చిందని, త్వరలో తిరిగి ఆ పనులను ప్రారంభిస్తామన్నారు. ప్లేగ్రౌండ్, పార్కు కావాలని ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, చైర్‌పర్సన్ స్రవంతి కోరారని, ఆ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ప్రగతిని పరిశీలించేందుకు మూడో విడతలో మళ్లీ వస్తానన్నారు. పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్, జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం చేతికి ఆశావహుల జాబితా?

- నేటి నుంచి డీసీసీబీ, డీసీఎంఎస్ మేనేజింగ్ కమిటీ నామినేషన్లు
- డైరెక్టర్ స్థానాలు ఏకగ్రీవం చేసేందుకు మంత్రుల మంతనాలు
- 28న డైరెక్టర్ల ఎన్నిక, 29న డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ల ఎన్నిక

సాక్షి, హైదరాబాద్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) మేనేజింగ్ కమిటీ ఎన్నికల నామినేషన్లు మంగళవారం స్వీకరిస్తారు. నామినేషన్ల పరిశీలన, ఉప సంహరణ కార్యక్రమం కూడా మంగళవారం సాయంత్రం ఐదు గంటల లోపు పూర్తి కానుంది. మేనేజింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం కాని పక్షంలో ఈ నెల 28న ఎన్నిక నిర్వహించి, అదే రోజు సాయంత్రం ఫలితాన్ని ప్రకటిస్తారు. తిరిగి ఈ నెల 29న డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించి నూతన పాలక మండలికి బాధ్యతలు అప్పగిస్తారు. హైదరాబాద్ మినహా రాష్ట్రంలోని పూర్వం ఉమ్మడి జిల్లాల వారీగా తొమ్మిది డీసీసీబీ, డీసీఎంఎస్‌ల పాలక మండలి ఎన్నికలను సహకార ఎన్నికల అథారిటీ నిర్వహిస్తోంది. ఒక్కో డీసీసీబీకి 20 మందిని మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నుకోవాల్సి ఉండగా, ఇందులో ఏ క్లాస్ సొసైటీలుగా పేర్కొనే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుంచి 16 మందిని ఎన్నుకుంటారు. బీ క్లాస్ సొసైటీలుగా పేర్కొనే చేనేత, ఉద్యోగ, గీత, మత్స్య సహకార సంఘాల నుంచి నలుగురిని ఎన్నుకుంటారు. డీసీఎంఎస్‌లకు పది మంది డైరెక్టర్లను ఎన్నుకోవాల్సి ఉండగా, ఏ క్లాస్ సొసైటీల నుంచి ఆరుగురు, బీ క్లాస్ సొసైటీల నుంచి నలుగురిని ఎన్నుకుంటారు.

డీసీసీబీలన్నీ టీఆర్ఎస్ ఖాతాలోకే!

ఇటీవల జరిగిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థల (పీఏసీఎస్) ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో టీఆర్ఎస్ మద్దతుదారులే చైర్మన్లుగా ఎన్నికయ్యారు. డీసీసీబీ, డీసీఎంఎస్ మేనేజింగ్ కమిటీ ఎన్నికల్లో వీరి ఓట్లే కీలకం కానుండటంతో మేనేజింగ్ కమిటీ సభ్యులు కూడా టీఆర్ఎస్‌కు చెందిన వారే ఎన్నికయ్యే అవకాశముంది. చాలాచోట్ల పోటీ లేకుండా టీఆర్ఎస్ మద్దతుదారులను మేనేజింగ్ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకునే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ మేరకు మంత్రులు రెండు రోజులుగా ఉమ్మడి జిల్లాల వారీగా ఎమ్మెల్యేలు, కీలక నేతల నుంచి అభిప్రాయ సేకరణ చేసి ఆశావహుల జాబితాను రూపొందించారు. మరోవైపు డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ పదవులను ఆశిస్తున్న టీఆర్ఎస్ నేతలు మేనేజింగ్ కమిటీ సభ్యులుగా నామినేషన్లు వేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారే డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ పదవులకు పోటీ పడే అవకాశం ఉంటుంది. పీఏసీఎస్ డైరెక్టర్, చైర్మన్ పదవుల ఎంపికలో స్థానిక టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు క్రియాశీలంగా వ్యవహరించారు. ప్రస్తుతం జరిగే డీసీసీబీ, డీసీఎంఎస్ మేనేజింగ్ కమిటీ పదవులను ఆశించే వారి ఎంపికను మాత్రం సంబంధిత జిల్లా మంత్రులకు అప్పగించారు. మరోవైపు జిల్లాల వారీగా డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ పదవులు ఆశిస్తున్న ఆశావహుల జాబితాను జిల్లాల వారీగా క్రోడీకరించి పార్టీ అధినేత కేసీఆర్‌కు జిల్లా మంత్రులు, పార్టీ ప్రధాన కార్యదర్శులు అప్పగించినట్లు సమాచారం.



ఆశావహుల జాబితాకు తుదిరూపు..

రాష్ట్ర సహకార సంఘాల సమాఖ్య (టెస్కాబ్) చైర్మన్ పదవిని ఆశిస్తున్న కొందరు టీఆర్ఎస్ నేతలు డీసీసీబీ చైర్మన్ పదవి కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. డీసీసీబీ చైర్మన్ పదవి దక్కని కొందరు నేతలకు డీసీఎంఎస్ చైర్మన్ పదవిని ఇవ్వడం ద్వారా సంతృప్తి పరిచే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాల వారీగా.. డీసీసీబీ పీఠం కోసం నల్లగొండ నుంచి గొంగిడి మహేందర్‌రెడ్డి (ఆలేరు ఎమ్మెల్యే సునీత భర్త), మల్లేశ్ గౌడ్, ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబ్‌నగర్ నుంచి మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇప్పటికే హామీ ఇచ్చారు. మెదక్ నుంచి దేవేందర్‌రెడ్డి (ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి భర్త), డీసీసీబీ మాజీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, బక్కి వెంకటయ్య పేర్లు సీఎం పరిశీలనకు పంపినట్లు సమాచారం. రంగారెడ్డి జిల్లా నుంచి మనోహర్‌రెడ్డితో పాటు నవాబ్‌పేట మండలం అర్కతలకు చెందిన పోలీస్ రాంరెడ్డి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పదవిని ఆశిస్తున్నారు. ఉద్యమ సమయం నుంచి పార్టీలో ఉన్న రాంరెడ్డి, మనోహర్‌రెడ్డి పేర్లు సీఎం పరిశీలనకు వెళ్లినట్లు తెలిసింది. కరీంనగర్ నుంచి టెస్కాబ్ మాజీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, నిజామాబాద్ నుంచి అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తనయుడు భాస్కర్‌రెడ్డి, ఆదిలాబాద్ నుంచి అడ్డి బోజారెడ్డి, దామోదర్‌రెడ్డి, వరంగల్ నుంచి మార్నేని రవీందర్‌రావు, గుండేటి రాజేశ్వర్‌రెడ్డి, ఖమ్మం జిల్లా నుంచి తుళ్లూరు బ్రహ్మయ్య, సత్వాల శ్రీనివాస్‌రావు, కూరాకుల నాగభూషణం పేర్లు ఆశావహుల జాబితాలో ఉన్నాయి.

పచ్చదనానికి అటవీశాఖ తోడ్పాటు

- మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో మొక్కలు నాటేందుకు చర్యలు
- పట్టణ ప్రగతిలో మొక్కల పంపిణీతోపాటు సాంకేతిక సహకారం

సాక్షి, హైదరాబాద్: పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా మొక్కల పంపిణీతో పాటు వాటిని నాటడం మొదలు పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అటవీ శాఖ సాంకేతికపరమైన సహకారాన్ని అందిస్తోంది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయి అటవీ సిబ్బందిని భాగస్వాములను చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. పల్లె ప్రగతి తరహాలోనే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పచ్చదనం పెంపుదలకు తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు ఏర్పాట్లు చేసింది. మొక్కలు నాటడానికి సంబంధించి ఎలాంటి ప్రణాళికలు రూపొందించుకోవాలి, వాటి అమలుకు ఏం చర్యలు తీసుకోవాలన్న విషయాలపై పట్టణ ప్రగతితో పాటు పచ్చదనం పెంపుదల, అడవుల పునరుద్ధరణ, సామాజిక అడవుల పెంపకం, తదితర అంశాలపై కలెక్టర్ల సమావేశంలో సీఎం ఇచ్చిన ఆదేశాల మేరకు అటవీ శాఖ కార్యాచరణ చేపడుతోంది. దీనికి అనుగుణంగా ఇటీవల పీసీసీఎఫ్ ఆర్.శోభతో సహా పలువురు ఉన్నతాధికారులు వరంగల్ జిల్లాలో పర్యటించారు. వరంగల్, కరీంనగర్ అటవీ సర్కిళ్ల పరిధిలో ఉన్న జిల్లాల అటవీ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి ప్రభుత్వ పరంగా చేపట్టే కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు.

పెద్దసైజు మొక్కల పంపిణీ...

పట్టణప్రగతిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో నాటేందుకు పెద్దసైజు మొక్కలు అందుబాటులోకి తీసుకువస్తున్నారు. కనీసం ఒక మీటర్, రెండు మీటర్ల మొక్కలు నాటడం వల్ల అవి బతికే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున, పెద్ద సైజు మొక్కలపై అటవీశాఖ దృష్టి పెట్టింది. రాష్ట్రంలో అవెన్యూ ప్లాంటేషన్ మంచి ఫలితాలనివ్వడంతో ఈ విధానాన్ని విస్తృతంగా ఉపయోగించనుంది. రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం తక్కువగా ఉన్న జిల్లాలు, ప్రాంతాలపై దృష్టి పెట్టడంతోపాటు క్షీణించిన అటవీ ప్రాంతాల పునరుజ్జీవనానికి, పట్టణాలకు సమీపంలోని అటవీ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్ట్ పార్కుల ఏర్పాటుకు ప్రాధాన్యతనిస్తోంది.

అన్ని నర్సరీలు అందుబాటులో...

'రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు సమీపంలోనే అటవీశాఖ నర్సరీలున్నాయి. అందువల్ల మున్సిపల్‌శాఖ విజ్ఞప్తి మేరకు ఎక్కడెక్కడ ఏయే మొక్కలు అవసరమో వాటిని అందజేసే ఏర్పాట్లు చేశాం. పట్టణ ప్రగతిలో మొక్కలు నాటేందుకు, వాటి పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై సాంకేతికపరమైన సహకారాన్ని అందిస్తున్నాం.'

– 'సాక్షి'తో రాకేశ్ మోహన్ డోబ్రియల్, అడిషనల్ పీసీసీఎఫ్

టికెట్ తీసుకోరే..

- బస్సుల్లో భారీగా పెరుగుతున్న టికెట్ తీసుకోని వారి సంఖ్య
- జనవరి, ఫిబ్రవరిలో భారీగా పట్టుబడ్డ ప్రయాణికులు

సాక్షి, హైదరాబాద్: 'బస్సులో టికెట్ తీసుకోకుంటే ఇక బాధ్యత ప్రయాణికుడిదే. ప్రయాణికులకు విధించే పెనాల్టీలు పెంచండి. టికెట్ తీసుకోనందుకు ప్రయాణికులనే పూర్తి బాధ్యులను చేయండి' ఇదీ ఆర్టీసీ సమ్మె ముగిసిన తర్వాత ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశం. దీనికి సంబంధించి ఉత్తర్వులు రానప్పటికీ ఆర్టీసీ అధికారులు మాత్రం దాన్ని అమల్లోకి తెచ్చారు. ప్రభుత్వ చర్యతో ప్రయాణికుల్లో భయం కలిగి టికెట్ తీసుకోని వారి సంఖ్య బాగా తగ్గాలి. కానీ పరిస్థితి దానికి భిన్నంగా ఉన్నట్లు కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అ

అనంతగిరికి ఆఖరి ఘడియలు

నేడు ఊరు ఖాళీ చేయించేందుకు రంగం సిద్ధం
- తొలుత ఎస్సీ కాలనీవాసుల ఖాళీకి ఏర్పాట్లు
- నిర్వాసితులతో కలెక్టర్, ఎమ్మెల్యే సంప్రదింపులు
- రేపు అనంతగిరికి మధ్యమానేరు నుంచి కాళేశ్వరం జలాలు

సిరిసిల్ల: అనంతగిరి గ్రామం జలసమాధి కాబోతుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరికి ఆఖరి ఘడియలు సమీపించాయి. ఊరు ఖాళీ చేసే దిలేదని నిర్వాసితులు భీష్మించుకుని కూర్చున్నా.. ఎలాగైనా ఖాళీ చేయించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. మంగళవారం ఎస్సీ కాలనీని ముందుగా ఖాళీ చేయించేందుకు రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం సిద్ధమైంది.

నిర్వాసితులకు 'అనంత'కష్టాలు

అనంతగిరివాసులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆ ఊరిలో 837 కుటుంబాలు ఉన్నాయి. ప్రాజెక్టుకు సంబంధించిన ప్యాకేజీలను 735 కుటుంబాలకు అందించారు. మిగతా కుటుంబాలు కోర్టును ఆశ్రయించాయి. నిబంధనల మేరకు వీరికి 102 ఇళ్లను అధికారులు అనంతగిరి శివారుల్లో నిర్మించి ఉంచారు. కానీ, ఇప్పుడే నీరు వస్తుందని ఊహించని నిర్వాసితులు.. పునరావాస కాలనీల్లో ఇళ్లు కట్టుకోలేదు. ఇంకా ఎక్కడ ఉండాలో తేల్చుకోలేదు. అద్దె ఇళ్లు చూసుకుని ఖాళీ చేయాలని, అదనంగా రూ.25 వేలు ఇంటి సామగ్రి తరలింపునకు, ఇంటి అద్దె చెల్లిస్తామని అధికారులు చెబుతున్నారు. ఊరు జ్ఞాపకాలు వదిలి వెళ్లేందుకు మనసొప్పక నిర్వాసితులు కన్నీరు పెడుతున్నారు. ఏళ్ల నాటి జ్ఞాపకాలు.. పూర్వీకుల సమాధులు.. జలసమాధి అవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు.

ఇవీ సమస్యలు

అనంతగిరిలో 2017 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులను కుటుంబాలుగా గుర్తించారు. ఆ జాబితా 1,135కు చేరింది. తంగళ్లపల్లి శివారులో 62 ఎకరాలు, అనంతగిరి పోచమ్మ ఆలయం సమీపంలో 70 ఎకరాల్లో పునరావాస కాలనీలు ఏర్పాటు చేశారు. కానీ మౌలిక వసతులు లేవు. ఇప్పటికే 737 కుటుంబాలకు రూ.7.50 లక్షల చొప్పున పునరావాస ప్యాకేజీ చెల్లించారు. 250 గజాల స్థలంతో కూడిన ఇంటి స్థలం ఇచ్చారు.

నిండిన మహాబావి

కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ -10లో భాగంగా రూ.2,700 కోట్లతో చేపట్టిన పనులు పూర్తి అయ్యాయి. మధ్యమానేరు నుంచి మరో దశకు నీటి మళ్లింపునకు రంగం సిద్ధమైంది. మంగళవారం అనంతగిరి ఊరు ఖాళీ చేయగానే.. బుధవారం మధ్యమానేరు నుంచి నీరు అనంతగిరి (అన్నపూర్ణ)లోకి రానున్నాయి. ఇందుకోసం తిప్పాపూర్ వద్ద నిర్మించిన మహాబావి (సర్జిపుల్)లోకి మధ్యమానేరు నీటిని మళ్లించారు. 92 మీటర్లు లోతు, 56 మీటర్ల వెడల్పుతో సర్జిపుల్ ఉంటుంది. మధ్యమానేరు నుంచి గోదావరి జలాలు 3.5 కిలోమీటర్లు గ్రావిటీ ద్వారా వచ్చి ఒబులాపూర్ సొరంగం ద్వారా తిప్పాపూర్‌లోని మహాబావికి చేరాయి. అక్కడ ఏర్పాటు చేసిన 106 మెగావాట్లతో నాలుగు మోటార్లు నీటిని అనంతగిరి రిజర్వాయర్‌కు ఎత్తిపోస్తాయి. ఇందుకోసం తిప్పాపూర్‌లో 440 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. అనంతగిరి రిజర్వాయర్‌లో 3.5 టీఎంసీల నీటిని నిల్వ చేస్తారు. దీని ద్వారా ఇల్లంతకుంట మండలంలోని 30 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. ఇప్పటికే మధ్యమానేరులో 25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మధ్యమానేరు (శ్రీరాజరాజేశ్వర) నీరు అనంతగిరి (అన్నపూర్ణ)కి చేరితే.. అక్కడి నుంచి సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్‌కు ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి కొండపోచమ్మ, అక్కడి నుంచి మల్లన్నసాగర్‌కు గోదావరి జలాలను తరలిస్తారు.

సీఎం కేసీఆర్ సమీక్ష

అనంతగిరి వద్ద ఎదురవుతున్న ప్రతిబంధకాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్షిస్తున్నట్లు సమాచారం. అనంతగిరికి గోదావరి నీళ్లు చేరితే.. మల్లన్నసాగర్ వరకు నీళ్లు వస్తాయని సీఎం అన్నట్లు తెలిసింది. సిరిసిల్ల, సిద్దిపేట జిల్లా కలెక్టర్లతో సీఎం మాట్లాడినట్లు సమాచారం. దీంతో అనంతగిరి నింపేందుకు యుద్ధప్రాతిపదికన పనులు సాగుతున్నాయి.

ఖాళీ చేయాల్సిన అనంతగిరి ఊరు

అనంతగిరి నిర్వాసితులతో మాట్లాడుతున్న సిరిసిల్ల ఆర్డీవో శ్రీనివాస్‌రావు

నిర్వాసితులతో సంప్రదింపులు

అనంతగిరి నిర్వాసితులతో కలెక్టర్ కృష్ణభాస్కర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, సిరిసిల్ల ఆర్డీవో టి.శ్రీనివాస్‌రావు తదితరులు సోమవారం చర్చించారు. తొలుత ఎస్సీ కాలనీ ముంపునకు గురవుతున్న నేపథ్యంలో మంగళవారం 115 దళిత కుటుంబాలను ఖాళీ చేయించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. సంప్రదింపుల్లో 2017 కటాఫ్ తేదీలో 18 ఏళ్లు నిండిన వారికి ఫ్యామిలీ ప్యాకేజీ ఇచ్చారని, కానీ 2020 నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ప్యాకేజీ ఇవ్వాలని నిర్వాసితులు కోరుతున్నారు. ఈ లెక్కన మరో 130 మంది పెరిగే అవకాశం ఉంది. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అధికారులు స్పష్టం చేశారు. నిర్వాసితులకు న్యాయంగా దక్కాల్సిన పరిహారం, పునరావాసం అందిస్తామని కలెక్టర్ కృష్ణభాస్కర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ స్పష్టం చేశారు.

సోమవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న ముల్కనూరు సహకార సంఘం అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి

'ముల్కనూరు' సొసైటీకి జాతీయ అవార్డు

ఉత్తమ రైతు సహకార సంఘంగా ఎంపిక

భీమదేవరపల్లి: సహకార సంఘం ద్వారా రైతులకు విశేష సేవలందిస్తున్న వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ సహకార గ్రామీణ పరపతి సంఘం జాతీయ స్థాయిలో ఉత్తమ సహకార సంఘంగా గుర్తింపు పొందింది. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ చేతుల మీదుగా సంఘ అధ్యక్షుడు అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి సోమవారం ఢిల్లీలో అవార్డు అందుకున్నారు. అవుట్‌లుక్ పత్రిక ఆధ్వర్యంలో దేశంలో 14 రంగాల్లో విశేష సేవలందించిన వారిని గుర్తించగా.. అందులో ముల్కనూర్ సహకార సంఘాన్ని ఎంపిక చేశారు. 'అవుట్ లుక్ అగ్రికల్చర్ కాన్‌క్లేవ్ అండ్ స్వరాజ్ అవార్డు 2020' పేరిట ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి తోమర్ అవార్డును ప్రదానం చేశారు. తమ సొసైటీకి అవార్డు రావడం సంతోషంగా ఉందని, దీంతో తమపై మరింత బాధ్యత పెరిగిందని ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు.

ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నం చేయడానికే..

ట్రంప్ పర్యటనపై సీపీఐ నేత కె.నారాయణ విమర్శ

పాతమంచిర్యాల: దేశ ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేయడానికి వస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ప్రధాని నరేంద్ర మోదీ పూజిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణ విమర్శించారు. మంచిర్యాలలో నిర్వహించిన పార్టీ రాష్ట్ర నిర్మాణ మహాసభకు హాజరయ్యారు. ట్రంప్ దేశ పర్యటను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ట్రంప్ పర్యటనతో దేశంలో నిరసనలు కొనసాగుతున్నాయని, తీవ్ర నిర్బంధకాండ మధ్య ట్రంప్ పర్యటన సాగుతోందని ఎద్దేవా చేశారు. ఇంత జరుగుతున్నా మోదీ మాత్రం ట్రంప్‌ను పూజిస్తున్నారని దుయ్యబట్టారు.

సూది రంధ్రంలో 'ట్రంప్' సూక్ష్మ శిల్పం

అజయ్‌కుమార్

వరంగల్ అర్బన్: వరంగల్ అర్బన్ జిల్లా గిర్మాజీపేటకు చెందిన మైక్రో శిల్పి మట్టెవాడ అజయ్‌కుమార్.. సూది రంధ్రంలో మైనంతో చెక్కిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్,, ఆ దేశ జాతీయ జెండాను ఇనుమడింపజేశాడు. ఎత్తు 1.25 ఎంఎం, వెడల్పు 0.32 ఎంఎం కలిగిన ట్రంప్ శిల్పం, అలాగే ఎత్తు 0.94 ఎంఎం, వెడల్పు 0.64 ఎంఎం కలిగిన అమెరికా జాతీయ జెండాను రూపొందించాడు. ఈయన గతంలో దండి మార్చ్, భారత ప్రధాని నరేంద్ర మోదీ సూక్ష్మ శిల్పాలను సూది రంధ్రంలో చెక్కి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాడు.

ఈఓ నర్సింహులుకు చెక్కు అందజేస్తున్న శాంతమ్మ బంధువులు

రామాలయానికి రూ.11లక్షలు విరాళం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారికి భక్తులు రూ.11 లక్షలు వితరణగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన బి.శాంతమ్మ మృతి చెందగా, ఆమె పేరుతో ఒక గది నిర్మించేందుకు రూ.8 లక్షలు, నిత్యాన్నదాన పథకానికి రూ.3 లక్షల చెక్కును శాంతమ్మ బంధువులు ఈఓ గదరాజు నర్సింహులుకు సోమవారం అందజేశారు. ముందుగా రామచంద్రస్వామి, అనంతరం లక్ష్మీతాయారమ్మ వారిని, ఆంజనేయస్వామివారిని దర్శించుకున్నారు.

కలెక్టర్ వాహనం ఎదుట గంగిరెద్దుతో యాచిస్తూ..

భిక్షాందేహి..!

గంగిరెద్దుతో ఇంటింటికీ తిరుగుతూ భిక్షాటన చేస్తున్న ఓ యాచకుడికి పెద్దపల్లి పట్టణంలోని 19వ డివిజన్‌లో సోమవారం టెంటు కనబడింది. అక్కడేదో ఫంక్షన్ జరుగుతుందని భావించి నేరుగా అక్కడకు చేరుకున్నాడు. పట్టణ ప్రగతిపై సమావేశం అని తెలియక మీటింగ్ పూర్తయ్యే వరకూ అక్కడే మకాం వేశాడు. కార్యక్రమం ముగించుకుని కారులో బయల్దేరే సమయానికి కలెక్టర్ సిక్తా పట్నాయక్ కారుకు ఎదురొచ్చి ఇలా యాచించబోయాడు. వెంటనే అక్కడున్న తహసీల్దార్, అధికారులు కలుగజేసుకోవడంతో పక్కకు తప్పుకున్నాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

మీరు ఎమ్మెల్సీనా..?

- మీ వాహనంలో గన్‌మన్లే లేరు ఎలా నమ్మాలి?
- నర్సిరెడ్డి వాహనాన్ని ఆపి టోల్‌ఫీజు అడిగిన సిబ్బంది
- పంతంగి టోల్ ప్లాజా వద్ద ఎమ్మెల్సీ నిరసన

చౌటుప్పల్: 'మీ వాహనంలో గన్‌మన్లు లేరు' మీరు ఎమ్మెల్సీ అంటే నమ్మేదెలా..? అంటూ టోల్‌ప్లాజా సిబ్బంది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డిని ప్రశ్నించారు. ఈ ఘటన భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద సోమవారం చోటుచేసుకుంది. నర్సిరెడ్డి ఉదయం తన వాహనంలో నల్లగొండ నుంచి హైదరాబాద్ వెళ్తున్నారు. పంతంగి టోల్‌ప్లాజాలోని రుసుము చెల్లింపు కౌంటర్ నుంచి వాహనం వెళ్తుండగా సిబ్బంది అడ్డుకున్నారు. తాను ఎమ్మెల్సీనని, వాహనాన్ని పంపించాలని కోరారు. వాహనంలో గన్‌మన్లు లేకపోవడంతో మీరు ఎమ్మెల్సీ అంటే ఎలా నమ్మాలి అంటూ టోల్ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో ఆయన ఐడీ కార్డును చూపించారు. కంప్యూటర్‌లో పరిశీలించగా అందులో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి పేరు నమోదు కాకపోవడంతో వాహనాన్ని పంపించలేదు. దీంతో ఆగ్రహానికి గురైన ఆయన వాహనం దిగి టోల్‌ప్లాజా ముందు బైఠాయించారు. సమాచారం అందుకున్న టోల్‌ప్లాజా ఉన్నతాధికారులు ఎమ్మెల్సీని పంపించారు. వాహనంలో గన్‌మన్లు లేకపోవడంతో సిబ్బంది ఆయనను గుర్తించలేకపోయారని జీఎమ్మార్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల ఎమ్మెల్సీ ఫ్రీ ఫాస్టాగ్‌కు దరఖాస్తు చేసుకున్నారని, అది వస్తే ఇలాంటి ఇబ్బందులు ఉండవన్నారు.

టోల్‌ప్లాజా వద్ద బైఠాయించిన నర్సిరెడ్డి

పట్టా మార్పిడికి 13 లక్షలు డిమాండ్

- రూ.10 లక్షలకు కుదిరిన బేరం
- ముందస్తుగా రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిన డిప్యూటీ తహసీల్దార్

నాగర్‌కర్నూల్ క్రైం: ఓ డిప్యూటీ తహసీల్దార్ రూ.లక్ష లంచం తీసుకుంటూ సోమవారం ఏసీబీకి పట్టుబడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం మారేపల్లికి చెందిన వెంకటయ్య అదే గ్రామంలో మూడెకరాల 15 గుంటలను 2016లో కొనుగోలు చేశాడు. ఈ భూమిని తన పేరున పట్టా మార్పిడి కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. అయితే రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్లకు చెందిన మల్లేశ్.. ఈ భూమిని 2006లో తనకు అమ్మారని వెంకటయ్య పేరు మీద పట్టా చేయొద్దంటూ ఫిర్యాదు చేశాడు. దీనిపై ఆర్డీఓ కార్యాలయంలో వివాదం నడుస్తోంది. దీనికి సంబంధించి జేసీకి ఫిర్యాదు చేసేందుకు వెంకటయ్య కలెక్టరేట్‌కు రాగా.. సి-సెక్షన్‌లో ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ జయలక్ష్మి అతనికి తారసపడ్డారు. మీకు అనుకూలంగా పట్టా వచ్చేలా చూస్తానని, అందుకు రూ.13 లక్షల లంచం ఇవ్వాలని డిమాండ్ చేయగా.. చివరికి రూ.10 లక్షలు విడతల వారీగా ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. సోమవారం వెంకటయ్యతో నగదును తీసుకుంటున్న జయలక్ష్మిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

సంగారెడ్డి పట్టణంలో నారాయణరెడ్డి కాలనీవాసులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

పట్టణాల రూపురేఖలు మారాలి

సంగారెడ్డిలో పట్టణ ప్రగతిని ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు

సాక్షి, సంగారెడ్డి: పట్టణ ప్రగతితో పట్టణాలు, మున్సిపాలిటీల రూపురేఖలు మారాలని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. పట్టణ ప్రగతి మొదటి విడత కార్యక్రమాన్ని సోమవారం సంగారెడ్డిలో ప్రారంభించి స్థానిక నారాయణరెడ్డి వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రగతి వార్డు కమిటీలు, కౌన్సిలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమం అద్భుతమైన ఫలితాలు ఇవ్వడంతో అదే మాదిరిగా పట్టణ ప్రగతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రగతిలో యువత, మహిళా సంఘాలు, సీనియర్ సిటిజన్స్ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గతంలో ఎన్నడూ జరగనంత అభివృద్ధి టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన ఆరేళ్లలోనే జరిగిందని, 60 ఏళ్ల దారిద్ర్యం వదిలిందని ఆయన తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధించాలి

పట్టణాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, ఇందుకు ప్రభుత్వం, అధికార యంత్రాంగం పూనుకుంటే సరిపోదని, ప్రజలు, వ్యాపారులు స్వచ్ఛందంగా సహకరించాలని మంత్రి హరీశ్‌రావు కోరారు. పారదర్శకత, జవాబుదారీతనం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త మున్సిపల్ చట్టాన్ని తీసుకొచ్చారని ఆయన తెలిపారు. ఎవరైనా స్థలాన్ని కబ్జా చేస్తే కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం 25 రెట్లు జరిమానా విధిస్తామని మంత్రి హెచ్చరించారు. ప్రతీ వార్డులో విరివిగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు వార్డుల గురించి పట్టించుకోకపోతే కొత్త చట్టం ప్రకారం వారిని విధుల నుంచి తొలగించే అధికారం కలెక్టర్లకు ఉందని ఆయన పునరుద్ఘాటించారు.

పూరి గుడిసె దగ్ధం.. బాలిక సజీవ దహనం

సౌందర్య

గాంధారి(ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా గాంధారి మండలం గౌరారం గ్రామంలో విషాదం జరిగింది. సోమవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో బుడాల సౌందర్య (18) సజీవ దహనం అయ్యింది. సాయంత్రం సౌందర్య తమ గుడిసెలో దీపం వెలిగిస్తుండగా అకస్మాత్తుగా మంటలు లేచి గుడిసె దగ్ధం కాగా.. ఆమె ఆ మంటల్లోనే సజీవ దహనమైంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా మళ్లీ 'చాడ'

మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నిక

పాత మంచిర్యాల: సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా చాడ వెంకట్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చాడ కార్యదర్శిగా ఎన్నికవడం ఇది మూడోసారి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్ర కార్యదర్శిగా కే.నారాయణ ఉండగా.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటినుంచి చాడ ఎన్నికవుతూ వస్తున్నారు. చాడ స్వగ్రామం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని రేకొండ. రాష్ట్ర నిర్మాణ మహాసభల సందర్భంగా రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. 123మంది కౌన్సిల్ సభ్యులు, 31మంది కార్యవర్గ సభ్యులు, 9 మంది కార్యదర్శివర్గ సభ్యులతో పాటు కార్యదర్శిని ఎన్నుకున్నారు.

రాష్ట్ర సహాయ కార్యదర్శులు వీరే..

కూనంనేని సాంబశివరావు, పల్లా వెంకటరెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులుగా పశ్య పద్మ (హైదరాబాద్), శ్రీనివాసరావు (వరంగల్), బాలమల్లేష్ (మేడ్చల్), శంకర్ (మంచిర్యాల), హేమంతరావు (ఖమ్మం), బాల నర్సింహ (మహబూబ్‌నగర్), విఎస్.బోస్ (హైదరాబాద్), రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎం.వెంకటస్వామి, మేకల దాసు, రామడుగు లక్ష్మణ్, జోగుల మల్లయ్య.

బాలికల హాస్టల్‌లోకి బాలుడు

రోజంతా అక్కడే..
- పోలీసుల అదుపులో నిందితుడు
- ఆలస్యంగా వెలుగులోకి..

నార్నూర్ (ఆసిఫాబాద్): ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహంలోకి ఓ బాలుడు ప్రవేశించి.. రోజంతా గదిలోనే గడిపిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ పాఠశాల బాలికల వసతి గృహంలో ఇంటర్మీడియెట్‌కు చెందిన 92 మంది, పదో తరగతికి చెందిన ఎనిమిది మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఈనెల 17న రాత్రి కుమురం భీం జిల్లా లింగాపూర్ మండలానికి చెందిన ఓ బాలుడు వసతి గృహం గదికి ఉన్న వెంటిలేటర్ (కిటికి) నుంచి బాలికల గదిలోకి ప్రవేశించి ఒక రోజంతా ఉన్నట్లు తెలుస్తోంది. 18న సాయంత్రం గది నుంచి అబ్బాయి మాటలు వినిపించడంతో అనుమానం వచ్చిన కేర్‌టేకర్ వెంటనే గది తలుపులు తెరిచి చూడగా బాలుడు ఉన్నాడు. దీంతో వెంటనే ప్రిన్సిపాల్ చిన్నప్పారెడ్డికి సమాచారం అందించారు. ఆయన సదరు బాలుడిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. బాలుడు రావడానికి కారణమైన విద్యార్థినితో పాటు వారికి సహకరించిన మరో ముగ్గురు విద్యార్థినులను వసతి గృహం నుంచి తొలగించి.. వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కాగా, ఈ ఘటనపై నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

ఎంఈవోతో విచారణ: డీఈవో

ఈ ఘటనపై ఎంఈవో ద్వారా విచారణ జరిపామని డీఈవో రవీందర్ రెడ్డి అన్నారు. అమ్మాయి, అబ్బాయి మైనర్లు కావడంతో కౌన్సెలింగ్ చేశామన్నారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పరీక్షల సమయం కాబట్టి విద్యార్థినులపై ఎలాంటి ప్రభావం పడకుండా చూస్తామన్నారు.

ఎట్టకేలకు ఫలించిన కల!

రామప్పలోకి చేరిన దేవాదుల నీరు
- భీంఘన్‌పూర్ టు రామప్ప ట్రయల్ రన్ విజయవంతం
- ఆనందంలో ఆయకట్టు రైతాంగం

వెంకటాపురం(ఎం): ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతన్నల కల ఎట్టకేలకు ఫలించింది. దేవాదుల అధికారులు భీంఘన్‌పూర్ నుంచి రామప్ప చెరువుకు పైపులైన్ ద్వారా నీటిని పంపింగ్ చేస్తూ సోమవారం సాయంత్రం ట్రయల్ రన్ నిర్వహించారు. దీంతో రామప్పలోకి వస్తున్న దేవాదుల నీటిని చూసేందుకు రైతులు తరలివచ్చి ఆనందం వ్యక్తం చేశారు.

2017లో ప్రారంభమైన పనులు

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం గంగారం వద్ద గోదావరి నదిపై నిర్మించిన దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా ఫేస్-3 ప్యాకేజీ-2 కింద రామప్ప రిజర్వాయర్‌కు నీటిని తరలించేలా పథకాన్ని రూపొందించారు. భీంఘన్‌పూర్ నుంచి రామప్ప సరస్సు వరకు రూ.1,149 కోట్లతో 25 కిలోమీటర్ల మేర పైపులైన్ పనులను మూడు వరుస క్రమంలో నిర్మించారు. 2017 ఫిబ్రవరి 10న ప్రారంభమైన ఈ పనులు పూర్తికావడంతో సోమవారం ట్రయల్ రన్ నిర్వహించారు. ఎలాంటి సమస్యలు లేకుండా దేవాదుల నీరు రామప్ప సరస్సులోకి పరవళ్లు తొక్కుతూ రావడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఒక్క మోటారుతోనే ట్రయల్ రన్

భీంఘన్‌పూర్ నుంచి రామప్ప చెరువు వరకు పైపులైనుకు 3 మీటర్ల వ్యత్యాసంతో మూడు పైపులైన్లను నిర్మించారు. భీంఘన్‌పూర్ పంప్‌హౌస్ వద్ద మూడు పైపులైన్ల ద్వారా నీటిని పంపింగ్ చేసేందుకు 22 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 3 మోటార్లను బిగించారు. సోమవారం ఒక్క మోటారు ద్వారానే ట్రయల్ రన్ నిర్వహించారు. మిగిలిన రెండు పైపులైన్లకు మరో రెండు మోటార్ల ద్వారా ట్రయల్ రన్ నిర్వహించాల్సి ఉంది.

నిండుకుండలా రామప్ప సరస్సు

సాక్షి ఉద్యోగ అవకాశాలు

GUDLAVALLERU ENGINEERING COLLEGE
(An Autonomous Institute with Permanent Affiliation to JNTUK, Kakinada)
Seshadri Rao Knowledge Village, GUDLAVALLERU - 521 356. Krishna District, A.P.
Ph: 08674-273737/273888, Website: www.gecgudlavalleru.ac.in

Staff Recruitment

Applications along with bio-data, photocopies of all certificates and pass port size photo are invited from the candidates for the posts of Professors/ Associate Professors/ Assistant Professors in Civil / EEE / ME / ECE / CSE / IT and Assistant Professors in MBA, English, Mathematics & Physics so as to reach this office on or before 05-03-2020. Qualification and experience as per AICTE guidelines. Candidates with MCA/M.Sc in Mathematics/Physics/ Electronics/ Computer Science, ME/M.Tech, Ph.D in Computer Science / Information Technology may also apply provided they got admitted to the M.Tech programme before 2010. Applications are also invited for the posts of Office Superintendent/ Finance Officer/ Physical Director/ Estate Officer, Electrical Supervisor, Receptionist, Junior Assistants, Steno, Lab Technicians (CE / EEE / ME / ECE) & Computer Operators. For any further information mail to viceprincipal.administration@gecgudlavalleru.ac.in

GEC/Advt/2020, dt. 21-02-2020 Secretary & Correspondent

సాక్షి
మంగళవారం, ఫిబ్రవరి, 25

ట్రంప్‌తో తేల్చుకోవాల్సినవి...

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సోమవారం ఉదయం మన గడ్డపై అడుగుపెట్టారు. తనకు స్వాగతమవ్వడానికి వచ్చే ప్రజానీకం సంఖ్యను 60 లక్షల నుంచి కోటి వరకూ పెంచుకుంటూ వెళ్లిన ట్రంప్... మొత్తానికి రహదారి పొడవునా ఇరుపక్కలా తన కోసం వచ్చిన జనాన్ని చూసి, మోతేరా స్టేడియంలో తన గౌరవార్థం ఏర్పాటు చేసిన సత్కారసభకు హాజరైనవారిని చూసి సంతృప్తిచెందారనే చెప్పాలి. లక్షమందికిపైగా కూర్చోవడానికి వీలయ్యే ఆ స్టేడియం మొత్తం నిండిపోవడం ట్రంప్‌కు సంతృప్తినిచ్చేవుంటుంది. అందుకే ఈ స్వాగత సత్కారాలు అసాధారణమైనవని ఆయన కొనియాడారు. ఈ ఏడాది ఆఖరుకు అమెరికాలో జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాటిక్ అభ్యర్థిగా తలపడే అవకాశమున్న బెర్నీ శాండర్స్‌ను ఓడించాలంటే అమెరికాలో స్థిరపడిన భారతీయుల ఓట్లు కీలకమని, అందుకు అహ్మదాబాద్ స్వాగత సత్కారాలు దోహదపడతాయని ట్రంప్ గట్టిగా నమ్ముతున్నారు. అది నెరవేరిందన్న భావన ఆయన మాటల్లో ప్రస్ఫుటంగా కనబడింది. ఎన్నారైలు, వ్యాపారవేత్తలు, ఎన్నారైల బంధుగణం, పాఠశాలల విద్యార్థులు హాజరై, చాయ్‌వాలా వంటి పదాలు ఆయన పలకడానికి ప్రయత్నించినప్పుడూ, స్వామి వివేకానంద, మహాత్మా గాంధీల కృషి ని స్మరించినప్పుడు మోతేరా స్టేడియాన్ని మార్మోగించారు. నేతలిద్దరూ పరస్పరం ప్రశంసించుకోవడం, ఉగ్రవాదం గురించి, పాక్ గురించి ట్రంప్ ప్రస్తావించడం వంటివన్నీ అక్కడున్నవారిలో ఉత్సాహాన్ని నింపాయి. ట్రంప్ ప్రసంగం ఆద్యంతమూ గమనిస్తే ఇక్కడి జనం ఏం కోరుకుంటారో, ఏయే అంశాలను ప్రస్తావిస్తే వారికి సంతోషం కలుగుతుందో ఆయన ప్రసంగాన్ని రూపొందించిన అధికారులకు పూర్తి అవగాహన ఉన్నదని అర్థమవుతుంది. పేదరిక నిర్మూలన, ఆర్థిక వృద్ధి, సామాజిక పథకాలు వంటి అంశాల్లో భారత్ ప్రగతి అత్యద్భుతమైనదని, వీటన్నిటినీ ఒక స్వేచ్ఛాయుత సమాజంగా, ఒక ప్రజాతంత్ర దేశంగా ఎవరినీ వేధించకుండా, బాధించకుండా సాధించడానికి ప్రయత్నిస్తుండటం గమనార్హమైనదని కొనియాడారు. ఒక అగ్రరాజ్యాధినేత నోటివెంబడి ఇలాంటి ప్రశంసలు రావడం కన్నా ఏం కావాలి?

ఈ పర్యటనలో మరో కీలకమైన ఘట్టం మంగళవారం చోటుచేసుకోబోతోంది. ఇరుదేశాల అధినేతల మధ్యా వ్యూహాత్మక అంశాలపై చర్చలు జరగడంతోపాటు, రెండు దేశాల అధికారులు ఇప్పటికే అవగాహనకొచ్చిన రక్షణ, ఆంతరంగిక భద్రత ఒప్పందాలపై మంగళవారం లాంఛనంగా సంతకాలవుతాయి. రక్షణ ఒప్పందం విలువ 300 కోట్ల డాలర్లపైమాటేనంటున్నారు. ముందనుకున్నట్టే వాణిజ్య ఒప్పందం మాత్రం అనంతరకాలానికి వాయిదా పడింది. ఇద్దరు నేతలూ ముఖాముఖీ సంభాషించుకునే సమయంలో ట్రంప్ మత విద్వేషాలు, సీఏఏ గురించిన ప్రస్తావన తీసుకొస్తారని కొందరు ఆశిస్తున్నారు. అదెంతవరకూ సాధ్యమో చూడాలి. ఇప్పుడున్న అంతర్జాతీయ పరిస్థితుల్లో ఇరు దేశాల మధ్యా వ్యూహాత్మక సంబంధాలు మరింత మెరుగ్గా ఉండాలని అమెరికా ఆశిస్తోంది. ఇంతకుముందు అమెరికాను ఏలిన అయిదుగురు అధ్యక్షులు మన దేశంలో పర్యటించినా... పాకిస్తాన్‌తోసహా మరే దేశ పర్యటనతోనూ ముడిపెట్టకుండా నేరుగా మన దేశ సందర్శనార్థం మాత్రమే వచ్చిన తొలి అధ్యక్షుడు ట్రంప్. దీన్నిబట్టే ఈ పర్యటనకు ట్రంప్ ఇస్తున్న ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చు.

అహ్మదాబాద్ ప్రసంగంలో ట్రంప్ పరోక్షంగా తాలిబాన్‌లతో అమెరికాకు కుదరబోయే ఒప్పందాన్ని ప్రస్తావించారు. ఉగ్రవాదంపై పాకిస్తాన్ కఠినంగా వ్యవహరించేలా ఆ దేశంతో తమ అధికారులు చర్చిస్తున్నారని, త్వరలో అది సాకారం కాబోతోందని ఆయన ప్రకటించారు. ఆయన ప్రస్తావించింది ఈనెల 29న తాలిబన్‌లతో కుదిరే ఒప్పందమని సులభంగానే చెప్పొచ్చు. కానీ అది ఒక దుస్సాహసంగా మిగిలే ప్రమాదం ఉంది. అధికారంలోకొచ్చాక మొదటి రెండేళ్లూ ఆయన పాకిస్తాన్‌ను తీవ్రంగా విమర్శించేవారు. ఉగ్రవాదాన్ని ఉపేక్షిస్తే కఠినంగా ఉంటామని హెచ్చరించేవారు. కానీ అహ్మదాబాద్ ప్రసంగాన్ని గమనిస్తే అదేమీ కనబడదు. సరిగదా... పాక్‌పై ఆయనకు ఎక్కడలేని నమ్మకమూ ఏర్పడిందనిపిస్తుంది. ఆయన నమ్మకాల మాటెలావున్నా పాక్‌తో మనకున్న గతానుభవాలను గుర్తుకుతెచ్చుకుంటే తాలిబన్‌లతో కుదరబోయే ఒప్పందం పర్యవసానాలెలావుంటాయో సులభంగానే గ్రహించవచ్చు. అఫ్ఘానిస్తాన్ గడ్డపై ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో ఆనాటి సోవియెట్ యూనియన్‌తో లెక్కలు తేల్చుకోవడానికి ఛాందసవాద శక్తులకు తాలిబన్ ముద్ర తగిలించి, వారికి నిపుణులతో ఆయుధ శిక్షణనిప్పించి రంగంలోకి దించింది అమెరికాయే. ఆ తర్వాత వారు సృష్టికర్తనే ధిక్కరించి చెలరేగడం వేరే కథ. చివరకు తాలిబన్‌లు ప్రభుత్వాన్ని చేజిక్కించుకుని సాగించిన అరాచకం అంతా ఇంతా కాదు. అప్పుడే పాకిస్తాన్ ప్రాపకంతో తాలిబన్‌లు చొరబాటుదార్లను ప్రవేశపెట్టి కశ్మీర్‌ను రక్తసిక్తం చేశారు. ఆ సమయంలోనే మన భద్రతా బలగాలు తీవ్ర నష్టాలను చవిచూశాయి. ఉగ్రవాద దాడులు పెరిగాయి. అఫ్ఘాన్‌లో మళ్లీ తాలిబన్‌లతో పాతకథే నడిపించాలని పాక్ కలలు గంటోంది. ఇప్పుడు తాలిబన్‌ల సత్ప్రవర్తనకు పూచీపడి, ట్రంప్‌ను ఒప్పించడంలో పాక్ పాత్ర కీలకం. ఈ ఒప్పందం గురించిన కథనాలు వచ్చినప్పటినుంచి 'హింస తగ్గింపు' పదే పదే ప్రస్తావనకొస్తోంది. తాలిబన్‌లు హింస 'తగ్గిస్తారని' అమెరికా చెబుతోంది. పండగలకు దుకాణదారులు ప్రకటించే డిస్కౌంట్ తరహాలో దీన్ని ప్రచారం చేస్తోంది. హింసామార్గాన్ని వదిలేస్తామని ప్రకటించడానికి సిద్ధపడనివారితో ఒప్పందం చివరకు దేనికి దారితీస్తుందో తెలియనట్టు అమాయకత్వం నటిస్తోంది. ఈ విషయంలో మోదీ దృఢమైన వైఖరి తీసుకోవాలి. అలాగే ఎన్నారైలను ఇబ్బందుల్లో పడేసే కఠినమైన వలస నిబంధనలు రూపొందించడాన్ని మానుకోవాలని హితవు చెప్పాలి. ఈ రెండూ సాధిస్తేనే ట్రంప్ పర్యటన వల్ల మనకు కొద్దో గొప్పో మేలు కలిగినట్టు లెక్క.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి శు.విదియ రా.11.35 వరకు, తదుపరి తదియ నక్షత్రం పూర్వాభాద్ర సా.5.35 వరకు, తదుపరి, ఉత్తరాభాద్ర వర్జ్యం రా.11.47 నుంచి 1.33 వరకు, దుర్ముహూర్తం ఉ.8.44 నుంచి 9.30 వరకు, తదుపరి రా.10.58 నుంచి 11.47 వరకు అమృతఘడియలు... ఉ.8.45 నుంచి 10.32 వరకు.

సూర్యోదయం : 6.26
సూర్యాస్తమయం : 6.01
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

మానవ ప్రగతికి మేనిఫెస్టో!

సోషలిస్టు రిపబ్లిక్ తప్ప, చివరికి ప్రజాస్వామ్య (డెమోక్రాట్) రిపబ్లిక్కులు సహితం ధనికవర్గాలకు, శ్రమజీవులకు మధ్య వైషమ్యాన్ని రద్దు చేయలేవని మార్క్స్-ఎంగెల్స్ స్పష్టం చేయడం విశేషం. ఏ దేశానికి శాశ్వత విమోచన రావాలన్నా అది కార్మిక శ్రమజీవుల నుంచే, కష్టజీవుల నుంచే సాధ్యమని, విద్యకు వెలి అయినా.. వారికి అసూయా ద్వేషాలుండవనీ, గొప్ప జాతీయ కర్తవ్యాల్ని నెరవేర్చగల శక్తియుక్తులు వారికే ఉంటాయని, వారిదే భవిష్యత్తు అనీ మార్క్స్-ఎంగెల్స్‌లు నిర్మలమైన మనస్సుతో ప్రకటించారు. సోషలిస్టు పేరిటనో, కమ్యూనిస్టు పార్టీల పేరిటనో పార్టీలు ఎన్ని మారినా, రాజీబేరాలతో సిద్ధాంత పదును ఎంతగా కోల్పోయి నిర్వీర్యమౌతున్నా, రెండు రెళ్లు నాలుగన్న సూత్రం మాత్రం మారదు గాక మారదు, మార్చడం కుదరదు. సర్వమానవ ప్రగతికి ఆ కమ్యూనిస్టు మేనిఫెస్టోనే దిక్సూచి. మరో మార్గమేదీ లేదు.

ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

250 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత కూడా అమెరికాలో దేశాల దురాక్రమణల్లో, దేశాలపై అక్రమ యుద్ధాలు సృష్టించడంలో, ధనికవర్గ సమాజ దోపిడీ వ్యవస్థా చట్రంలో ప్రజాస్వామ్యం బోర్డు చాటున దాగిన సైనిక-పారిశ్రామిక వ్యవస్థల్లో ఏమాత్రం మార్పు లేదు. కనుకనే ఆ దోపిడీ వ్యవస్థను ఆదర్శంగా భావించి భారత ప్రజలను పీడిస్తున్న రకరకాల బ్రాండ్‌ల చాటున దాగిన సంపన్నవర్గాలకు శాస్త్రీయ సోషలిజం అన్నా శాస్త్రీయ కమ్యూనిజం అన్నా కంపరంగా ఉంటుంది. శాస్త్రీయ సోషలిజం సిద్ధాంతకర్తలైన కారల్ మార్క్స్, ఫ్రెడరిక్స్ ఎంగెల్స్ ప్రపంచ శ్రామిక వర్గ శాశ్వత విమోచన కోసం రూపొందించిన 'కమ్యూనిస్టు మేనిఫెస్టో'కి 172 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సర్వత్రా సభలు, సమావేశాలు ప్రపంచవ్యాప్తంగా జరిగాయి. ఇప్పటికీ తరతమభేదాలతో పలు ప్రపంచ దేశాలలోని కష్టజీవులు, శ్రమజీవులు, మధ్య తరగతి ఉద్యోగవర్గాలు అనునిత్యం తమ బతుకుల్ని మెరుగుపర్చుకోవడం కోసం నిరంతర పోరాటాలు చేస్తూనే ఉన్నారు ఉద్యమాల రూపంలో, సమ్మెల రూపంలో భారతదేశంతో సహా అనేక దేశాల్లో పెద్ద ఎత్తున అవిశ్రాంతంగా కొనసాగుతూనే ఉన్నాయి.

శ్రామికవర్గ ప్రయోజనాల రక్షణే పొత్తుల భూమిక

కమ్యూనిస్టు మేనిఫెస్టో వెలువడిన 172 సంవత్సరాల తర్వాత కూడా దేశంలో అసమానతల పర్వాలకు ముగింపు రాకపోవడానికి కారణమేమిటో స్థానిక కమ్యూనిస్టు పార్టీలు, సోషలిస్టు శక్తులూ అంతర్మథనం చేసుకోవలసిన అవసరం ఉంది. దేశాలలోని స్థానిక ధనికవర్గ పార్టీలతో పరిస్థితులను బట్టి వ్యూహరీత్యా సోషలిస్టు, కమ్యూనిస్టు లక్ష్యాలు ప్రజాబాహుళ్యం ఉమ్మడి ప్రయోజనాల సాధన కోసం తాత్కాలికంగా చేతులు కలపడం వేరు, ఆ పేరిట శ్రామిక వర్గ ప్రయోజనాలకు విఘాతం కల్గించే పొత్తులకు ఒరగబెట్టడం వేరు. అలాగే మిలిటెంట్ పోరాటాలలో ఉన్నవారిని ధనిక వర్గ పాలకులు ఉగ్రవాదులంటూ ముద్రవేసి పరిమార్చడాన్ని, విచారణ జరపకుండానే హతమార్చడాన్ని వామపక్షశక్తులు లోపాయికారీగా సమర్థించడమూ, శ్రమజీవుల దీర్ఘకాల ప్రయోజనాల్ని దెబ్బతీయడమే అవుతుంది.

గత 172 సంవత్సరాలుగాను దేశదేశాలలోని శ్రమజీవులు, కష్టజీవులు తమ బతుకులను, జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకునేందుకు దోపిడీవర్గ వ్యవస్థనుంచి శాశ్వత విమోచనం కోసం జరిపే పోరాటాలకు ఒక ముగింపును ఆశించడం లక్ష్యంగా శాస్త్రీయ సోషలిజం సిద్ధాంతకర్తలు తమ మేనిఫెస్టోలో కొన్ని ఆసక్తికర సూత్రీకరణలు చేశారని మరవరాదు. వారి మాటల్లో- సంపన్నవర్గం తమ ఉనికికోసం ఒక్కొక్కప్పుడు విప్లవకరంగా ప్రవర్తించినప్పుడల్లా కమ్యూనిస్టులు ఆ వర్గంతో చేతులు కలిపి నిరంకుశ రాచరికాలకూ, భూస్వామ్య వర్గాలకూ పెట్టీబూర్జువా వర్గాలకీ వ్యతిరేకంగా పోరాడుతూ ఉంటారు. అయితే దోపిడీ వ్యవస్థకు ఆలవాలమైన సాంఘిక పరిస్థితులను మూల మట్టంగా తోసిపుచ్చడం ద్వారానే సామాజిక పరిస్థితుల్ని మౌలికంగా మార్చగలమన్న అవగాహనను మార్క్స్-ఎంగెల్స్ అందించారు. శ్రామిక వర్గం, కార్మికవర్గం, వేతన జీవులూ ఎలాగూ దోపిడీ పాలకవర్గ వ్యవస్థ ఉనికిలో ఉన్నన్నాళ్లూ సంకెళ్లలోనే జీవితాన్ని వెళ్లమార్చుకోవలసి వస్తుంది. కాబట్టి.. తెగనివి కావయ్యా ఆ సంకెళ్లు.. తెగతెంచండయ్యా అన్న ఆ సిద్ధాంతకర్తల సందేశానికి లక్ష్యం నెరవేరేదాకా కాలం చెల్లిపోనట్లే లెక్క. కనుకనే శాస్త్రీయ సోషలిజం సిద్ధాంతకర్తలు విస్పష్టమైన భావాన్ని ఆదేశంగా మల్చారు. ధనిక(బూర్జువా) వర్గ సమాజంలో గతం వర్తమానాన్ని శాసిస్తుంది. కానీ సోషలిస్టు లేక కమ్యూనిస్టు సమాజంలో వర్తమానం గతాన్ని శాసిస్తోంది. ధనికవర్గ సమాజంలో పెట్టుబడికి మాత్రమే స్వాతంత్ర్యమూ, వ్యక్తిత్వమూ ఉంటాయి కానీ ప్రాణం గల మనిషికి స్వాతంత్ర్యమూ ఉండదు, వ్యక్తిత్వమూ ఉండదు. ఈ స్థితినే సోషలిజం (కమ్యూనిజం) రద్దు చేయాలంటుంది.



భార్య కార్మికురాలు.. భర్త బూర్జువా!

అయితే ఈ రద్దు చేయడాన్ని వ్యక్తిత్వాన్ని రద్దు చేయడం గానూ, స్వేచ్ఛను రద్దు చేయడంగానూ సంపన్నవర్గాలు భావిస్తాయి. ధనికవర్గ వ్యవస్థలో ఉత్పత్తి, స్వేచ్ఛ అంటే వ్యాపారానికి స్వేచ్ఛ, వస్తువుల క్రయవిక్రయాలకు మాత్రమే స్వేచ్ఛ. సోషలిజం/కమ్యూనిజం ఏ వ్యక్తికీ సమాజ ఉత్పత్తి పరికరాలను (ఉత్పాదితాలు) సొంతం చేసుకునే హక్కు లేకుండా చేయదు. అలా సొంతం చేసుకోవడం ద్వారా ఇతరులను కూలివాళ్లుగా మార్చే హక్కును మాత్రమే తొలగిస్తోంది అని స్పష్టం చేశారు. అందుకే ధనికవర్గ వ్యవస్థలో చివరికి భార్యా-భర్తల మధ్య సంబంధాల తీరును కూడా పరామర్శిస్తూ శాస్త్రీయ సోషలిజం సిద్ధాంతకర్తలు దోపిడీ వ్యవస్థలో భార్యను ప్రొలిటేరియట్ గానూ, భర్తను బూర్జువా గానూ వర్గస్వభావాన్ని వివరించడం కోసం ఎంగెల్స్ వర్ణించక తప్పలేదు. మహిళా లోకం ఆందోళనకు ప్రతిబింబంగా వచ్చిన నేటి మీటూ ఉద్యమం కూడా దోపిడీ వ్యవస్థకు మరో నిరసన రూపమే! అలాగే, సోషలిస్టు రిపబ్లిక్ తప్ప, చివరికి ప్రజాస్వామ్య (డెమోక్రాట్) రిపబ్లిక్కులు సహితం ధనికవర్గాలకు, శ్రమజీవులకు మధ్య వైషమ్యాన్ని రద్దు చేయలేవని కూడా మార్క్స్-ఎంగెల్స్ స్పష్టం చేయడం విశేషం.

ఏ దేశానికి శాశ్వత విమోచన రావాలన్నా అది కార్మిక శ్రమజీవుల నుంచే, కష్టజీవుల నుంచే, చివరికి విద్యకు వెలి అయినాసరే.. వారికి అసూయా ద్వేషాలుండవనీ, గొప్ప జాతీయ కర్తవ్యాల్ని నెరవేర్చగల శక్తియుక్తులు వారికే ఉంటాయని వారిదే భవిష్యత్తు అనీ మార్క్స్-ఎంగెల్స్‌లు నిర్మలమైన మనస్సుతో ప్రకటించారు. అంతేగాదు, దేశాభివృద్ధికి బాసటగా నిలబడాల్సిన పారిశ్రామిక నాగరికతను కాస్తా స్టాక్ మార్కెట్లకు తార్చి కూర్చున్నారని ఎంగెల్స్ శపిస్తూ, స్టాక్ ఎక్చేంజ్ అనేది ధనికవర్గ సమాజానికి అత్యంత విలువైన పండు అనీ అదే సమాజానికి విషఫలమనీ, అలాంటి సమాజాల్లో నిస్సందేహంగా ఆవిష్కరించుకునే అవినీతికి స్టాక్ ఎక్చేంజీలు ఉదాహరణ అనీ వర్ణించాడు. ఏతావాతా ఎవరి మాట ఎలా ఉన్నా ఆశయాలు సంఘర్షించే వేళ సైద్ధాంతిక ఆయుధమూ పదును కోల్పోదు గాక కోల్పోదు. సోషలిస్టు పేరిటనో, కమ్యూనిస్టు పార్టీల పేరిటనో పార్టీలు ఎన్ని మారినా, రాజీబేరాలతో సిద్ధాంత పదును ఎంతగా కోల్పోయి నిర్వీర్యమౌతున్నా, రెండు రెళ్లు నాలుగన్న సూత్రం మాత్రం మారదు గాక మారదు, మార్చడం కుదరదు. సర్వమానవ ప్రగతికి ఆ మేనిఫెస్టోనే దిక్సూచి. మరో మార్గమేదీ లేదు.

పోగుపడటమే పెట్టుబడి లక్షణం

ఎందుకంటే మహాశాస్త్రవేత్త, ప్రపంచ అణుశాస్త్రవేత్త, మానవతావాది అల్బర్ట్ ఐన్‌స్టీన్ చెప్పినట్లు ప్రైవేట్ పెట్టుబడి అనేది బహుకొలది మంది చేతుల్లోనే పోగుబడుతూ ఉంటుంది. పెట్టుబడిదారుల మధ్య పోటాపోటీల వల్ల కొంత, సాంకేతిక అభివృద్ధి వల్ల కొంత, శ్రమ విభజన పెరగడం వల్ల కొంత.. చిన్నపరిశ్రమలను మార్చి భారీ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించడం వల్లనూ నానాటికీ ప్రైవేట్ పెట్టుబడి కొలదిమంది చేతుల్లో పోగుబడటం ప్రారంభించింది. ఈ పరిణామాలతో ప్రైవేట్ పెట్టుబడి గుత్తేదార్ల సంఖ్య పెరిగింది. ఈ విపరిణామాల ఫలితంగా ప్రైవేట్ పెట్టుబడిని పకడ్బందీగా అదుపు చేయడమన్నది చివరికి ప్రజాస్వామికంగా సమీకృతంగా ఏర్పడిన రాజకీయ సామాజిక వ్యవస్థకు కూడా అదుపు చేయడం సాధ్యం కాకుండా పోయింది. శాసనకర్తల్ని రాజకీయ పార్టీలు విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లి లేదా ప్రలోభాలకు గురిచేయడం జరుగుతోంది. ఈ పార్టీలను ప్రైవేట్ పెట్టుబడిదారులు సాకుతున్నారు. తద్వారా ప్రజలు ఎన్నుకున్న శాసనవేదికల నుంచి ప్రజలనే విడదీస్తున్నారు. ఫలితంగా అట్టడుగు వర్గాల ప్రజాబాహుళ్యాన్ని అలా దూరం చేస్తున్నారు. కనుకనే సమాచార వ్యవస్థలైన పత్రికలు, రేడియో, విద్యా రంగాలను ప్రైవేట్ పెట్టుబడిదారులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావితం చేయడం జరుగుతోంది.

('కమ్యూనిస్టు మేనిఫెస్టో' రచనకు 172 ఏళ్లు అయిన సందర్భంగా)

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా రాంక్

"దార్శనికుడైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో దేశం వేగంగా అభివృద్ధి చెందిందనీ, 2.94 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో ప్రపంచంలో ఐదవ స్థానంలో ఉందని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చెప్పుకుంటున్నారు. కానీ, 2014 వరకు ప్రధాని మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మన దేశం మూడో స్థానంలో ఉండేదని మర్చిపోతున్నారు. ఇప్పుడు ఐదో స్థానానికి పడిపోయింది. బీజేపీ నిర్వాకానికి కృతజ్ఞతలు. మన దేశం ర్యాంకుల్లో క్రమంగా కిందకు పడిపోతోంది"

– షమా మహమ్మద్, కాంగ్రెస్ నేత

రెండు నాల్కలు

"ఉగ్రవాదాన్ని, ముఖ్యంగా భారత్ గడ్డపై నుంచి ఇస్లామిక్ ఉగ్రవాదాన్ని తుడిచిపెట్టేస్తామని ఎటువంటి రెండు నాల్కల ధోరణి లేకుండా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూటిగా ప్రకటించారు. గత మూడు దశాబ్దాలుగా జిహాదీ ఉగ్రవాదంతో తీవ్రంగా నష్టపోతున్న మన దేశానికి ఇది ఎంతో ఊరటనిస్తుంది"

– సధావి ఖోస్లా, రచయిత్రి

మీడియా

"ట్రంప్‌ను ద్వేషించండి అనే అమెరికాలోని ప్రధాన మీడియాకు తీవ్ర విఘాతం ఎదురయ్యింది. అమెరికాలో అతడికి ఎప్పుడూ చెడుగానే చూపుతున్నప్పటికీ విదేశాల్లో డొనాల్డ్ ట్రంప్‌కు అనితరసాధ్యమైన గౌరవం ఎలా లభిస్తోందో వారికి అర్థంకావడం లేదు. ట్రంప్ తన పర్యటనలో భారత్ పై ఎటువంటి వ్యతిరేకతా వ్యక్తం చేయలేదేమని ఏడుపు ముఖంతో చెబుతున్నాయి"

– ఆర్తిటికూ సింగ్, జర్నలిస్ట్

పాఠశాల

"కశ్మీర్‌లో పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యాయి. సుదీర్ఘమైన శీతాకాల సెలవుల తరువాత ప్రారంభమయ్యే మొదటిరోజు ఎప్పుడూ ప్రత్యేకమైనదే. స్కూలు దుస్తులు ధరించడం, స్నేహితులను హత్తుకోవడం, ఉపాధ్యాయులతో చిరునవ్వులు పంచుకోవడం, మన బెంచీలో కూర్చోవడం.. అన్నీ కూడా తిరిగి కుటుంబంలోకి వచ్చినట్టు ఉంటుంది. ఈ ఏడాదంతా ఇలా ప్రత్యేకంగా ఉండాలని ప్రార్థిస్తున్నా"

– నవీద్ ట్రంబూ, ఐఆర్ఎస్ అధికారి

అల్లర్లు

"ఈశాన్య ఢిల్లీలో కనిపిస్తున్న దృశ్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సీఏఏ అనుకూల, ప్రతికూల వర్గాల వారు పరస్పరం రాళ్లు రువ్వుకుంటూ ఘర్షణ పడుతుంటే, పోలీసులు చోద్యం చూస్తున్నారు. శాంతిభద్రతలను కఠినంగా అదుపు చేయలేని హోంమంత్రిత్వ శాఖపై మనం ఆధారపడొచ్చా? విధ్వంసం ద్వారా ఎవరు లబ్ధి పొందుతారు. అమెరికా అధ్యక్షుడికి మనం అందించబోయే సందేశం ఇదేనా?"

– రాజ్‌దీప్ సర్దేశాయ్, జర్నలిస్ట్

రావొద్దు

"చాంద్‌బాగ్, బాబర్‌పూర్, జఫ్రాబాద్, మౌజ్‌పూర్ ప్రాంతాలకు ఎవరూ రావద్దు. మీ సదుద్దేశం నాకు అర్థమైంది. రాళ్లతో దాడులు చేస్తూ, వాహనాలు తగులబెడుతున్న మూకలతో మీరు తలపడలేరు. జర్నలిస్టులమైన మేము ఇక్కడ ఉన్నామంటే, అది మా డ్యూటీ. దయచేసి తెలివిగా మసలుకోండి"

– సాహిల్ మురళీ మెంఘాని, జర్నలిస్ట్

ఇన్‌బాక్స్

మౌన సంభాషణ

కొన్నిసార్లు అప్రయత్నంగా
సరేలే అనుకుంటాం గానీ
గుండెలో తడి ఇంకిపోతే
కళ్ళు నదులు కాలేవు

కోట్లు ఖర్చుపెట్టి
ప్రాజెక్టులు కట్టగలవేమో గానీ
నా చుట్టూ నిరంతరం తిరిగే
నా భూమితల్లి ఆత్మను
నా కళ్ళముందు నిలబెట్టగలవా?

ఎవరికి వాళ్ళం
పరిధులు విధించుకొని
మాట్లాడాల్సిన సమయం.

హక్కు ఉంది కదాని
భూమితల్లి కోసం నోరు తెరిచావో
ఆ తరువాత నీ హక్కు గురించి
ఆలోచిస్తామంటారు.

ఇప్పుడు ఆశ్చర్యంగా
నేను మౌనంగా మాట్లాడుతున్నాను.

– విల్సన్ రావు కొమ్మవరపు, హైదరాబాద్

కోటా రక్షణకు పటిష్ట చట్టం

సందర్భం

నాగటి నారాయణ

దళిత, గిరిజన సామాజిక తరగతుల సంక్షేమానికి సంబంధించిన రిజర్వేషన్లపై తరచుగా వివాదాలు, వాదోపవాదాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ప్రజా ప్రాతినిధ్య పదవుల్లోని రిజర్వేషన్ల కంటే ఉద్యోగాల్లో రిజర్వేషన్లపైనే ఆందోళనకర, ప్రమాదకర పరిస్థితులు ఉత్పన్నమవుతున్నవి. ప్రజా ప్రాతినిధ్య పదవుల్లో కొందరు దళిత, గిరిజన నాయకులు ఉండడం కంటే విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల వల్లే ఎంతోకొంత సామాజిక న్యాయం నెరవేరుతోంది. అందువల్లనే ఉద్యోగాల్లో రిజర్వేషన్లపైనే అసహనం, కోర్టుల్లో వ్యాజ్యాలు నడుస్తున్నవి. రాజ్యాంగం అమల్లోకొచ్చిన ఏడాదిలోపే ఎస్సీ, ఎస్టీలకు లభిస్తున్న విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ మద్రాస్ హైకోర్టులో దాఖలైన పిటిషనుపై హైకోర్టు, సుప్రీం కోర్ట్ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీర్పులిచ్చాయి. ఆనాడు కేంద్ర ప్రభుత్వంలో న్యాయశాఖ మంత్రిగా ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చొరవతో రాజ్యాంగం ఆర్టికల్ 15కి చేసిన సవరణతో మొదటి ప్రమాదం తప్పింది. గడిచిన ఏడు దశాబ్దాల కాలంలో కూడా వివిధ సందర్భాల్లో రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు యిచ్చిన తీర్పుల వలన మరికొన్నిసార్లు రాజ్యాంగానికి స్వల్పమైన సవరణలు చేయాల్సివచ్చింది. కాగా జార్ఖండ్ ప్రభుత్వం 2012లో కొన్ని ఉద్యోగ ఖాళీలను రిజర్వేషన్లు పాటించకుండా యిచ్చిన ఉత్తర్వులను సమర్థిస్తూ ఈనెల ఫిబ్రవరి 7న సుప్రీం కోర్టు యిచ్చిన తీర్పుతో రిజర్వేషన్లు మరోసారి ప్రమాదంలో పడే పరిస్థితి దాపురించింది.

ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపనుల శాఖలోని అసిస్టెంట్ ఇంజనీర్ల ప్రమోషన్లలో ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లు పాటించాల్సిన అవసరం లేదని 2012 సెప్టెంబర్ 5న ఇచ్చిన ఉత్తర్వులను వినోద్ కుమార్ మరో ఇద్దరు ఎస్సీ తరగతికి చెందిన ఉద్యోగులు ఆ రాష్ట్ర హైకోర్టులో చాలెంజ్ చేయడం జరిగింది. దానిపైన తీర్పు చెప్పిన హైకోర్టు పదోన్నతుల్లో రిజర్వేషన్లు పాటించాలా అక్కర్లేదా అనేది నిర్ణయించడానికి సదరు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఆయా సామాజిక తరగతుల ప్రాతినిధ్యం ఏ మేరకు ఉన్నదనే విషయమై నాలుగు నెలల్లో సమాచారం సేకరించాలని, దాని ఆధారంగా ప్రాతినిధ్యం తక్కువగా వున్న సామాజిక తరగతుల వారికి పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని ఉత్తరాఖండ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఆ తీర్పులో ఒక ముఖ్యమైన విషయం ఇమిడివుంది. రిజర్వేషన్లు ఇంకా ఎంతకాలం అనే ప్రశ్నలకు కూడా అది సమాధానం కావచ్చు. దాన్ని వ్యతిరేకిస్తూ ఉత్తరాఖండ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆ కేసును విచారించిన జస్టిస్ లావు నాగేశ్వర రావు, జస్టిస్ హేమంత్ గుప్తాల సుప్రీంకోర్టు ధర్మాసనం రిజర్వేషన్లు ప్రాథ

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
మంగళవారం ॥ 25-2-2020

కామాటిపురా

కామాటిపురా సెక్స్ వర్కర్ల కుమార్తెలు

సెక్స్‌వర్కర్ల కుమార్తెలు బురదలో పూసిన పూలు

ఇక్కడ బురద అంటున్నది వేశ్యావాటికను కాదు. వేశ్యావాటికను బురద అనే దృష్టికోణమే తప్ప అంటారు ఆ అమ్మాయిలు. సమాజమే ఒక బురద కావచ్చు... అదే ఈ బురదను తయారు చేస్తుండవచ్చు అని కూడా అంటారు. వేశ్య కూతురు వేశ్య అవుతుందని నియమం. కాదు.. సమాజ పరివర్తన కార్యకర్త అవుతుందని నిరూపిస్తున్నారు ఈ ఆశాదీపాలు. 'స్టాప్ జడ్జింగ్.. స్టార్ట్ ఇంక్లూడింగ్'... 'తీర్పులు ఆపండి... మమ్మల్ని తోడు తీసుకోండి' అని సాదరంగా స్నేహహస్తాన్ని చాపుతున్నారు.

ముంబైలోని కామాటిపురా నుంచి కుర్లాకు నలభై నిమిషాల ప్రయాణం. కాని ఆ ప్రయాణం కొందరికి ఒక జీవిత కాలంలో సంభవించకపోవచ్చు. కామాటిపురా నుంచి బయటపడి కుర్లాలోని 'క్రాంతి' ఎన్.జి.ఓకు చేరిన వారికి ఒక కొత్తప్రపంచం వీలవుతుంది. 'క్రాంతి' సంస్థ వేశ్యలకు పుట్టిన కుమార్తెలకు కొత్త జీవితం ఇవ్వడానికి పని చేస్తోంది. వారి కలలు సాకారం కావడానికి రెక్కలు ఇస్తోంది. ఎగిరి వెళ్లదలుచుకుంటే ఎంత దూరమైనా ఎగరనిస్తుంది.

అప్పడాలు.. కుట్టుమిషన్‌లు...

'2009లో నేను క్రాంతి సంస్థను ప్రారంభించే వరకు ముంబైలోని కొన్ని ప్రభుత్వ సంస్థలు, ఎన్.జి.ఓలు వేశ్యల సంతానానికి కొత్త జీవితం ఇచ్చే ప్రయత్నం చేశాయి. అయితే ఆ జీవితం పరిమితమైనది. వారికి మహా అయితే అప్పడాలు తయారు చేయడం, కుట్టుపని నేర్పించడం చేసేవారు. తర్వాత వారి బతుకు ఎక్కడి గొంగళి అక్కడే ఉన్నట్టుండేది. ఆ ఆడపిల్లలు ఏ కలలు కంటే ఆ కలలకు తోడు ఇవ్వాలి అని అనుకున్నాను' అంటుంది రాబిన్ చౌరాసియా. అమెరికాలో పుట్టి పెరిగిన ఈ భారతీయురాలు అక్కడి మిలట్రీలో పని చేసి, అక్కడ లెస్బియన్ల పట్ల, గేల పట్ల ఉన్న వివక్షను వ్యతిరేకించి ఉద్యోగం మానేసింది. నేరుగా ఇండియాకు వచ్చి సెక్స్‌వర్కర్ల కుమార్తెల కోసం పని చేయడం మొదలెట్టింది. ముంబైలోని కుర్లాలో ఈమె స్థాపించిన సంస్థ తలుపులు 24 గంటలూ తెరిచి ఉంటాయి. ఏ సమయంలో అయినా ఏ వేశ్యావాటిక నుంచి అయినా ఏ అమ్మాయి అయినా ఇక్కడికి రావచ్చు. తల దాచుకోవచ్చు.

ద్వేషం నుంచి ప్రేమకు

'వేశ్యావాటికలో ఉన్నంత కాలం మా అమ్మను నేను ద్వేషించేదాన్ని. మా అమ్మ చేసే పని తప్పు అని నాకు అందరూ చెబుతుండేవారు. కాని క్రాంతి సంస్థలో చేరాక... ఆ పనిని మా అమ్మ కుటుంబం కోసం, నా కోసం చేసి ఉంటుందనే అవగాహన కలిగింది. మనల్ని మనం క్షమించుకోవడం, ఎదుటివారిని క్షమించగలగడం గొప్ప అవకాశం. అందుకే నేను మా అమ్మను ప్రేమించడం మొదలు పెట్టాను' అంటుంది మెహక్ అనే ఒక వేశ్యకూతురు. క్రాంతికి చేరుకున్న ఇరవై ముప్పై మంది ఆడపిల్లల బాల్యం భయానకంగా ఉంది. 'మా నాన్న ఎవరో నాకు తెలియదు. కాని వేరొకడు వచ్చి మా అమ్మను ఎప్పుడూ తంతుండేవాడు' అని ఒకమ్మాయి చెప్తే 'మా ఇంటికి వచ్చే ఒక మగాడు చిన్నపిల్ల అయిన నా రేటు అడుగుతుండేవాడు. మా అమ్మ వాణ్ణి బయటకు గెంటి నన్ను కాపాడుకుంటూ వచ్చింది' అని మరో అమ్మాయి చెప్పింది. 'నేను ఇంటి బయటి వెలుతురు కూడా చూడలేదు. రోడ్డు దాటలేదు. బజారు తెలియదు. అయినా మా అమ్మ పడే హింస చూసి పదేళ్ల వయసులో పారిపోయాను. మూడేళ్లు రోడ్ల మీదే తిరిగి ఈ సంస్థకు చేరుకున్నాను' అని ఒక అమ్మాయి చెప్పింది. సెక్స్ వర్కర్ల జీవితాల్లో రెండో భర్తగా ప్రవేశించినవాళ్లు వారి కుమార్తెలకు నరకం చూపించడం చాలా మంది ఆడపిల్లల జీవితంలో ఉంది. కాని ఇంత బాధ అనుభవించినా సరే జీవితాన్ని కాంతివంతం చేసుకోవాలని కలలు కనడమే ఈ అమ్మాయిలు చేసిన, చేయగలుగుతున్న గొప్ప పని.

రాబిన్ చౌరాసియా

నాటకం వేస్తున్న అమ్మాయిలు

సక్సెస్‌కు అర్థం ఏమిటి?

'క్రాంతి సంస్థలో చేరిన ఆడపిల్లలకు చదువు ఉండదు. వారి ఆధార్ కార్డులు, బర్త్ సర్టిఫికెట్లు ఉండవు. వారు 13 నుంచి 18 ఏళ్ల మధ్య ఉంటారు. వారిని ఏ స్కూల్స్‌లోనూ చేర్పించలేము. కనుక మా దగ్గర ఒక స్కూల్ మొదలెట్టాము. ఇది అందరికీ సమానమైన స్కూలు కాదు. ఒక్కో అమ్మాయిని బట్టి ఆమెకు అవసరమయ్యే క్లాసులను డిజైన్ చేస్తాము' అంటుంది రాబిన్ చౌరాసియా. 'ఒక అమ్మాయిని ఏడో క్లాసు మూడుసార్లు కూచోబెట్టాము. మూడుసార్లు ఫెయిల్ అయ్యింది. నా మిత్రుడు చెప్పాడు– ఆ అమ్మాయికి రాని పని చెప్పి ఎందుకు ఫెయిల్ అయ్యాననే భావన కలిగిస్తావు. వచ్చిన పని నేర్పించి పాసయ్యానని అనుకోనివ్వొచ్చు కదా' అని. ఈ ఫెయిల్ అయిన అమ్మాయి డ్రమ్స్ నేర్చుకుంది. ఇవాళ సంగీతం టీచరుగా చాలామంది పిల్లలకు సంతోషం పంచుతోంది. సక్సెస్‌కు నిజమైన అర్థం ఏమిటో నాకు తెలిసింది' అంటుంది రాబిన్. క్రాంతిలో చేరిన ఆడపిల్లల్లో ఒక అమ్మాయి జుంబా డాన్సర్ అయ్యింది. ఒక అమ్మాయి యూనివర్సిటీలో చదువుకుంటోంది. ఒక అమ్మాయి ఫ్లయిట్ అటెండెంట్ కావాలనుకుంటోంది. ఒక అమ్మాయి కామాటిపురాలో స్కూల్ తెరవాని అనుకుంటోంది. అందరు అమ్మాయిలు చక్కటి ఇంగ్లిష్‌లో మాట్లాడటం నేర్చుకున్నారు. అన్నింటికి మించి పెదాల మీద నిర్భయమైన నవ్వును నిలుపుకోవడం నేర్చుకున్నారు.

రెడ్‌లైట్ ఎక్స్‌ప్రెస్

క్రాంతిలో చేరిన ఆడపిల్లలు అందరూ అంతో ఇంతో థియేటర్‌ను కూడా నేర్చుకున్నారు. వీరంతా కలిసి 'లాల్ బత్తి ఎక్స్‌ప్రెస్' అనే నాటకం తయారు చేశారు. లాల్ బత్తి అంటే రెడ్‌లైట్ అని అర్థం. నాటకంలో ఈ ఆడపిల్లలందరూ తలా ఒక కంపార్ట్‌మెంట్‌గా మారిపోతారు. రెడ్‌లైట్ ఎక్స్‌ప్రెస్ ఒక్కో స్టేషన్‌లో ఆగుతూ ఉంటుంది. ఒక్కో కంపార్ట్‌మెంట్ (అమ్మాయి) తన కథ చెబుతూ ఉంటుంది. ఆ కథలన్నీ వేశ్యల జీవితాలను, వారి పిల్లలను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి. ఢిల్లీ, ముంబైలలోనే కాదు న్యూయార్క్, లండన్‌లలో కూడా ఈ అమ్మాయిలు వెళ్లి ఆ నాటకాన్ని ప్రదర్శించారు. లండన్‌లో నాటక సందర్భంలో అక్కడి వేశ్యలను కలిసి వారి జీవితాలను పరిశీలించారు. 'పెద్ద తేడా లేదు. అందరం ఒక్కటే' అని ఒక అమ్మాయి చెప్పింది. ఈ నాటకం జరుగుతున్నంత సేపు వెక్కివెక్కి ఏడ్చే ప్రేక్షకులకు కొదవ ఉండదు.

తీర్పులు ఎందుకు?

'ఇండియాలో సెక్స్‌వర్క్ లీగల్. కాని సమాజపరంగా తప్పు. ఈ విభజన వారిని తమలో తాము కుంచించుకుపోయేలా చేస్తోంది. వారి చదువుకు, వైద్యానికి, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలకు దూరం చేస్తోంది' అంటుంది రాబిన్ చౌరాసియా. 'ఇది తప్పు... ఇది ఒప్పు అని తీర్పులు ఇవ్వడం చాలా సులభం. ఒకరిది తప్పు అని అనడానికి మనం ఎవరం? వారు ఆ జీవితాన్ని ఎందుకు ఎంచుకున్నారో అందులో ఎందుకు కొనసాగుతున్నారో మనం ఊహించగలమా? కనుక తీర్పులు చెప్పడం మానండి. వారిని ఎలా కలుపుకుని పోవాలో ఆలోచించండి' అంటుందామె.

ఇది సుదీర్ఘ ప్రయాస అవసరపడే సంగతే. మనుషులు చాలా నెమ్మదిగా మారుతారు. కాని మారరేమో అనుకుని ఊరికే ఉండటం కన్నా మార్చాలని ప్రయత్నించడమే అవసరం. క్రాంతి సంస్థలోని అమ్మాయిలు చేస్తున్నది అదే.

– సాక్షి ఫ్యామిలీ

హెయిర్‌టిప్స్

ఒక కప్పు బీట్‌రూట్ రసంలో అరకప్పు పెరుగు, పావుకప్పు బాదం నూనె, చెంచా ఉసిరిక పొడి కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్లకు పట్టించి, అరగంట తర్వాత గోరువెచ్చని నీటితో తల స్నానం చేయాలి. నెలకు రెండుసార్లయినా ఇలా చేస్తే జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది.

పెరుగులో ఒక స్పూను తేనె, రెండు స్పూన్ల నిమ్మకాయరసం కలిపి తలకి పట్టించి ఒక అరగంట తర్వాత తల స్నానం చేస్తే జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.

ఖాదీ రవివర్మ

రవివర్మ చిత్రాలు గోడల మీద పెయింటింగ్స్‌గా, క్యాలెండర్లుగా కనిపించడం కొత్తకాదు. కాని అవి ఖాదీ వస్త్రాల మీదకు తర్జుమా కావడం పూర్తిగా కొత్త. గాంధీజీ 150వ జయంతి సందర్భంగా రవివర్మ ముని మనవరాలు రుక్మిణి వర్మ, డ్రస్ డిజైనర్ గౌరంగ్ షా ఖాదీ చీరల మీద రవివర్మ బొమ్మలను రూపు కట్టించారు. వీటి ప్రదర్శన ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది.

నవ కళ

రవివర్మ మునిమనుమరాలు రుక్మిణీవర్మ

ప్రఖ్యాత చిత్రకారుడు రాజా రవివర్మ ముని మనుమరాలు రుక్మిణి వర్మ నాట్యకారిణి. భరతనాట్యం, కథక్, కథాకళి ప్రదర్శనలు అనేకం ఇచ్చారు. బెంగళూరులో డాన్స్ స్కూల్, 'రాజా రవివర్మ హెరిటేజ్ ఫౌండేషన్' బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రవివర్మ చిత్రాల ప్రదర్శన మీద ఆమె ముందు నుంచి కృషి చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం డ్రస్ డిజైనర్ గౌరంగ్ షా ఆమెను కలిసి ఒక ప్రతిపాదన చేశారు. 'గాంధీజీ 150 జయంతి మరో ఐదేళ్లలో రానున్న సందర్భంగా ఆయనకు నివాళిగా ఖాదీ వస్త్రాల మీద రవివర్మ చిత్రాలను రూపుదిద్దుతాను. అందుకు అంతగా వ్యాప్తిలోకి రాని చిత్రాలు ఇవ్వండి' అని ఆ ప్రతిపాదన సారాంశం. అందుకు సమ్మతించిన రుక్మిణి రవివర్మ చిత్రాల్లో అరుదైన ఇంత వరకు ఎక్కువగా ప్రదర్శితం కాని ముప్పై చిత్రాలను ఇచ్చారు. ఆ చిత్రాలను ఖాదీ వస్త్రం మీద ఆవిష్కరింప చేయడం అనే మహా యజ్ఞాన్ని తలకెత్తుకున్నారు గౌరంగ్. ఐదేళ్ల సుదీర్ఘ శ్రమ తర్వాత ఆ బొమ్మలను ఖాదీ వస్త్రాల మీదకు తీసుకురాగలిగారు. ''గాంధీజీ ఫాదర్ ఆఫ్ నేషన్. రవివర్మ ఫాదర్ ఆఫ్ ఆర్ట్. ఈ ఇద్దరి జయంతి–వర్ధంతి ఒకే రోజు. గాంధీకి ఇష్టమైన ఖాదీలో రవివర్మ చిత్రాలను రూపొందించడానికి కారణం వాళ్లిద్దరినీ ఒక వేదిక మీదకు తీసుకు రావడమే. ఇందు కోసం రుక్మిణి వర్మను సంప్రదించినప్పుడు ఆమె వినూత్నమైన చిత్రాల హక్కులను ఇచ్చి మరీ ప్రోత్సహించారు. రవివర్మ చిత్రాల డిజిటల్ రూపాలను ఖాదీ వస్త్రాల మీద జాందానీ నేతలో పునఃసృష్టించాం. ఈ బొమ్మలు ఉన్న చీరల మొదటి ప్రదర్శనను 2019 అక్టోబర్ రెండవ తేదీన ముంబయిలో పెట్టాం. తర్వాత అహ్మదాబాద్, ఢిల్లీలో ప్రదర్శించాం. ఇప్పుడు హైదరాబాద్‌లో పెట్టాము. వచ్చే నెల బరోడాలో ఉంది. ఇలా దేశంలోని ప్రముఖ నగరాలన్నింటిలో ఎగ్జిబిషన్ పెట్టిన తర్వాత విదేశాలకు తీసుకెళ్లాలనేది నా ఆలోచన. '' అన్నారు గౌరంగ్ షా.

రవివర్మ చిత్రాల నేత చీరతో గౌరంగ్ షా

ప్రదర్శనలో...

హైదరాబాద్ 'సప్తపర్ణి'లో ప్రదర్శితమవుతున్న ముప్పై చిత్రాల్లో దాదాపుగా పాతిక చిత్రాలు స్త్రీ ప్రధానంగా ఉన్నాయి. రిద్ధి– సిద్ధిలతో వినాయకుడు, ఉయ్యాల ఊగుతున్న మోహిని, సఖులతో పరిహాసాల మధ్య శకుంతల, వనవాసంలో సీత, సుభద్రను ఓదారుస్తున్న అర్జునుడు, కేరళ సంప్రదాయ దుస్తులలో వీణ మీటుతున్న సరస్వతి మొదలైన చిత్రాలు చీరల మీద నేతలో ఒదిగిపోయాయి. ఒక చిత్రంలో కృష్ణుడి ఆస్థానంలో ఇరవై మంది కొలువుదీరి ఉన్నారు. ఒక్కొక్కరి ముఖంలో ఒక్కో భావం, కళ్లలో కూడా చిత్రవిచిత్రమైన భావాలు వ్యక్తమవుతున్నాయి. ఆ భావాలు చీర మీద కూడా యథాతథంగా రూపుదిద్దుకున్నాయి. హరి–హర బేటీ చిత్రంలో అయితే ఒకే తల రెండుగా భ్రమింపచేస్తుంది. శివుడు అధిరోహించిన నంది వైపు నుంచి చూస్తే నంది తల కనిపిస్తుంది. విష్ణుమూర్తి వైపు నుంచి చూస్తే ఏనుగు తల కనిపిస్తుంది. రవివర్మ చిత్రకళలో చూపించిన ఇంతటి వైవిధ్యాన్ని నేతలో తీసుకురావడానికి నేతకారులకు మూడేళ్లు పట్టింది. 150/150 నేతలో ఆరువందల రంగులను ఉపయోగించారు. శ్రీకాకుళంలోని జాందానీ నేతకారుల చేతుల్లో వస్త్రం మీద రూపం పోసుకున్న చిత్రాలివి.

– వాకా మంజులారెడ్డి

సందర్భం

అతిథి దేవోభవ!

తల్లి, తండ్రి, గురువు తర్వాత అతిథిని దేవుడిగా చూడమంది మన సంస్కృతి. ఒక మనిషి తన తావు నుంచి మన తావుకు వచ్చినప్పుడు అతని గౌరవం, మర్యాద దెబ్బ తినకుండా ఆదరించి పంపడం చాలా అవసరమైన గొప్ప సంస్కారమని మన సంస్కృతి చెబుతుంది. మన పురాణాలు కూడా ఉదాహరణలిస్తున్నాయి.

ఇంటికి వచ్చిన శత్రువునైనా ఆదరించాలని భారతీయ సంస్కృతి చెబుతుంది. 'అతిథి' అంటే తిథి, వార, నక్షత్రాలు లేకుండా వచ్చేవాడని అర్థం. అంటే అనుకోకుండా రావటమన్నమాట. అలా వచ్చారంటే వారు భగవంతునితో సమానం. సాక్షాత్తు ఆ దేవుడే అతిథి రూపంలో మన ఇంటికి వచ్చి, మనకు సేవ చేసే భాగ్యం కలిగించాడని దీని భావం.

మన సంప్రదాయంలో నలుగురిని భగవంతుడిగా భావించాలని కృష్ణ యజుర్వేదంలోని తైత్తరీయోపనిషత్తు చెబుతుంది. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ. మొదటి ముగ్గురితో మనకు రక్త సంబంధం, విజ్ఞాన సంబంధం ఉంటాయి. కాని నాలుగో వ్యక్తితో ఎటువంటి సంబంధమూ లేకపోయినా వారిలోనూ భగవంతుడిని దర్శించాలని ఈ ఉపనిషత్తు చెబుతోంది.

ఇంటికి వచ్చిన అతిథి ఎవరో మనకు తెలియకపోయినా, గుమ్మంలోకి రాగానే, కాళ్లు కడుక్కోవడానికి నీరు ఇచ్చి, లోపలకు సాదరంగా ఆహ్వానించి, దాహానికి మంచి నీళ్లు ఇచ్చి, వింజామర వీచి, కుశల సమాచారాలు అడగాలి. వచ్చిన అతిథికి బడలిక తీరాక, భోజనం చేయమని అడగాలి. ఇంట్లో ఆహార పదార్థాలు తక్కువగా ఉన్నప్పటికీ, అతిథిని సంతృప్తి పరచి, ఆతిథ్యం ఇచ్చేవారు ఉపవాసం చేయాలని పెద్దలు చెబుతారు. అలాగే అతిథికి కేటాయించిన గదిలో సుగంధ పరిమళాలు వెదజల్లేలా ధూపం, వెలుగు కోసం దీపం ఉంచాలని, భగవంతుడికి నైవేద్యం సమర్పించినట్లుగా, పవిత్ర భావంతో భోజనం వడ్డించాలని, భోజనం అయిన తరవాత అతిథికి అక్షంతలు ఇచ్చి, వారి దీవెనలు అందుకోవాలని భారతీయ సంప్రదాయం చెబుతోంది.

వశిష్ఠ మహర్షి ఆశ్రమానికి విశ్వామిత్రుడు రాజలాంఛనాలతో, తన పరివారంతో అకస్మాత్తుగా వచ్చినప్పుడు వశిష్ఠుడు తన దగ్గరున్న కామధేనువును స్మరించి వారందరికీ షడ్రసోపేతమైన భోజనం వడ్డించి, వారిని సంతృప్తులను చేయడం మనకు కనిపిస్తుంది.

పాండవులు అరణ్య వాసంలో ఉండగా వారి వద్దకు దుర్వాసుడు తన శిష్యులతో అతిథిగా వస్తాడు. అప్పటికి పాండవులు భోజనాలు ముగించి, అక్షయపాత్రను కడిగి బోర్లించారు. అతిథిని ఏ విధంగా గౌరవించాలో తోచక ద్రౌపది శ్రీకృష్ణుడిని ప్రార్థించింది. ఆయన వెంటనే దుర్వాస మహర్షికి, ఆయన శిష్యులకు కడుపు నిండిపోయేలా చేశాడు. వారు పాండవుల దగ్గరకు వచ్చి, కడుపులు నిండుగా ఉన్నాయని, పాండవులను ఆశీర్వదించి తరలి వెళ్లిపోయారు. అలా పరోక్షంగా ఆ అతిథులను సంతృప్తులను చేశారు.

శ్రీకృష్ణుని బాల్యమిత్రుడు కుచేలుడు శ్రీకృష్ణుని దర్శించుకోవటానికి రాజ్యానికి వచ్చాడు. కృష్ణుడు సింహాసనం దిగి వచ్చి, కుచేలుడికి అతిథి సత్కారాలు చేసి, దారిద్ర్య బాధలు తొలగించాడు. స్నేహితుడే అయినా అతిథిలా వచ్చాడు. ఆనందంగా తరలివెళ్లాడు. రామాయణంలో శ్రీరామచంద్రుడు అతిథి గొప్పదనం చెబుతూ 'రావణుడు వచ్చి శరణు కోరినా ఆయనకు నేను అతిథిలా భావించి, సేవించుకుంటాను' అంటాడు.

గొప్ప అతిథి మర్యాదలు చేసినవాడిగా బలి చక్రవర్తిని చెప్పుకోవచ్చు. ఆయన యజ్ఞం చేసి, వచ్చిన అతిథులకు అడిగినది లేదనకుండా దానం చేశాడు.


పాండవులు అరణ్యవాసంలో ఉన్నప్పుడు భోజనాలు ముగించి అక్షయపాత్ర ఖాళీగా వున్న సమయంలో వచ్చిన దుర్వాసుడు, అతని శిష్యులను ఏ విధంగా గౌరవించాలో తోచక ఖాళీ అక్షయ పాత్రతో శ్రీకృష్ణుడిని ప్రార్థిస్తున్న ద్రౌపది.

అంతేనా? వామనుడు అతిథిగా వచ్చి, మూడు అడుగుల నేల కోరగానే, అన్నీ ధారపోసి, అందరి మన్ననలు పొందాడు. శూద్రకుడు రచించిన మృచ్ఛకటికం నాటకంలో ఒకనాటి రాత్రి ఒక దొంగ చారుదత్తుడి ఇంటికి దొంగతనానికి వస్తాడు. అతడికి ఆ ఇంట్లో ఏమీ దొరకదు. అందుకు చారుదత్తుడు బాధపడి, అయ్యో వచ్చిన అతిథి రిక్తహస్తాలతో వెళ్లిపోతున్నాడే అనుకుంటాడు. చిరుతొండనంబిని పరీక్షించడానికి శివుడే అతిథి రూపంలో వస్తాడు. బిడ్డలు ఉన్న ఇంట్లోనే భోజనం చేస్తానంటాడు. అప్పటికి వారి కుమారుడు శిరియాళుడు మరణిస్తాడు. అతిథి మర్యాదలు ఎలా చేస్తాడో తెలుసుకోవటం కోసమే శివుడు ఈ పరీక్ష పెడతాడు. ఆ పరీక్షలో చిరుతొండ నంబి నెగ్గి, శివసాయుజ్యం పొందాడని బసవ పురాణం చెబుతోంది.

భారతంలో సక్తుప్రస్థుడి కుటుంబం వారం రోజులుగా తిండి లేక అవస్థలు పండుతుంది. ఆ రోజు వారికి పేలాల పిండి దొరుకుతుంది. నలుగురు నాలుగు భాగాలు చేసుకుని తినబోతారు. అంతలోనే ఇంద్రుడు అతిథిగా వస్తాడు. ఆయనను ఆహ్వానించి సక్తుప్రస్థుడు తన భాగాన్ని ఆయనకు వడ్డిస్తాడు. ఆయనకు ఆకలి తీరదు. తర్వాత భార్య, ఆ తరవాత కుమారుడు, కోడలు కూడా వారివారి భాగం పేలాల పిండితో అతిథిని సంతృప్తి పరుస్తారు. మెచ్చిన ఇంద్రుడు ఆ కుటుంబానికి అష్ట ఐశ్వర్యాలు ప్రసాదిస్తాడు.

మానవులే కాదు జంతువులు కూడా అతిథి సత్కారం చేశాయి. ఒక పావురాల జంటలో ఆడ పావురం, ఇంటికి వచ్చిన అతిథి కోసం అగ్నిలో దూకుతుంది. తన మాంసంతో అతిథిని సంతృప్తి పరుస్తుంది.

రామాయణంలో అరణ్యవాసం చేస్తున్న రాముడు సీతను వెతుకుతూ, తన ఆశ్రమానికి వచ్చినప్పుడు శబరి పండ్లతో అతిథి సత్కారాలు చేసింది.

ఇక ఈ ఉదంతం అందరికీ తెలిసిందే. అత్రి మహర్షి భార్య అనసూయ ఇంటికి త్రిమూర్తులు అతిథిలుగా వస్తారు. ఆతిథ్యం ఇచ్చేవారు వివస్త్రలుగా వడ్డించాలని నియమం పెడతారు. అప్పుడు అనసూయ త్రిమూర్తులను చంటి పిల్లలుగా మార్చి, వారికి పాలిచ్చి అతిథి సత్కారాలు పూర్తి చేస్తుంది.

అతిథికి భోజనం పెడితేనే కానీ భోజనం చేయకూడదనే నియమం కొందరికి ఉండేది. సుమారు 50 సంవత్సరాల క్రితం వరకు ఇంటికి అతిథులు రావాలనే ఆశతో వంట సిద్ధంగా ఉంచేవారు. ఇవాళ అతిథులకు వెళ్లడానికి సమయం ఉండటం లేదు. ఆతిథ్యం ఇచ్చేవారికి సమయం ఉండటం లేదు. అతిథులు వచ్చిపోయే ఇల్లు, ఊరు, దేశం కళకళలాడతాయి. మనం వొండుకొని మనం మాత్రమే తినే జీవితంలో నిజమైన రుచి ఉందంటారా?

– వైజయంతి పురాణపండ

రజనీకాంత్

పెద్దన్నయ్య

రజనీకాంత్ సినిమాలంటే ఆ ఎనర్జీయే వేరు. ఆయన సినిమా ప్రకటించినప్పటి నుంచే హంగామా మొదలవుతుంది. ఇక టైటిల్ ప్రకటన తర్వాత ఆ హంగామా రెండింతలవుతుంది. ప్రస్తుతం శివ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారాయన. ఈ సినిమాకు 'అన్నాత్తే' అనే టైటిల్ ఫిక్స్ చేసినట్టు సోమవారం ప్రకటించారు. 'అన్నాత్తే' అంటే పెద్దన్నయ్య అని అర్థం. ఇందులో ఖుష్బూ, మీనా, నయనతార, కీర్తీ సురేశ్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇందులో రజనీ కుమార్తె పాత్రలో కీర్తీ సురేశ్ నటిస్తున్నారు. నయనతార విలన్‌గా కనిపిస్తారని టాక్. ఈ సినిమాను ఈ ఏడాది దసరాకు విడుదల చేయాలనుకుంటున్నారు.

వరుణ్ తేజ్

షూటింగ్ షురూ

బాక్సింగ్‌కు సంబంధించిన శిక్షణ పూర్తయింది. దాన్ని స్క్రీన్ మీద చూపించడానికి రెడీ అయ్యారు వరుణ్ తేజ్. బాక్సింగ్ బ్యాక్‌డ్రాప్‌లో వరుణ్ తేజ్ హీరోగా తెరకెక్కనున్న తాజా చిత్రం సోమవారం సెట్స్ మీదకు వెళ్లింది. నూతన దర్శకుడు కిరణ్ కొర్రపాటి దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. అల్లు అరవింద్ సమర్పణలో అల్లు వెంకటేశ్, సిద్ధూ ముద్ద నిర్మిస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ వైజాగ్‌లో ప్రారంభం అయింది. ఇందులో బాలీవుడ్ హీరోయిన్ సాయీ మంజ్రేకర్ హీరోయిన్‌గా నటించబోతున్నారని టాక్. జూలై 30న ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు.

శ్యామ్ సింగ రాయ్

నాని

'జెర్సీ' వంటి సక్సెస్‌ఫుల్ సినిమా తర్వాత మరోసారి కలిశారు హీరో నాని, నిర్మాత సూర్యదేవర నాగవంశీ. ఈ సినిమాకు 'టాక్సీవాలా' ఫేమ్ రాహుల్ సంక్రిత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం నాని పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఈ సినిమాను ప్రకటించారు. నాని కెరీర్‌లో ఇది 27వ చిత్రం. ఈ సినిమాకు 'శ్యామ్ సింగరాయ్' అని టైటిల్ ఫిక్స్ చేశారు. డిసెంబర్ 25న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు చిత్రబృందం పేర్కొంది. ఇందులో హీరోయిన్‌గా సాయి పల్లవి నటించనున్నారని సమాచారం. ప్రస్తుతం 'టక్ జగదీష్' సినిమా చేస్తున్నారు నాని.

మేర్లపాక గాంధీ, 'తాగూర్' మధు, సుధాకర్ రెడ్డి, నితిన్, యస్. రాధాకృష్ణ

నితిన్ @ 31

'భీష్మ' చిత్రం సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న హీరో నితిన్ నటిస్తోన్న 31వ చిత్రం సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమయ్యింది. బాలీవుడ్‌లో మంచి విజయాన్ని అందుకున్న 'అంధాధూన్' చిత్రానికి ఇది రీమేక్. శ్రేష్ఠ్ మూవీస్ పతాకంపై 6వ చిత్రంగా తీయబోతున్న ఈ చిత్రానికి ఎన్.సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి నిర్మాతలు. 'తాగూర్' మధు సమర్పిస్తున్న ఈ చిత్రానికి మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రం ప్రారంభోత్సవంలో హారిక-హాసిని క్రియేషన్స్ అధినేత ఎస్. రాధాకృష్ణ చిత్రబృందానికి స్క్రిప్ట్ అందించగా, ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత 'దిల్' రాజు కెమెరా స్విచ్చాన్ చేశారు. నిర్మాత శ్యాంప్రసాద్ రెడ్డి క్లాప్‌నిచ్చారు. దర్శకుడు సురేందర్ రెడ్డి గౌరవ దర్శకత్వం వహించారు. జూన్ నుండి ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఆరంభమవుతుంది. ఈ చిత్రానికి కెమెరా: హరి కె.వేదాంత్.

ఒక్క ఫ్లాప్‌తో విలువ తగ్గిపోదు

అదితీరావ్ హైదరీ

''ఒక్క అపజయంతో ఏ యాక్టర్ విలువ తగ్గిపోదు'' అంటున్నారు అదితీ రావ్ హైదరీ. మణిరత్నం దర్శకత్వంలో చేసిన 'చెలియా'తో దక్షిణాదిన పాపులర్ అయిన అదితీ తెలుగులో 'సమ్మోహనం' చిత్రం చేశారు. మూడు నాలుగు రోజులుగా సమంతతో అదితీని ముడిపెట్టి సోషల్ మీడియాలో ఓ వార్త హల్‌చల్ చేస్తోంది. అదేంటంటే.. 'ఆర్ఎక్స్ 100' ఫేమ్ అజయ్ భూపతి ఓ సినిమా ('మహాసముద్రం' అనే టైటిల్ ప్రచారంలో ఉంది) ప్లాన్ చేస్తున్నారు. ఇందులో సమంతను కథానాయికగా తీసుకోవాలనుకున్నారని ప్రచారమైంది. అయితే ఇటీవల విడుదలైన తమిళ '96' తెలుగు రీమేక్ 'జాను' ఆశించిన ఫలితం సాధించకపోవడంతో అజయ్ భూపతి తన మనసు మార్చుకుని, కథానాయికగా అదితీ రావ్ హైదరీని తీసుకోవాలనుకుంటున్నారనే ప్రచారం మొదలైంది. ఈ వార్త గురించి అదితీ తన ట్వీటర్ ద్వారా స్పందించారు. ''ఈ విషయం గురించి మాట్లాడాల్సిన అవసరం ఎంతైనా ఉందనిపించింది. అందుకే చెబుతున్నా. ఒక్క ఫ్లాప్ వల్ల ఏ యాక్టర్ విలువ తగ్గిపోదు. దయచేసి ఇలాంటి ఆలోచనలను మనం ప్రోత్సహించవద్దు. అలాగే సినిమాకి సంబంధించిన ప్రకటనను చేసే అవకాశం డైరెక్టర్ లేదా ప్రొడ్యూసర్‌కి ఇవ్వాలి. వాళ్లను గౌరవించాలి'' అని పేర్కొన్న అదితీ.. ఈ సినిమా గురించి తనను సంప్రదించారా? లేదా? అనే విషయంలో మాత్రం క్లారిటీ ఇవ్వలేదు.

గంగూలీ బయోపిక్?



హృతిక్ రోషన్

బాలీవుడ్‌లో బయోపిక్స్ ట్రెండ్ నడుస్తోంది. స్పోర్ట్స్ స్టార్స్ బయోపిక్స్‌ను స్క్రీన్ మీదకు తీసుకురావడంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు దర్శక-నిర్మాతలు. గతంలో ధోనీ బయోపిక్ తీశారు. ప్రస్తుతం 1983 క్రికెట్ ప్రపంచ కప్ ఆధారంగా '83' తెరకెక్కింది. తాజాగా మాజీ భారత క్రికెట్ కెప్టెన్ సౌరవ్ గంగూలీ బయోపిక్ కూడా ప్లాన్ చేస్తున్నారని టాక్. కరణ్ జోహార్ ఈ బయోపిక్ నిర్మించే సన్నాహాలు చేస్తున్నారట. దీని కోసం గంగూలీతో సంప్రదింపులు కూడా జరుపుతున్నారట కరణ్. గంగూలీ పాత్ర కోసం హృతిక్ రోషన్ పేరును పరిశీలిస్తున్నారట. మైదానంలో చూపించిన దూకుడు స్వభావం, కెప్టెన్‌గా సాధించిన విజయాలు వంటి చాలా అంశాలు గంగూలీ కెరీర్‌లో ఉన్నాయి. అందుకే అతని కథ పక్కా కమర్షియల్ సినిమాకు సరిపడేలా ఉంటుందని గంగూలీ ఫ్యాన్స్ హర్షిస్తున్నారు.

జానకి.. శశికళ

మధుబాల

పూర్ణ

ఏ సినిమాకైనా సరైన ఆర్టిస్టులను ఎంపిక చేయడం ముఖ్యం. బయోపిక్ అయితే అది మరింత ముఖ్యం. ప్రస్తుతం జయలలిత బయోపిక్‌లోనూ ఆర్టిస్ట్‌ల ఎంపికలో రాజీ పడటం లేదు చిత్రబృందం. నటి, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత జీవితం ఆధారంగా ఏఎల్ విజయ్ తెరకెక్కిస్తున్న చిత్రం 'తలైవి' (నాయకురాలు అని అర్థం). కంగనా రనౌత్ టైటిల్ రోల్ చేస్తున్నారు. దివంగత నటుడు యంజీ రామచంద్రన్ (యంజీఆర్)గా అరవింద స్వామి, నటుడు శోభన్‌బాబు పాత్రలో బెంగాలీ నటుడు జిష్ణూ సేన్ గుప్తా నటిస్తున్నారు. తాజాగా జయ జీవితంలో కీలకమైన ఆప్తురాలు శశికళ పాత్రలో పూర్ణ నటిస్తున్నారు. యంజీఆర్ భార్య జానకి పాత్రలో 'రోజా' ఫేమ్ మధుబాల నటిస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు విజయ్ మాట్లాడుతూ – ''శశికళ పాత్రకి ప్రియమణిని అనుకున్నాం. కానీ డేట్స్ సమస్య వచ్చింది. పూర్ణ అయితే ఈ పాత్రకు బావుంటారని తీసుకున్నాం. మధుబాలగారిని జయలలిత తల్లి సంధ్య పాత్రలో తీసుకుందాం అనుకున్నాను. కానీ ఆమెను కలిశాక యంజీఆర్ భార్య జానకి పాత్రకు కరెక్ట్‌గా సరిపోతారని తీసుకున్నాం. ప్రస్తుతం చెన్నైలో షూటింగ్ చేస్తున్నాం. మార్చి మొదటివారం వరకూ ఈ షెడ్యూల్ సాగుతుంది'' అన్నారు. శైలేష్ ఆర్, విష్ణు వర్ధన్ ఇందూరి నిర్మిస్తున్న ఈ సినిమా ఈ ఏడాది జూన్‌లో విడుదల కానుంది.

లక్ష్మీ పార్వతి, ముస్కాన్

నిర్మల్ కొయ్యబొమ్మల నేపథ్యంలో...

తెలుగు రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న లక్ష్మీ పార్వతి తొలిసారి కీలక పాత్రలో నటించిన చిత్రం 'రాధాకృష్ణ'. అనురాగ్, ముస్కాన్ శెట్టి జంటగా నటించారు. ప్రసాద్ వర్మ దర్శకత్వం వహించారు. దర్శకుడు 'ఢమరుకం' శ్రీనివాస్ రెడ్డి సమర్పణలో హరిణి ఆరాధ్య క్రియేషన్స్ పతాకంపై పుప్పాల సాగరిక, శ్రీనివాస్ కానూరు నిర్మించారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ– ''కనుమరుగవుతున్న నిర్మల్ కొయ్యబొమ్మల కథ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. అందరి హృదయాలను హత్తుకునే ఆప్యాయతలు ఉంటాయి. పల్లె వాతావరణంలోని అన్ని రకాల భావోద్వేగాలతో కూడిన ఒక అందమైన ప్రేమకథ ఇది. ఎక్కడా రాజీ పడకుండా అనుకున్న విధంగా చిత్రీకరించాం. నిర్మాణానంతర కార్యక్రమాలు అతి త్వరలో పూర్తి చేసి, ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం'' అన్నారు. సంపూర్ణేష్ బాబు, అలీ , కృష్ణ భగవాన్, చమ్మక్ చంద్ర ఇతర పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి కెమెరా: టి.సురేందర్ రెడ్డి, సంగీతం: ఎమ్.ఎమ్.శ్రీలేఖ.

నిన్ను విసిగించడం మిస్ అవుతా

వరుణ్ ధావన్, సారా అలీఖాన్

వరుణ్ ధావన్, సారా అలీ ఖాన్ ముఖ్య పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'కూలీ నెం.1'. 1995లో వచ్చిన 'కూలీ నెం.1' చిత్రానికి ఇది రీమేక్. పాత సినిమాకి దర్శకత్వం వహించిన డేవిడ్ ధావనే రీమేక్‌ని తెరకెక్కించారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా సారా మాట్లాడుతూ – ''కూలీ' సినిమాని ముగించాం. మా బెస్ట్, కూలెస్ట్ కూలీగా ఉన్నందుకు వరుణ్ ధావన్‌కు స్పెషల్ థ్యాంక్స్. నా లగేజ్‌ని నాతో నువ్వు మోయించినట్టుగా ఎవ్వరూ మోయించి ఉండలేరు. నిన్ను విసిగించడం కచ్చితంగా మిస్ అవుతాను'' అని అన్నారు. 'కూలీ నెం.1' చిత్రం మే 1న విడుదల కానుంది. అన్నట్లు.. వరుణ్ ధావన్.. డేవిడ్ ధావన్ కుమారుడు అనే సంగతి తెలిసిందే.

పవర్‌ఫుల్ పోలీస్


పృథ్వీరాజ్

పవన్‌తేజ్ కొణిదెల హీరోగా, మేఘన, లక్కీ హీరోయిన్లుగా అభిరామ్ ఎం. దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఈ కథలో పాత్రలు కల్పితం'. మాధవి సమర్పణలో ఎంవీటీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రాజేష్ నాయుడు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో 'పెళ్లి' సినిమా ఫేమ్ పృథ్వీరాజ్ పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రంలోని ఆయన లుక్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజేష్ నాయుడు మాట్లాడుతూ– ''థ్రిల్లింగ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న చిత్రమిది. ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో రెండో షెడ్యూల్ జరుపుతున్నాం. పవన్ తేజ్‌కి తొలి సినిమా అయినా అనుభవం ఉన్నవాడిలా నటిస్తున్నాడు. అభిరామ్ మేకింగ్ ఫ్రెష్‌గా ఉంది. 'జెర్సీ' ఫేమ్ సునీల్ కుమార్ విజువల్స్, 'ఆర్ఎక్స్ 100, కల్కి' చిత్రాలకు డైలాగ్స్ రాసిన తాజుద్దీన్ సయ్యద్ మాటలు ఈ చిత్రానికి హైలైట్‌గా నిలుస్తాయి'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: కార్తీక్ కొడకండ్ల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కృష్ణ పామర్తి, లైన్ ప్రొడ్యూసర్: దుర్గా అనిల్ రెడ్డి.

నాలో మార్పు తెచ్చింది

శోభిత ధూళిపాళ్ల

''కొన్ని సినిమాల చిత్రీకరణ పూర్తవగానే ఎంతో నేర్చుకున్నాం, ఎన్నో జ్ఞాపకాల్ని సంపాదించుకున్నాం అనే అనుభూతి మిగులుతుంది. 'కురుప్' చిత్రం ఓ మంచి జ్ఞాపకం'' అన్నారు శోభితా ధూళిపాళ్ల. దుల్కర్ సల్మాన్ హీరోగా శ్రీనాథ్ రాజేంద్రన్ తెరకెక్కించిన మలయాళ చిత్రం 'కురుప్'. శోభితకి ఇది రెండో మలయాళ చిత్రం. కేరళ ప్రాంతంలో నివసించిన మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ సుకుమార కురుప్ జీవితం ఆధారంగా ఈ సినిమా తీశారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా శోభిత మాట్లాడుతూ – ''కురుప్' నా తొలి పూర్తిస్థాయి మలయాళ (గతంలో 'మూతాన్'లో గెస్ట్ రోల్ చేశారు) చిత్రం. ఇది నా కెరీర్‌లో చాలా స్పెషల్ సినిమాగా నిలిచిపోతుంది. దానికి కారణం ఈ ప్రయాణంలో నాకు తెలియకుండానే ఎమోషనల్‌గా, క్రియేటివ్‌గా నాలో వచ్చిన మార్పు. నా పర్సనల్ క్యారెక్టర్‌ని ప్రభావితం చేసిన ప్రయాణమిది. ఇది మర్చిపోలేని ప్రయాణం'' అన్నారు.

అనుకున్నది ఒక్కటి

సిద్ధీ ఇద్నాని, త్రిధా చౌదరి, కోమలి ప్రసాద్, ధన్య బాలకృష్ణ

'మంచి మనసుకు మంచి రోజులు' చిత్రంలోని 'అనుకున్నదొక్కటి అయినది ఒక్కటి బోల్తా కొట్టిందిలే బుల్ బుల్ పిట్ట..' పాట ఎంత పాపులర్ అయిందో తెలిసిందే. తాజాగా ఇదే పేరుతో ఓ సినిమా రూపొందింది. ధన్య బాలకృష్ణ, త్రిధా చౌదరి, సిద్ధీ ఇద్నాని, కోమలీ ప్రసాద్ ప్రధాన పాత్రల్లో నటించారు. జర్నలిస్టు బాలు అడుసుమిల్లి ఈ చిత్రంతో దర్శకునిగా పరిచయమవుతున్నారు. బ్లాక్ అండ్ వైట్ పిక్చర్స్, పూర్వీ పిక్చర్స్ పతాకంపై హిమబిందు వెలగపూడి, వేగి శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమా మార్చి 6న విడుదలకానుంది. ఈ చిత్రం కొత్త ట్రైలర్‌ని విడుదల చేశారు. బాలు అడుసుమిల్లి మాట్లాడుతూ– ''మీడియా నుంచి వచ్చి ఒక సినిమాకు దర్శకత్వం వహించడం పెద్ద స్టెప్. చాలా మంది దర్శకులు కావాలని ప్రయత్నిస్తూ ఉంటారు. అందుకని దర్శకులందరికీ ఈ సినిమాను అంకితం ఇస్తున్నా'' అన్నారు. ''ఈ చిత్రంలో ధన్య అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పాత్రలో కనిపిస్తాను'' అన్నారు ధన్య బాలకృష్ణ. ''చిన్నప్పటి నుండి స్నేహితులైన నలుగురు అమ్మాయిల కథే ఈ సినిమా'' అన్నారు సిద్ధీ ఇద్నాని. ''ఈ కథలో నలుగురు హీరోయిన్ల పాత్రలకు ప్రాధాన్యం ఉంటుంది'' అన్నారు త్రిధా చౌదరి. ''హాయిగా రెండు గంటల పాటు నవ్వుకోవడానికి మా సినిమాకి రండి'' అన్నారు కోమలి ప్రసాద్. ''బాలు దర్శకుడు అవుతానని చెప్పినప్పుడు షాకయ్యా. కథ విన్న తర్వాత ట్రై చేయమని చెప్పాను. తర్వాత మేమే సినిమా నిర్మించాలనే నిర్ణయానికి వచ్చాం. రఘురామ్‌గారు, శ్రీరామ్‌గారు ఎంతో సపోర్ట్ చేశారు'' అన్నారు హిమబిందు. చిత్ర సహనిర్మాత రఘురామ్ యేరుకొండ, నటులు లోబో, బాషా మాట్లాడారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: ఎల్ఎన్‌వారణాసి, వైజేఆర్, లైన్ ప్రొడ్యూసర్: నేహా మురళి, కెమెరా: శేఖర్ గంగమోని, సంగీతం: వికాస్ బాడిస.

ఆహ్లాదంగా.. హాయిగా...

దీపాలి రౌత్

శాంతి రాజు, దీపాలి రౌత్, అఖిల్ ప్రియ, సోము ఉండర్ల, శ్రావణ్ చిన్నా, రవీందర్ ముఖ్య తారలుగా వి. అంబికా విజయ్ దర్శకత్వంలో బాన వెంకట కొండారెడ్డి నిర్మించిన చిత్రం 'వై తరుని రాణా'. నటుడు 'జెమిని' సురేష్, తెలంగాణ ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్, కాశం సత్యనారాయణ, అంజనా కార్గో సీఈఓ నరేంద్ర ఈ సినిమా ఆడియో బిగ్ సీడీ, ట్రైలర్‌లను విడుదల చేశారు. 'జెమిని' సురేష్ మాట్లాడుతూ– ''చిన్నా మంచి ఫోటోగ్రాఫర్. ఇప్పుడు నటుడిగా మారాడు. తనకు సినిమాలంటే ప్యాషన్. అలాంటివాళ్లు ఎప్పుడూ విజయం సాధిస్తారు. ఈ సినిమాలోని ప్రతి పాట డైరెక్టర్ వంశీగారి సినిమాల్లో ఉన్నట్లు ఆహ్లాదంగా మనసుకు హాయిగా అనిపిస్తుంది'' అన్నారు. ''నా మీద నమ్మకంతో కొండారెడ్డిగారు అవకాశం ఇచ్చారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకూడదని బెస్ట్ రిజల్ట్ ఇవ్వడానికి ప్రయత్నించాను'' అన్నారు అంబికా విజయ్. ''మా నాన్న కొండారెడ్డిగారు ముందు ఈ సినిమా నిర్మించనన్నారు. స్టోరీ విని, స్క్రిప్ట్‌పై మేం పడుతున్న కష్టం చూసి అంగీకరించారు. మార్చిలో సినిమా విడుదల చేయనున్నాం'' అన్నారు నిర్మాత తనయుడు బుల్‌రెడ్డి. శాంతి రాజు, రాయంచ, కెమెరామేన్ బాలకృష్ణ, పాటల రచయిత సుబ్రమణ్యం పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎల్.ఎం. ప్రేమ్ రాయంచ, సదా చంద్ర, కెమెరా: రామ శ్రీనివాస్, నేపథ్య సంగీతం: ఆనంద్.

నమస్తే ట్రంప్
నల్లగొండ | మంగళవారం | ఫిబ్రవరి | 25 | 2020 | www.sakshi.com

హోలీ టు షోలే..

లవ్యూ ఇండియా

- జనరంజకంగా ట్రంప్ ప్రసంగం
- కిక్కిరిసిన మొతెరా స్టేడియం
- దాదాపు అరగంట మాట్లాడిన ట్రంప్
- మోదీపై ప్రశంసల జల్లు
- అంతకుముందు అహ్మదాబాద్‌లో రెడ్ కార్పెట్‌తో ఘనస్వాగతం

అహ్మదాబాద్: 'అమెరికా భారత్‌ను అభిమానిస్తుంది.. అమెరికా భారత్‌ను గౌరవిస్తుంది.. అమెరికా భారత్‌కు ఎన్నటికీ విశ్వసనీయ మిత్రుడిగా ఉంటుంది. ఈ సందేశాన్ని ఈ దేశ పౌరులకు ఇవ్వడం కోసం నేను, మెలానియా 8 వేల మైళ్లు ప్రయాణించి ఇక్కడికి వచ్చాం'.. భారతీయుల మనసు గెలుచుకునే ఈ సందేశంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటన ప్రారంభించారు. అహ్మదాబాద్‌లో నూతనంగా నిర్మించిన క్రికెట్ స్టేడియంలో 'నమస్తే ట్రంప్' కార్యక్రమంలో భాగంగా లక్షకు పైగా హాజరైన జన సందోహాన్ని ఉద్దేశించి సోమవారం ట్రంప్ ప్రసంగించారు. 'నమస్తే.. నమస్తే.. హలో ఇండియా' అంటూ తన ప్రసంగాన్ని ట్రంప్ ప్రారంభించారు. భారత ప్రధాని మోదీ తనకు నిజమైన స్నేహితుడని, దేశం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఆ మహోన్నత నేతకు.. తనకీ అవకాశం కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. భారత సాంస్కృతిక వైభవాన్ని, గత 70 ఏళ్లలో భారత్ సాధించిన అద్భుత విజయాలను, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ పాటిస్తున్న గొప్ప విలువలను, వివిధ రంగాల్లో ఇండియా సాధించిన ఘనతలను ట్రంప్ తన ప్రసంగంలో సందర్భానుసారం ప్రస్తావించి, భారతీయులను ఆకట్టుకున్నారు. స్వామి వివేకానంద ప్రవచిత వ్యాఖ్యను గుర్తు చేసి, భారత దార్శనికతను ప్రశంసించారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్ సామర్థ్యాన్ని తన ప్రసంగంలో గుర్తు చేశారు. భారత్‌కు సహకరించే విషయంలో అమెరికా ముందుంటుందని, భారత సాయుధ దళాలకు ప్రపంచంలోనే అత్యంత ఆధునిక ఆయుధాలను అందించేందుకు అమెరికా సిద్ధంగా ఉందని ప్రకటించారు. 300 కోట్ల డాలర్ల విలువైన రక్షణ ఒప్పందంపై ఇరుదేశాలు సంతకం చేయనున్నాయని వెల్లడించారు. వేదికపైకి మోదీ, ట్రంప్‌తో పాటు మెలానియా వచ్చారు. హోంమంత్రి అమిత్ షా, గుజరాత్ సీఎం విజయ్ రూపానీ, ట్రంప్ కూతురు ఇవాంకా, అల్లుడు కుష్నర్.. ఇతర ప్రముఖులు మొదటి వరుసలో కూర్చుని ట్రంప్, మోదీల ప్రసంగాలను విన్నారు.

ఈ స్వాగతాన్ని మర్చిపోలేం

'ఐదు నెలల క్రితం భారత ప్రధానికి అమెరికాలో భారీ ఫుట్‌బాల్ స్టేడియంలో స్వాగతం పలికాం. ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియంలో నన్ను స్వాగతిస్తున్నారు. ఈ స్వాగతం గొప్పగా ఉంది. థ్యాంక్యూ. ఈ ఆతిథ్యాన్ని మేమెన్నడూ మర్చిపోం' అని ట్రంప్ తన ప్రసంగంలో వ్యాఖ్యానించారు. హిందువులు, ముస్లింలు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, క్రిస్టియన్లు కలిసిమెలిసి జీవిస్తున్న దేశంగా.. వ్యక్తిగత స్వేచ్ఛ, న్యాయపాలన, పౌరులందరికి గౌరవ ప్రదమైన జీవనం కల్పిస్తున్న దేశంగా భారత్‌ను ప్రపంచదేశాలు అభిమానిస్తాయన్నారు.

గట్టి ప్రతినిధి

ఒక సామాన్య భారతీయుడు ఏం సాధించగలడనేదానికి భారత ప్రధాని మోదీనే సజీవ తార్కాణమని ప్రశంసించారు. భారత, అమెరికా వాణిజ్య చర్చలను ప్రస్తావిస్తూ 'మోదీ తమ దేశం తరపున గట్టిగా వాదిస్తారు(టఫ్ నెగోషియేటర్)' అని నవ్వుతూ వ్యాఖ్యానించారు. ''మోదీని ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. కాకపోతే ఆయనతో వ్యవహారాలు నడపడం అంత సులువు కూడా కాదు''అని అన్నారు. ''ప్రధానమంత్రి మోదీగారు.. మీరు గుజరాత్‌కు మాత్రమే గర్వకారణం కాదు. అంకితభావంతో కష్టపడి పనిచేస్తే భారతీయులు ఏదైనా సాధించగలరు అనేందుకు సజీవ తార్కాణం మీరు''అని ప్రజల హర్షధ్వానాల మధ్య వివరించారు. 'భారత్ సామర్థ్యం ఆశ్చర్యకరం. అద్భుతం. స్వతంత్ర దేశంగా భారత్ సాధించిన అభివృద్ధి మిగతా దేశాలకు స్ఫూర్తిదాయకం. భారత్ సాధించిన పురోగతి ఈ శతాబ్దంలోనే అసాధారణ విజయం' అని ఇండియాపై తన అభిమానాన్ని చాటుకున్నారు.

చప్పట్లు.. నవ్వులు..

గుజరాత్ సహా పలు ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు లక్ష మందితో మొతెరా స్టేడియం కిక్కిరిసింది. మోదీ, సర్దార్‌పటేల్‌ను ప్రశంసిస్తున్న సమయంలో, షోలే, డీడీఎల్‌జీ వంటి బాలీవుడ్ సినిమాలు, క్రికెటర్లు సచిన్, కోహ్లీలను ప్రస్తావించిన సమయంలోనూ భారీగా చప్పట్లు వినిపించాయి. ట్రంప్ మాటతీరు, ఉచ్చారణతో పలుమార్లు స్టేడియంలో నవ్వులు పూచాయి. ప్రపంచం మారుమూలల్లోనూ భారతీయ నృత్యం భాంగ్రాకు, హోళీ, దీపావళి పండగలకు మంచి ఆదరణ ఉందన్నారు. 'ఏడాదికి రెండు వేల సినిమాలు తీసే అత్యద్భుతమైన సృజనాత్మకత ఉన్న బాలీవుడ్ ఉన్న దేశమిది'అంటూ వ్యాఖ్యానించారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

మోదీ, ట్రంప్‌లు స్టేడియంలోకి వచ్చేవరకు బాలీవుడ్ గాయకుడు కైలాశ్ ఖేర్ బృందం, గుజరాతీ స్థానిక గాయకులు తమ పాటలతో ప్రేక్షకులను అలరించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు స్టేడియంలో వాలంటీర్లుగా వ్యవహరించారు.

వి ద పీపుల్

నమస్తే ట్రంప్ కార్యక్రమం అనంతరం ప్రెసిడెంట్ ట్రంప్ మరో ట్వీట్ చేశారు. ''అమెరికా, భారత్.. ఈ రెండు దేశాల రాజ్యాంగాలు ఒకే అద్భుతమైన పదంతో ప్రారంభమవుతాయి. అది 'వి ద పీపుల్(ప్రజలమైన)'. అంటే, మన రెండు దేశాల్లోనూ దేశ పౌరులకు సమాన గౌరవం, సాధికారత, విశ్వాసం లభిస్తాయి'' అని ఆయన ట్వీట్ చేశారు.

ఎండల్లో.. ఓపికగా ప్రజలు...

స్టేడియంకు సోమవారం ఉదయం తొమ్మిది గంటలకే విచ్చేసిన ప్రజల సహనానికి ఎర్రటి ఎండ పరీక్ష పెట్టింది. స్టేడియం సామర్థ్యం 1.10 లక్షలు కాగా సోమవారం అంతకు మించి 1.25 లక్షల మంది చేరారు. ఇరువురు నేతలు ప్రజలకు అభివాదం చేయడాన్ని పెద్ద ఎత్తున హర్షధ్వానాల మధ్య స్వాగతించారు కూడా. అయితే సమయం గడుస్తున్న కొద్దీ ప్రజల ఓపిక తగ్గుతూ వచ్చింది. ప్రధాని మోదీ ప్రసంగాన్ని ఆసక్తిగా విన్న ప్రజలు ఆ తరువాత ట్రంప్ మాట్లాడే సమయానికి ఒక్కరొక్కరుగా స్టేడియంను వీడిపోవడం కనిపించింది. మోదీని ట్రంప్ ప్రశంసించే సమయంలో చాలామంది బయటకు వెళ్లారు.

రాడికల్ ఇస్లామిక్ ఉగ్రవాదం ముప్పు

రాడికల్ ఇస్లామిక్ ఉగ్రవాదం ముప్పు నుంచి తమ పౌరులను కాపాడుకునేందుకు భారత్, అమెరికాలు కృషి చేస్తున్నాయన్నారు. ఈ ముప్పు కారణంగా తీవ్రంగా నష్టపోయిన దేశాల్లో భారత్, అమెరికాలు ఉన్నాయన్నారు. 'ఉగ్రవాద సంస్థ ఐఎస్‌ను సంపూర్ణంగా నాశనం చేశాం. ఐఎస్ స్థాపకుడైన అల్ బగ్దాదీ వంటి రాక్షసున్ని అంతమొందించాం' అని గుర్తు చేశారు. తమ సరిహద్దులను కాపాడుకునే హక్కు ప్రతీ దేశానికి ఉంటుందని, ఉగ్రవాదులను, వారి భావజాలాన్ని నిర్మూలించే దిశగా భారత్, అమెరికా కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. 'నేను అధ్యక్ష బాధ్యతలను తీసుకున్నప్పటి నుంచి ఉగ్రసంస్థలను, వారి భూభాగంలోని ఉగ్రవాదులను నాశనం చేసే దిశగా పాకిస్తాన్‌తో సానుకూలంగా వ్యవహరిస్తున్నాం' అన్నారు. 'పాక్‌తో మా సంబంధాలు బావున్నాయి. అవి మెరుగుపడే దిశగా వెళ్తున్నాం. దక్షిణాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు తొలగుతాయని, సుస్థిరత నెలకొంటుందని ఆశిస్తున్నా' అన్నారు. ఈ విషయంలో భారత్ కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. చైనా పేరును ప్రస్తావించకుండానే.. స్వేచ్ఛాయుత ఇండో పసిఫిక్ ప్రాంతం కోసం భారత్, అమెరికాలు కృషి చేస్తున్నాయన్నారు. భారత్, అమెరికాలు సహజ మిత్రదేశాలను ట్రంప్ అభివర్ణించారు. అమెరికా విలువలను కాపాడేవారికి తమ దేశంలోకి స్వాగతం పలుకుతామని, అదే సమయంలో ఉగ్రవాదాన్ని కానీ ఏ విధమైన తీవ్రవాదాన్ని కానీ సమర్థించబోమన్నారు.

ట్రంప్ తొలిరోజు పర్యటన సాగిందిలా

- ఉదయం 11.40కి అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ట్రంప్ దంపతులు చేరుకున్నారు.
- 12.10: సబర్మతీ ఆశ్రమానికి చేరుకున్నారు
- 12.50: మొటెరా స్టేడియంకు వెళ్లారు
- 1.15: ట్రంప్ ప్రసంగం ప్రారంభించారు.
- 2.50: అహ్మదాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు.
- 4.15: ఆగ్రా ఎయిర్‌బేస్‌కు చేరుకున్నారు.
- 4.50: తాజ్‌మహల్ సందర్శనకు వచ్చారు
- 6.45: తిరిగి ఆగ్రా ఎయిర్ బేస్‌కు వెళ్లారు
- 7.40: ఢిల్లీలోని పాలమ్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు
- 8.00: మౌర్య హోటల్‌లో రాత్రి బస

● ముస్తఫా.. ముస్తఫా

ప్రపంచ గతిని మారుస్తాం

అమెరికాతో మైత్రిపై మోదీ వ్యాఖ్యలు

అహ్మదాబాద్: ట్రంప్ భారత్‌కు ప్రత్యేక స్నేహితుడని ప్రధాని మోదీ అభివర్ణించారు. ట్రంప్ భారత పర్యటన భారత్, అమెరికా సంబంధాల్లో కొత్త చరిత్ర సృష్టిస్తుందన్నారు. భారత్, అమెరికాలు సహజ మిత్ర దేశాలన్నారు. మొతెరా స్టేడియంలో సోమవారం జరిగిన నమస్తే ట్రంప్ కార్యక్రమంలో మోదీ ప్రసంగించారు. తొలుత, ట్రంప్‌కు స్వాగతం పలుకుతూ ప్రసంగించిన మోదీ.. ట్రంప్ ప్రసంగం అనంతరం మళ్లీ కాసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. 'అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి స్వాగతం' అంటూ ట్రంప్‌కు మోదీ స్వాగతం పలికారు. '21వ శతాబ్దంలో ప్రపంచ గతిని మార్చడంలో భారత్, అమెరికా సంబంధాలు, వాటి మధ్య నెలకొన్న సహకారం కీలక పాత్ర పోషిస్తుంది. ఈ రెండు దేశాలు సహజ సిద్ధ భాగస్వాములు' అని తన ప్రసంగంలో మోదీ వ్యాఖ్యానించారు. భారత్, అమెరికాల మధ్య నెలకొన్న సంబంధాలను ప్రస్తావిస్తూ.. అమెరికా భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అని గుర్తు చేశారు. 'భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అమెరికా. భారత్‌కు రక్షణ ఉత్పత్తులను అత్యధికంగా అందిస్తున్న దేశం అమెరికా' అన్నారు. ఈ రెండు దేశాలు సంయుక్తంగా అనేక సైనిక విన్యాసాలు నిర్వహించాయన్నారు. 'ఈ రెండు దేశాల మధ్య సహకారం ఇండో పసిఫిక్ ప్రాంతంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా శాంతి, భద్రత, పురోగతి నెలకొనడంలోనూ కీలక పాత్ర పోషిస్తుంది' అన్నారు. ఈ రెండు దేశాల మధ్య సంబంధాలను సాధారణ సంబంధాలుగా తీసిపారేయలేమని, ప్రస్తుతం అవి అత్యున్నత శిఖరాలకు చేరుకున్నాయని వ్యాఖ్యానించారు. ట్రంప్ తన కుటుంబంతో భారత్‌కు రావడం దీన్నే స్పష్టికరిస్తోందన్నారు. 'ట్రంప్ భారత పర్యటన ఈ దశాబ్దం ప్రారంభంలో చోటు చేసుకున్న అతిపెద్ద కార్యక్రమం' అని మోదీ పేర్కొన్నారు. 'ట్రంప్ పర్యటన ఇరుదేశాల సంబంధాల్లో కొత్త అధ్యాయం. ఈ అధ్యాయం భారత్, అమెరికాల ప్రజల పురోగతి, సౌభాగ్యాలకు తార్కాణంగా నిలుస్తుంది' అన్నారు.

స్టేడియంలో మోదీ ఇచ్చిన పుస్తకంతో ట్రంప్ దంపతులు

కార్యక్రమంలో ముందు వరసలో ఇవాంకా, ఆమె భర్త కుష్నర్, హోం మంత్రి అమిత్ షా తదితరులు

సుచిన్..షోజే..చీవాలా!!

ట్రంప్ హోంవర్క్‌కు మాత్రం అభినందనలు

ఎయిర్‌పోర్టులో జానపద కళాకారుల నృత్యాల మధ్య ట్రంప్ దంపతులకు సాదర స్వాగతం పలుకుతున్న మోదీ

అహ్మదాబాద్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ప్రసంగం విషయంలో బాగానే ప్రిపేరయినట్లున్నారు. ఎందుకంటే దీన్లో ఆయన బోలెడన్ని భారతీయ పేర్లు, పండుగలు, హిందీ సినిమాలను కూడా జొప్పించారు. కాకపోతే వాటిని పలకటంలో మాత్రం తడబడ్డారు. నరేంద్రమోదీని ఛాయ్ వాలాగా సంభోదించబోయి 'చీవాలా' అన్నారు. ఇక వేదాలను వేస్టాస్‌గా... స్వామి వివేకానంద పేరును వివేకాముందగా... సచిన్ టెండూల్కర్‌ను సుచిన్ టెండూల్కర్‌గా పేర్కొన్నారు. దీంతో పాటు షోలే సినిమాను షోజే అని అన్నారు. దిల్‌వాలే దుల్హనియా లేజాయెంగే సినిమా పేరును షార్ట్‌కట్‌లో చక్కగా డీడీఎల్‌జే అని పలికేశారు. ఈ తప్పులపై ట్విటర్‌లో ట్రోలింగ్ బాగానే జరిగింది. కాకపోతే ఇన్ని పేర్లను పలకటానికి ట్రంప్ బాగానే హోమ్ వర్క్ చేసి ఉంటారంటూ చాలామంది వీటిని తేలిగ్గానే తీసుకున్నారు. ఇక సచిన్ టెండూల్కర్ పేరును సుచిన్ టెండూల్కర్‌గా పలికినందుకు ట్రంప్‌ను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ట్విట్టర్ వేదికగా విమర్శించింది. అయినా అమెరికాలో సగం మంది క్రికెట్ అంటేనే... 'అదేం ఆట?' అని అడిగే పరిస్థితి ఉంది. అలాంటిది ట్రంప్ ఏకంగా సచిన్ పేరునే బట్టీపట్టినందుకు ప్రశంసించాలంటూ కొందరు పేర్కొనటం కొసమెరుపు!!.

రాట్నం తిప్పి.. నూలు వడికి

మహాత్ముడి ఇంట పావుగంట

రాట్నం పనితీరును ట్రంప్ దంపతులకు వివరిస్తున్న మోదీ

అహ్మదాబాద్ :

భారత్ పర్యటనకు వచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన సతీమణి మెలానియా ట్రంప్ సోమవారం అహ్మదాబాద్‌లో సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించి జాతిపిత మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. అంతకు కొద్ది నిముషాల ముందే ఆశ్రమానికి చేరుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా ట్రంప్ దంపతులకు ఆశ్రమం అంతా తిప్పి చూపించి దాని విశిష్టతను తెలియజేశారు. భారత స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో ఈ ఆశ్రమంలో గాంధీజీ, ఆయన భార్య కస్తూర్బా 1917-1930 మధ్య కాలంలో నివసించారు. వారిద్దరూ నివసించిన గది హృదయ్ కుంజ్ లోపలికి ట్రంప్ దంపతుల్ని తీసుకువెళ్లి చూపించారు. భారత స్వాతంత్ర్య సంగ్రామం గురించి, గాంధీజీ పోరాట స్ఫూర్తి గురించి వివరించారు. ఆశ్రమంలో ఉన్న చరఖాను ట్రంప్, మెలానియా కూడా తిప్పుతూ, నూలు వడకడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో ఆశ్రమ నిర్వాహకులు రాట్నాన్ని ఎలా తిప్పుతూ నూలు వడకాలో వారికి వివరించి చెప్పారు. ట్రంప్ చరఖా తిప్పుతున్నప్పుడు మెలానియా ఆయనకు సహకరించారు.

మహాత్ముడిని ప్రస్తావించని ట్రంప్

దాదాపు 15 నిముషాల సేపు ఆశ్రమంలో గడిపి తిరిగి వెనక్కి వెళుతున్నప్పుడు సందర్శకుల పుస్తకంలో ట్రంప్ ''నా గొప్ప స్నేహితుడైన ప్రధానమంత్రి మోదీ - అద్భుతమైన ఈ పర్యటనకు ధన్యవాదాలు''అని తన సందేశాన్ని రాశారు. ట్రంప్, మెలానియాలు ఇద్దరూ సంతకాలు చేశారు. గాంధీజీ బోధనల గురించి కానీ, ఆయన ప్రపంచానికి అందించిన స్ఫూర్తి గురించి నామ మాత్రంగా కూడా ట్రంప్ ప్రస్తావించలేదు. దీనిపై ట్విటర్‌లో తీవ్ర స్థాయిలో విమర్శలు చెలరేగాయి. సబర్మతి ఆశ్రమానికి వెళ్లి కూడా గాంధీ గురించి రెండు ముక్కలు రాయకపోవడమేంటని నెటిజన్లు కామెంట్లు చేశారు. 2015లో బరాక్ ఒబామా ఢిల్లీ రాజ్‌ఘాట్‌ను సందర్శించినప్పుడు ''డాక్టర్ మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ చెప్పిన మాటలు ఇప్పటికీ వాస్తవం. గాంధీ స్ఫూర్తి భారత్‌లో అణువణువు జీర్ణించుకొని ఉంది. అది ప్రపంచానికి భారత్ ఇచ్చిన గొప్ప బహుమతి'' అని రాయడంతో పోలుస్తూ కామెంట్లు ఉంచారు. సబర్మతి ఆశ్రమంలో ట్రంప్ అసలు రూపం తెలిసిందని కాంగ్రెస్ నేత మనీష్ తివారీ పోస్టు పెడితే, త్రిపుర మాజీ ఎమ్మెల్యే తపస్ దే మోదీపై తన ప్రేమను ట్రంప్ ఒలకపోశారని విమర్శించారు.

అల్పాహారం తీసుకోని ట్రంప్ దంపతులు

సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించిన ట్రంప్ దంపతులకు గుజరాతీ రుచులతో కూడిన పూర్తిగా శాకాహారంతో హై టీ ఏర్పాటు చేశారు. కానీ వారిద్దరూ వాటిని తీసుకోలేదని ఆశ్రమ ట్రస్టీ వెల్లడించారు. ట్రంప్ కోసం ప్రత్యేకంగా హోటల్ ఫార్చూన్ ల్యాండ్‌మార్క్‌కు చెందిన చెఫ్ సురేష్ ఖన్నా ఆధ్వర్యంలో తయారు చేసిన గుజరాతీ స్పెషల్ ఖమాన్, బ్రాకొలిన్-కార్న్ బటన్ సమోసా, మల్టీ గ్రెయిన్ కుకీస్, కాజూ కత్లీ

యాపిల్ పేస్ట్రీ, తాజా పండ్లు, గుజరాతీ అల్లం టీ ఉంచారు. అయినా వాటినేమీ వాళ్లు రుచి చూడలేదు. ట్రంప్ మాంసాహార ప్రియుడు. కానీ సబర్మతి ఆశ్రమంలో మాంసం నిషిద్ధం కావడంతో శాకాహారంతో తయారు చేసిన స్నాక్స్ ఉంచారు.

మూడు కోతుల ప్రతిమతో బహూకరిస్తున్న మోదీ

గాంధీజీ మూడు కోతుల బహుమానం

చెడు వినకు , చెడు కనకు, చెడు మాట్లాడకు అన్న గాంధీజీ బోధనని చాటి చెప్పే మూడు కోతుల బొమ్మల్ని ట్రంప్, మెలానియాలకు మోదీ కానుకగా ఇచ్చారు. ఇక ఆశ్రమం తరపున ట్రస్టీ కార్తికేయ సారాభాయ్ ట్రంప్ దంపతులకు మహాత్మాగాంధీ ఆటోబయోగ్రఫీ పుస్తకం, గాంధీజీ, చరఖా పెన్సిల్ డ్రాయింగ్‌లను బహూకరించారు. అంతకు ముందు ఆశ్రమం ట్రస్టీ కార్తికేయ సారాభాయ్ ట్రంప్, మెలానియాలకు ఖద్దరు శాలువా కప్పి స్వాగతం పలికారు. ట్రంప్ సందర్శన పూర్తయిన తర్వాత కార్తికేయ విలేకరులతో మాట్లాడుతూ సబర్మతి ఆశ్రమాన్ని ట్రంప్ చాలా ఎంజాయ్ చేశారని చెప్పారు. ఆశ్రమంలోకి అడుగుపెట్టగానే ఎనలేని మనశ్శాంతి తనకు కలిగిందని, ఆ ఆశ్రమం ప్రాధాన్యత అర్థమైందని ట్రంప్ తనతో చెప్పారని కార్తికేయ వెల్లడించారు.

మొటేరా స్టేడియంలో నమస్తే ట్రంప్ కార్యక్రమ వేదికపైకి ట్రంప్ దంపతులను ఆహ్వానిస్తున్న ప్రధాని మోదీ

ట్రంప్ విందుకు మన్మోహన్, ఆజాద్ దూరం

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గౌరవార్థం రాష్ట్రపతి కోవింద్ మంగళవారం ఇచ్చే విందుకు హాజరు కారాదని మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, రాజ్యసభలో కాంగ్రెస్ నేత గులాంనబీ ఆజాద్ నిర్ణయించుకున్నారు. తమ పార్టీ అధినేత్రి సోనియా గాంధీని ఆహ్వానించనందుకు నిరసనగా ఈ విందుకు దూరంగా ఉంటానంటూ లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌధురి ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. రాష్ట్రపతి ఆహ్వానాన్ని మొదట్లో అంగీకరించిన మాజీ ప్రధాని మన్మోహన్, ఆజాద్‌లు మనసు మార్చుకున్నారని, మంగళవారం నాటి విందుకు తాము రావడం లేదంటూ రాష్ట్రపతి భవన్‌కు సోమవారం సమాచారం అందించారని సన్నిహిత వర్గాలు తెలిపాయి. తమ పార్టీ అగ్రనేతలతో అమెరికా అధ్యక్షుడి భేటీని మోదీ ప్రభుత్వం అడ్డుకుంటోందంటూ కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

వారి స్నేహం నుంచి ఎంతో నేర్చుకోవచ్చు

ఐరాసలో అమెరికా మాజీ రాయబారి నిక్కీ హేలీ

వాషింగ్టన్: భారత ప్రధాని నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ల స్నేహం నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉందని ఐక్యరాజ్యసమితిలో అమెరికా మాజీ రాయబారి, భారత సంతతికి చెందిన నిక్కీ హేలీ పేర్కొన్నారు. సోమవారం ట్రంప్ తొలిసారి భారత్‌లో పర్యటిస్తున్న నేపథ్యంలో ఆమె మాట్లాడుతూ.. ట్రంప్ దంపతులు భారత్‌లో పర్యటించడం తనకు చాలా గర్వకారణంగా ఉందని చెప్పారు. 'ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలైన భారత్, అమెరికాలకు చాలా విలువల విషయంలో సారూప్యత ఉందని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. మోదీ–ట్రంప్ సమావేశం చాలా ప్రత్యేకమైందని వైట్ హౌజ్ మాజీ అధికారి పీటర్ లావోయ్ వివరించారు. రక్షణ సంబంధాలు మెరుగుపడతాయని, కశ్మీర్, అఫ్గానిస్తాన్ సమస్యలు పరిష్కారం అవుతాయని, వాణిజ్య సంబంధాలు మెరుగుపడతాయని, రక్షణ ఒప్పందాలు జరుగుతాయని వెల్లడించారు. 'ట్రంప్ పర్యటన.. భారత్, అమెరికా సంబంధాల్లో చారిత్రాత్మకంగా మిగిలిపోతుందని గ్లోబల్ రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్స్ సల హాదారు అల్ మాసన్ వివరించారు.

ట్రంప్‌పై అమెరికా మీడియా విమర్శలు

న్యూఢిల్లీ: భారత్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పర్యటనకు సంబంధించి అక్కడి మీడియా తీవ్ర విమర్శలు చేసింది. ట్రంప్‌కి ఈ పర్యటన చాలాక్లిష్టమైందిగా పేర్కొంది. 'న్యూయార్క్ టైమ్స్' తన ఆన్‌లైన్ ఎడిషన్‌లో 'టెక్సాస్ తర్వాత, మోదీ భారత్‌లో ఇంకా పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు' శీర్షికతో కథనాన్ని ఇచ్చింది. ట్రంప్ అహ్మదాబాద్‌లో చేసిన ప్రసంగంపై మాత్రం విమర్శలు గుప్పించింది. మోదీని విమర్శించే వారు 'మిస్టర్ మోదీ' అని చేసే వ్యాఖ్యలను, ముస్లిం వ్యతిరేక విధానాలను ఆయన ప్రస్తావించలేదని పేర్కొంది. ఆగ్రాలోని తాజ్‌మహల్ చూసేందుకు వచ్చిన ట్రంప్ దంపతులను యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆహ్వానించడంపై.. 'కరుడుగట్టిన హిందూ సన్యాసిని ట్రంప్ భారత్‌లో కలుసుకున్నారు'అని 'వాషింగ్టన్ పోస్ట్' అభివర్ణించింది. 'సీఎన్ఎన్' సైతం జాత్యహంకార ధోరణిని ప్రదరిస్తూ కథనాన్ని వండి వార్చింది. 'మాంసాహారాన్ని తీసుకునే అధ్యక్షుడు ట్రంప్ భారత్ సందర్శనలో షాక్ గురవుతారు. ఎందుకంటే అక్కడ హిందువులు గోవులను గౌరవిస్తారు. పూజిస్తారు. అదే ట్రంప్ ఇతర దేశాల(సౌదీఅరేబియా, సింగపూర్)కు వెళ్లినప్పుడు అక్కడి వారు ఇష్టమైన వాటిని వడ్డించి ఆయన సౌంతిల్లులా ఫీలయ్యేలా చేస్తారు. అలాంటి బీఫ్ లవర్ (ట్రంప్) భారత్‌లో ఏం చేస్తారో..'అని రాసుకొచ్చింది. అయితే 'సీఎన్ఎన్' పక్షపాత వైఖరిని సోషల్ మీడియాలో చాలామంది ఎండగట్టారు.

ట్రంప్ రాకతో కశ్మీర్‌లో భద్రత కట్టుదిట్టం

శ్రీనగర్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటన నేపథ్యంలో కశ్మీర్ వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేనట్టారు. 'గతంలో కశ్మీర్‌లో చోటుచేసుకున్న కొన్ని సంఘటనల దృష్ట్యా.. దేశంలో పలువురు విదేశీ అగ్రనేతలు పర్యటిస్తున్న సమయంలో కశ్మీర్ లోయలో భద్రతను బలోపేతం చేశాం' అని సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. మార్చి 2000 సంవత్సరంలో అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ భారత్ పర్యటనకు వచ్చిన సమయంలో చటిసింగ్‌పుర గ్రామంలో లష్కరే తోయిబా మిలిటెంట్లు 35 మంది సిక్కులను పొట్టనపెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో కశ్మీర్ లోయలో మిలిటెంట్లు ఎలాంటి దాడులు చేయకుండా అదనపు పోలీసు సిబ్బందితో పాటు పారామిలటరీ దళాలను మోహరించినట్లు అధికారి వెల్లడించారు. ప్రమాద తీవ్రత ఉండే కొన్ని ప్రాంతాల్లో పర్యవేక్షణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే మిలిటెంట్లకు ఎలాంటి రవాణా సదుపాయాలు లేకుండా ఉండేందుకు పలు ప్రాంతాల్లో మొబైల్ వెహికల్ చెక్ పాయింట్లను ఏర్పాటు చేశామన్నారు.

• వావ్ తాజ్

చేతిలో చెయ్యేసి

ఈ విశాల ప్రశాంత ఏకాంత సౌధంలో చల్లని సాయంత్రం సమయంలో చిరుగాలులు మోముని తాకుతూ ఉంటే తన నెచ్చెలి మెలానియా చేతిలో చెయ్యేసి వెండికొండలా మెరిసిపోయే ప్రపంచ అద్భుతాన్ని తనివితీరా చూసి తన్మయత్వం చెందారు అగ్రరాజ్యాధీశుడు

తాజ్‌మహల్ అందాలను ఆస్వాదించిన ట్రంప్ దంపతులు

ప్రేమసౌధం వద్ద అమెరికా ప్రథమ పౌరుడు ట్రంప్, ఆయన భార్య మెలానియా

ఆగ్రా

మొఘల్ చక్రవర్తి షాజహాన్ తన భార్య ముంతాజ్ పైనున్న అవ్యాజ్యమైన ప్రేమతో యమునా నది ఒడ్డున 16వ శతాబ్దంలో కట్టించిన ఈ పాలరాతి సౌధం ప్రపంచ వింతల్లో ఒకటిగా నిలిచి ప్రఖ్యాతివహించింది. తాజ్‌మహల్‌ని సందర్శించడమంటే అదో అద్భుతమైన ప్రేమ భావన. అమెరికా ఇతర అధ్యక్షుల్లా మాదిరి కాదు.. ట్రంప్, మెలానియా ఎక్కడికి వెళ్లినా చేతులు పట్టుకొని కనిపించరు. కానీ ఈ తాజ్ ఏ మాయ చేసిందో ఏమో మెలానా చేతిలో చెయ్యి వేసుకుంటూ తాజ్ ఉద్యానవనంలో కలియతిరుగుతూ అలౌకికమైన ఆనందానికి లోనయ్యారు ట్రంప్. ఆ తన్మయత్వంలోనే సందర్శకుల పుస్తకంలో ''తాజమహల్ వావ్ అనిపించింది. సుసంపన్నమైన, విలక్షణ విభిన్నమైన భారతీయ సంస్కృతికి ఈ కట్టడం కాలాతీతంగా నిలిచిన పవిత్ర శాసనం. థాంక్యూ ఇండియా''అని రాశారు. ట్రంప్ దంపతులు తాజ్‌మహల్‌లో గంటకు పైగా కలియతిరుగుతూ అణువణువు సౌందర్యంతో నిండిపోయిన ఆ కట్టడం అందాలను ఆస్వాదించారు. ప్రపంచ వారసత్వ కట్టడమైన తాజ్‌మహల్ గొప్పతనాన్ని ఒక గైడ్ వారికి వివరించి చెప్పారు. ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్, ఆమె భర్త జేర్డ్ కుష్నర్ కూడా వారి వెంట ఉన్నారు. అయితే ఇతర ప్రతినిధుల బృందంతో పాటు వారు దూరం నుంచి తాజ్‌మహల్ అందాలను వీక్షించారు. తాజ్ అందాలను ఇవాంకా తన మొబైల్ ఫోన్లో బంధిస్తూ కనిపించారు.

ఆగ్రా వీధుల్లో ఘన స్వాగతం

అహ్మదాబాద్ నుంచి ఆగ్రా చేరుకున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఆగ్రా ప్రజలు రోడ్డుకు ఇరువైపులా నిల్చొని ఘనంగా స్వాగతం పలికారు. ముఖ్యంగా ట్రంప్ కారు బీస్ట్ క్షణ కాలమైనా కనిపిస్తుందని ఆత్రుతగా ఎదురుచూశారు. అహ్మదాబాద్ నుంచి ఆగ్రాలో ఖేరియా ఎయిర్‌బేస్‌కి చేరుకున్న ఆయనకి ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందిబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వాగతం పలికారు. తాజ్‌మహల్‌కి సమీపంలోని ఓబరాయ్ అమర్‌విలాస్ హోటల్‌కి తన కాన్వాయ్‌లోనే చేరుకున్నారు. మొత్తం 13కి.మీ. దూరం ఉన్న ఈ ప్రయాణంలో 15 వేలకు మందికి పైగా విద్యార్థులు, సాధారణ ప్రజలు రోడ్డుకిరువైపులా అమెరికా, భారత్ జెండాలు పట్టుకొని ఉత్సాహంతో చేతులు ఊపారు. ఆ హోటల్ నుంచి తాజ్‌మహల్‌కి తన కుటుంబ సభ్యులతో కలిసి ట్రంప్ ఎకో ఫ్రెండ్లీ వాహనాల్లో వెళ్లారు. కాలుష్యం కోరల్లో చిక్కుకున్న తాజ్‌మహల్ గేటు నుంచి 500 మీ పరిధి వరకు పెట్రోల్, డీజిల్‌తో నడిచే వాహనాలను సుప్రీం కోర్టు నిషేధించింది. అందుకే అధ్యక్షుడు ట్రంప్ తన బీస్ట్ కారుని హోటల్ ఆవరణలో ఉంచి ఎకో ఫ్రెండ్లీ వాహనాల్లోనే వెళ్లారు. తాజ్ కట్టడం దగ్గర మెలానియాతో కలిసి ఫోటోలకు పోజులిచ్చారు ట్రంప్. అమెరికా అధ్యక్షుడు వస్తూ ఉండడంతో తాజ్‌ని అద్దంలా ఉంచడానికి మరింత మెరుగులు దిద్దారు. వందలాది మంది పనివాళ్లు ముల్తానీ మిట్టీతో తాజ్‌ని శుభ్రం చేశారు. తాజ్‌మహల్‌ని సందర్శించిన అధ్యక్షుల్లో చివరి వాడు బిల్ క్లింటన్. 2000 సంవత్సరంలో తన కుమార్తె చెల్సీతో కలిసి ఆయన తాజ్‌ని సందర్శించారు. 2015లో బరాక్ ఒబామా తాజ్‌ని చూద్దామని భావించారు కానీ, భద్రతా కారణాల రీత్యా సందర్శించలేదు.

ట్రంప్ దంపతులకు సీఎం యోగి బహుమతి

తాజ్ వద్ద ఇవాంకా, కుష్నర్ దంపతులు

ఇవాంకా మళ్లీ అదే డ్రెస్

సాధారణంగా సెలిబ్రిటీలు ఒకసారి వేసుకున్న డ్రెస్‌తో మళ్లీ బయట ప్రపంచానికి కనిపించరు. పూటకో ఫ్యాషన్‌తో డ్రెస్సులు మారుస్తూ ఉంటారు. కానీ ఇవాంకా గత ఏడాది ఫ్యాషన్‌నే మళ్లీ కొనసాగించారు. 2019 సెప్టెంబర్ అర్జెంటీనా పర్యటనలో ఏ మిడీ అయితే వేసుకున్నారో అదే మళ్లీ భారత పర్యటనలోనూ ధరించారు. బేబీ బ్లూ రంగు పైన ఎరుపు రంగు పెద్ద పెద్ద పువ్వులున్న వీ నెక్ డ్రెస్ వేసుకున్నారు. ఇలా మళ్లీ అదే డ్రెస్ వేసుకోవడానికీ ఒక కారణం ఉంది. ఒక చిన్న వస్త్రం తయారు చెయ్యాలంటే దాని వెనుక ఎన్నో సహజవనరుల్ని ఖర్చు చేయాల్సి ఉంటుంది. సహజవనరుల్ని కాపాడాలంటే సెలిబ్రిటీలు కూడా వేసుకున్న డ్రెస్‌లే మళ్లీ ధరించాలన్న సందేశాన్ని పంపడానికే ఇవాంకా అదే డ్రెస్ ధరించారు. ఈ విధంగా ప్రకృతి పట్ల ఆమె చూపిస్తున్న ప్రేమ అందరినీ ఆకట్టుకుంటోంది.

సాధారణ టూరిస్టులకు నో

ట్రంప్ రాక సందర్భంగా సోమవారం ఆగ్రాలోని ప్రఖ్యాత పర్యాటక స్థలం తాజ్‌మహల్‌లో సాధారణ టూరిస్టుల సందర్శనను నిలిపివేశారు. సోమవారం సాయంత్రం 5.15 గంటలకు ట్రంప్ తాజ్‌మహల్ రాగా.. ఉదయం 11.30 గంటలకే తాజ్‌ను సాధారణ సందర్శకులకు దూరం చేశారు. ట్రంప్ భద్రత ఏర్పాట్ల దృష్ట్యా ఈ చర్య తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ట్రంప్ రాకను పురస్కరించుకుని తాజ్‌మహల్‌ను అందంగా అలంకరించామని, ఉద్యానవనంలో మరిన్ని పూలమొక్కలు నాటడంతోపాటు ఫౌంటేన్లు మరమ్మతు చేయించామన్నారు.

మోదీ, ట్రంప్ హిందీ ట్వీట్లు!

''**హ**మ్ భారత్ ఆనే కే లియే తత్పార్ హై. హమ్ రస్తే మే హై. కుచ్ హీ ఘంటోఃమే హమ్ సబ్సే మిలేంగే''భారత్ విచ్చేస్తున్న సందర్భంగా అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్ సోమవారం ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం నుంచే చేసిన హిందీ ట్వీట్ ఇది. భారత పర్యటన కోసం ఎదురు చూస్తున్నామని, దారి మధ్యలో ఉన్నామని, కొన్ని గంటల్లోనే అందరినీ కలుస్తామని ట్రంప్ ఓ ట్వీట్ చేయగా... మోదీ దానికి హిందీలోనే సమాధానమిస్తూ... ''అతిథి దేవో భవ''అని ట్వీట్ చేశారు. హిందీలోనే జరిగిన ఈ సంభాషణ నెట్‌లోనే పేద్ద హిట్ అయింది. భారత్ విచ్చేస్తున్న ఏడో అమెరికా అధ్యక్షుడు ట్రంప్. అయితే మునుపు ఇక్కడకు వచ్చిన వారెవరూ హిందీ భాషను వాడలేదని.. అంతర్జాతీయంగా భారత్ పలుకుబడి పెరుగుతోందనేందుకు ఇది నిదర్శనమని ట్విట్టర్ వేదికపై ఓ వ్యక్తి వ్యాఖ్యానించారు. ''మోదీ, ట్రంప్‌ల మధ్య స్నేహసంబంధాలు ఇరుదేశాలను మరింత దగ్గర చేస్తాయి. వెల్‌కమ్ సర్ ట్రంప్. ఫస్ట్ లేడీ మెలానియా ట్రంప్''అని మరొకరు వ్యాఖ్యానించారు.

తెల్లని దుస్తుల్లో రాజహంసలా..

అహ్మదాబాద్: అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్.. ఒకప్పటి మోడల్, ఫ్యాషన్ డిజైనర్ కూడా. భారత్ పర్యటన సందర్భంగా ఆమె సంప్రదాయ దుస్తుల్లో వస్తారా లేదానని యావత్ భారతావని ఎంతో ఉత్కంఠగా ఎదురుచూసింది. అమెరికా నుంచి అహ్మదాబాద్‌కి వచ్చిన ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం నుంచి మెలానియా తనకు ఎంతో ఇష్టమైన తెలుపు రంగు దుస్తుల్లో ఒక రాజహంసలా కిందకి దిగారు. తెల్లని జంప్ సూట్ ధరించి నడుం చుట్టూ ఆకుపచ్చని రంగు సాష్ (ఫ్యాషన్ కోసం ధరించేది) అందంగా చుట్టుకున్నారు. భారత సంస్కృతి సంప్రదాయాలను గౌరవించేలా, మన దేశీ టచ్‌తో రూపొందించిన డ్రెస్ ధరించడం అందరినీ ముగ్ధుల్ని చేసింది. జుట్టును లూజ్‌గా వదిలేసి అతి కొద్దిగా మేకప్ వేసుకొని తన సహజ సౌందర్యంతోనే ఆమె మెరిసిపోయారు. స్వయంగా ఫ్యాషన్ డిజైనర్ కావడంతో మెలానియా సాధారణంగా తన దుస్తుల్ని తానే డిజైన్ చేసుకుంటారు. కానీ భారత్ పర్యటన కోసం ప్రముఖ ఫ్రెంచ్ అమెరికన్ డిజైనర్ హెర్వ్ పెయిరె డిజైన్ చేసిన సూట్‌ని ధరించారు. పాల నురుగులాంటి తెల్లటి జంప్ సూట్ వేసుకొని, ఆకుపచ్చ రంగు పట్టు మీద బంగారం జరీ ఎంబ్రాయిడీతో చేసిన దుప్పట్టాను చుట్టుకున్నారు.భారత్ వస్త్ర పరిశ్రమకు చెందిన 20 శతాబ్దం నాటి తొలి రోజుల్లో డిజైన్‌లను ఆకుపచ్చ రంగు దుప్పట్టాపై చిత్రీకరించినట్టుగా హెర్వ్ పెయిర్ తన ఇన్‌స్టాగామ్ అకౌంట్‌లో వెల్లడించారు. తన మిత్రులు పంపించిన కొన్ని డాక్యుమెంట్లని చూసి అత్యంత శ్రద్ధతో ఆకుపచ్చ రంగు సాష్‌ను తయారు చేసినట్టు తెలిపారు. మెలానియా ధరించిన డ్రెస్‌పై ట్విటర్‌లో ప్రశంసలే వచ్చాయి. కొందరు హాస్యభరిత లోక్తుల్ని కూడా విసిరారు. అందానికే అందంలా ఉండే మెలానియా కొంటె కుర్రాళ్ల బారి నుంచి తనని తాను కాపాడుకోవడానికి కరాటే డ్రెస్ తరహాలో దుస్తులు ధరించారని కామెంట్లు చేశారు. ఇక డొనాల్డ్ ట్రంప్ డార్క్ కలర్ సూట్ , పసుపు రంగు టై ధరించారు. మన భారతీయ వాతావరణానికి తగ్గట్టుగా వారి దుస్తుల్ని డిజైన్ చేశారు.

భారత్ పర్యటనలో మెరిసిపోయిన మెలానియా

ఎయిర్‌పోర్ట్ టు స్టేడియం వయా సబర్మతి

అహ్మదాబాద్‌లో ట్రంప్‌కు స్వాగతం పలుకుతున్న కళాకారులు

అహ్మదాబాద్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తొలి భారత పర్యటన ఘనంగా ప్రారంభమైంది. ట్రంప్, ఆయన భార్య మెలానియా, కూతురు ఇవాంకా, అల్లుడు కుష్నర్ వచ్చిన 'ఎయిర్‌ఫోర్స్ 1' విమానం ఉదయం 11.37 నిమిషాలకు అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగింది. బ్లాక్ సూట్‌లో ట్రంప్, వైట్ జంప్‌సూట్‌లో మెలానియా భారత గడ్డపై అడుగు పెట్టారు. ట్రంప్ రాకకు దాదాపు గంట ముందే మోదీ అహ్మదాబాద్ చేరుకున్నారు. విమానాశ్రయంలో ట్రంప్‌కు సాదర స్వాగతం పలుకుతూ ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. మెలానియాకు ప్రేమగా షేక్ హ్యాండ్ ఇచ్చారు. అక్కడి నుంచి వారు నేరుగా సబర్మతి ఆశ్రమానికి వెళ్లారు. దాదాపు పావుగంట పాటు గడిపిన అనంతరం, మొటేరా స్టేడియానికి బయల్దేరారు.

రోడ్ షో

అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచే ట్రంప్ రోడ్ షో ప్రారంభమైంది. అమెరికా అధ్యక్షుడికి స్వాగతం పలుకుతూ రహదారులకు ఇరువైపులా ప్రజలు బారులు తీరారు. దారి పొడవునా దాదాపు 22 కిమీ మేర వివిధ రాష్ట్రాల సాంస్కృతిక ప్రత్యేకతలను వివరించేలా దాదాపు 50 వేదికలను ఏర్పాటు చేశారు. ఆ వేదికలపై ఆయా రాష్ట్రాల కళాకారులు తమ సాంస్కృతిక కళారూపాలను ప్రదర్శించారు. బ్లాక్ లిమోజిన్ 'ది బీస్ట్'లో ప్రయాణిస్తూ ఈ రోడ్ షోలో ట్రంప్ పాల్గొన్నారు.

భద్రత

10 వేలకు పైగా పోలీసులు, ఎన్ఎస్‌జీ, ఎస్పీజీ దళాలు, అమెరికా సీక్రెట్ సర్వీస్ అధికారులు రోడ్ షో, ఆ తరువాత మొతెరా స్టేడియంలో జరిగిన 'నమస్తే ట్రంప్' కార్యక్రమాలకు భద్రత కల్పించారు.

'మౌర్య'లో సంప్రదాయ స్వాగతం

ట్రంప్ దంపతులకు హోటల్ మౌర్య షెరాటన్‌లో సంప్రదాయ సిద్ధంగా స్వాగతం పలికారు. హోటల్‌లో అడుగుపెట్టగానే వారికి తిలకం దిద్ది, పూలగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. భద్రతాకారణాల రీత్యా వారు వెనకద్వారం గుండా లోనికి వెళ్లారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో వారు భోజనం చేశారని హోటల్ వర్గాలు తెలిపాయి. మౌర్యషెరాటన్‌లోని గ్రాండ్ ప్రెసిడెన్షియల్ సూట్‌లో ట్రంప్ బస చేశారు.

నేడు చర్చలు

ఢిల్లీలో మంగళవారం ఉదయం నుంచి ట్రంప్ బిజీబిజీగా గడపనున్నారు. ఉదయం రాష్ట్రపతి భవన్‌లో ఆయనకు అధికారిక స్వాగతం లభిస్తుంది. అక్కడి నుంచి ట్రంప్ దంపతులు రాజ్‌ఘాట్‌కు వెళ్లి మహాత్ముడి సమాధి వద్ద నివాళులర్పిస్తారు. ఆ తరువాత, ప్రధాని మోదీ, ట్రంప్‌ల నేతృత్వంలో హైదరాబాద్ హౌజ్‌లో భారత్, అమెరికాల మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు జరుగుతాయి. ఈ చర్చల్లో ఇరుదేశాల మధ్య 300 కోట్ల డాలర్ల విలువైన డిఫెన్స్ డీల్‌తో పాటు ఐదు ఒప్పందాలు కుదిరే అవకాశముంది. మోదీ, ట్రంప్ చర్చల్లో పలు ద్వైపాక్షిక, అంతర్జాతీయ అంశాలు ప్రస్తావనకు రానున్నాయి. రక్షణ ఒప్పందంలో.. నౌకాదళం కోసం 24 ఎంహెచ్ 60ఆర్ రోమియో హెలీకాప్టర్లను, 6 ఏహెచ్64ఈ అపాచీ హెలీకాప్టర్లను భారత్ కొనుగోలు చేయనుంది. అనంతరం ట్రంప్ దంపతులు రాష్ట్రపతి కోవిందుని కలుస్తారు. కోవింద్ ఇచ్చే విందులో పాల్గొంటారు. ఆ తరువాత అమెరికాకు బయల్దేరి వెళ్తారు.

భారత్‌కి వచ్చాక కూడా డెమొక్రాట్లపై విమర్శలు

బెర్నీ సాండర్స్ గెలుస్తారంటూ ట్రంప్ ఎద్దేవా

వాషింగ్టన్/ఆగ్రా: అమెరికా నుంచి భారత్‌కు వచ్చిన తర్వాత కూడా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీపై విమర్శలు సంధించారు. నవంబర్‌లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో తనకు ప్రత్యర్థిగా డెమొక్రాటిక్ తరపున సెనేటర్ బెర్నీ శాండర్స్ నిలిచే అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. అయితే ఆ పార్టీ శాండర్స్‌ను అధ్యక్ష అభ్యర్థిగా గెలవనివ్వకుండా అడ్డుకుంటుందని ట్రంప్ అనుమానం వ్యక్తం చేశారు. సోమవారం భారత్‌కు వచ్చిన ఆయన ఎయిర్‌ఫోర్స్ వన్‌లో అహ్మదాబాద్ నుంచి ఆగ్రా వస్తూ ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. ''డెమొక్రాటిక్ పార్టీలో గట్టి పోటీదారు బెర్నీ మాత్రమే. ఆ పార్టీలో పోటీ పడుతున్న అధ్యక్ష అభ్యర్థుల్లో ఆయన అత్యంత గట్టివాడు. ఆయన నన్ను చాలా ఇష్టపడతాడు. అయితే నాకు కూడా గట్టి పునాదులే ఉన్నాయి''అని ట్రంప్ అన్నారు. 78 ఏళ్ల వయసున్న శాండర్స్ అత్యంత కీలకమైన నెవాడా డెమొక్రాటిక్ కాకస్‌లో విజయం సాధించిన ఒక్క రోజు తర్వాత ట్రంప్ ఈ కామెంట్లు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆ విజయంతో శాండర్స్‌కు అధ్యక్ష అభ్యర్థిగా నిలవడానికి అవకాశాలు బలపడ్డాయి. అంతకు ముందు రిపబ్లికన్ పార్టీలో తనకు 95 శాతం మంది మద్దతు ఉందని ట్రంప్ ట్వీట్ చేశారు.

చిత్రమాలిక


అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు వద్ద తండ్రి ట్రంప్‌ను ముద్దాడుతున్న ఇవాంకా

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కాన్వాయ్‌కు చేతులు ఊపుతూ స్వాగతం చెబుతున్న అహ్మదాబాద్ వాసులు

ట్రంప్ రాక సందర్భంగా చెన్నైకు చెందిన ఇనియాన్ అనే చెఫ్ తయారు చేసిన ట్రంప్, మోదీలను పోలిన ఇడ్లీలు

సబర్మతీ ఆశ్రమం సందర్శించిన సందర్భంగా సందర్శకుల పుస్తకంలో ట్రంప్ స్వదస్తూరి

సాక్షి బిజినెస్
మంగళవారం
25-2-2020
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
807 ▼	251 ▼
40,363	11,829

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	9,215	▼ 362
డోజోన్స్	28,016	▼ 976
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,157	▼ 247
డాక్స్	13,035	▼ 544
షాంఘై	3,031	▼ 8
నికాయ్ (శుక్రవారం ముగింపు)	23,387	▼ 92

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఫామ్‌కుకి	71.15	72.80
£	బ్రిటన్ పౌండ్	ఫామ్‌కుకి	91.53	94.75
€	యూరో	ఫామ్‌కుకి	76.45	79.35
¥	జపాన్ ఎన్ (100)	ఫామ్‌కుకి	63.35	65.70
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఫామ్‌కుకి	46.53	48.70
S$	సింగపూర్ డాలర్	ఫామ్‌కుకి	50.50	52.24
SAR	సౌదీ రియాల్	ఫామ్‌కుకి	18.39	20.00
UAE D	యూఏఈ దిర్హామ్	ఫామ్‌కుకి	19.12	20.33
¥	చైనా యువాన్	ఫామ్‌కుకి	9.60	10.86

మెరిసిన బంగారం

- అంతర్జాతీయంగా 1,700 డాలర్లకు చేరిక
- దేశీయంగానూ పరుగే
- రూ.1000 వరకూ లాభం

ముంబై: పలు దేశాలను భయాందోళనలకు గురిచేస్తున్న కోవిడ్-19 (కరోనా) వైరస్... బంగారం మెరుపులకు కారణమవుతోంది. వ్యాధి రోజురోజుకూ విజృంభిస్తుండడం, ప్రపంచాభివృద్ధిపై అనిశ్చితి వంటి అంశాల నేపథ్యంలో ప్రస్తుతం తమ పెట్టుబడులకు యెల్లో మెటలే సురక్షిత సాధనమని అంతర్జాతీయంగా పెట్టుబడిదారులు భావిస్తున్నారు. ఈక్విటీలు, క్రూడ్‌సహా పలు విభాగాల నుంచి వేగంగా పెట్టుబడులు పసిడివైపు మరలుతున్నాయి. అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్- న్యూయార్క్ మర్కంటైల్ ఎక్స్ఛేంజ్‌లో పసిడి ఔన్స్ (31.1గ్రా) ధర సోమవారం ఏకంగా దాదాపు 42 డాలర్లు ఎగసింది. ట్రేడింగ్ ఒక దశలో 1,700 డాలర్లకు 10 డాలర్ల దూరంలో 1,691.56ను తాకింది. ఈ వార్తరాసే రాత్రి 9 గంటల సమయంలో 31.35 డాలర్ల లాభంతో 1,680.15 వద్ద ట్రేడవుతోంది. ఈ ధర దాదాపు 8 సంవత్సరాల గరిష్టస్థాయి.

దేశీయంగా రూపాయి బలహీనత తోడు...

ఇక భారత్‌లో చూస్తే, అంతర్జాతీయ ధోరణితో పాటు, దేశీయంగా రూపాయి బలహీనత పసిడి పరుగుకు కారణమవుతోంది. దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్-మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో పసిడి 10 గ్రాములు స్వచ్ఛత ధర ఈ వార్త రాసే 9 గంటల సమయంలో రూ.953 లాభంతో రూ.43,619 వద్ద ట్రేడవుతోంది. ట్రేడింగ్ ఒక దశలో రూ.43,788నూ తాకింది. ఢిల్లీ సహా పలు పట్టణాల్లోని స్పాట్ మార్కెట్లలో 10 గ్రాముల స్వచ్ఛత ధర రూ.1,000 వరకూ పెరిగింది. న్యూఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో 10 గ్రాములు స్వచ్ఛత పసిడి ధర రూ.953 పెరిగి రూ.44,472కు చేరింది. పలు పట్టణాల స్పాట్ మార్కెట్లలోనూ ధర దాదాపు రూ.1,000 వరకూ పెరిగి రూ.44,000 పైనే ధర పలికింది.

- 28కు పైగా దేశాలకు కోవిడ్-19
- ప్రపంచ మార్కెట్ల భారీ పతనం
- కీలక మద్దతు స్థాయిలు కోల్పోయిన సూచీలు
- 807 పాయింట్లు పతనమై 40,363 వద్ద ముగిసిన సెన్సెక్స్...
- 251 పాయింట్ల నష్టంతో 11,829 వద్ద ముగింపు

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	2,061
ఎన్ఎస్ఈ	39,108
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	12,76,172
ఎఫ్ఐఐ	- 1,161
డీఐఐ	516

కోవిడ్ కల్లోలం

చైనాను గడగడలాడిస్తున్న కోవిడ్-19(కరోనా) వైరస్ 28కు పైగా దేశాలకు పాకడంతో ప్రపంచ మార్కెట్లు పతనమయ్యాయి. ఈ ప్రభావంతో మన మార్కెట్ కూడా సోమవారం భారీగా నష్టపోయింది. చైనా, ఇతర దేశాల్లో కోవిడ్-19 వైరస్ కారణంగా తయారీ కార్యకలాపాలు మందగించి సరఫరా సమస్యలు తలెత్తగలవన్న ఆందోళనతో అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ పతనం కావడం కూడా ప్రభావం చూపించింది. సెన్సెక్స్, నిఫ్టీలు కీలకమైన మద్దతు స్థాయిలను కోల్పోయాయి. సెన్సెక్స్ 40,500 పాయింట్లు, నిఫ్టీ 11,900 పాయింట్ల దిగువకు పడిపోయాయి. సెన్సెక్స్ 807 పాయింట్లు నష్టపోయి 40,363 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 251 పాయింట్లు నష్టపోయి 11,829 పాయింట్ల వద్ద ముగిశాయి. సెన్సెక్స్, నిఫ్టీలు చెరో 2 శాతం మేర క్షీణించాయి. స్టాక్ మార్కెట్‌కు ఇది ఈ ఏడాది రెండో అతి పెద్ద పతనం. కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఫిబ్రవరి 1న సెన్సెక్స్ 987 పాయింట్లు పతనమైంది.

ఈ కల్లోలం మరికొంత కాలం....!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటన నేపథ్యంలో వాణిజ్య ఒప్పందం కుదిరే విషయమై అనిశ్చితి నెలకొనడం కూడా ప్రతికూల ప్రభావం చూపించింది. ముడి చమురు ధరలు 4 శాతం మేర పతనమైనా, మన మార్కెట్లో నష్టాలు ఆగలేదు. కోవిడ్-19 వైరస్ కల్లోలం మరికొంత కాలం కొనసాగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్ల పతనం కారణంగా పెట్టుబడులు సురక్షిత సాధనాలైన డాలర్, పుత్తడిలోకి మరలిపోతున్నాయి. ఫలితంగా బంగారం ధరలు భగ్గుమన్నాయి. పుత్తడి ధర ఏడేళ్ల గరిష్ట స్థాయికి చేరింది. ఔన్స్ బంగారం 1,700 డాలర్లకు చేరువయ్యింది. దేశీయంగా 10 గ్రాముల బంగారం రూ.44,000 దాటేసింది.

లోహ షేర్లు విలవిల..

ప్రపంచంలో లోహాలను అత్యధికంగా వినియోగించేది చైనా. ఇప్పుడు ఈ దేశంలో కోవిడ్-19 వైరస్ కారణంగా ఉత్పత్తి కార్యకలాపాలు కుంటుపడుతున్నాయి. ఇది మరికొంత కాలం కొనసాగితే, లోహాల వినియోగం తగ్గగలదన్న భయాలతో ఇన్వెస్టర్లు లోహ షేర్లను తెగనమ్మారు. దీంతో లోహ షేర్లు భారీగా క్షీణించాయి. అన్ని రంగాల సూచీల్లో లోహ సూచీయే అత్యధికంగా నష్టపోయింది.

ఈ నష్టాలు ఎందుకంటే...

1. కోవిడ్-19 కల్లోలం

చైనాలో కాకుండా కొత్త ప్రాంతాలకు కోవిడ్-19 వైరస్ విస్తరిస్తోంది. దక్షిణ కొరియా, ఇటలీ, ఇరాన్‌ల్లో కోవిడ్-19(కరోనా) వైరస్ బాధితుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. విస్తరిస్తున్న కోవిడ్-19 వైరస్ ప్రభావం అంతర్జాతీయంగా వృద్ధిపై అంచనాల కంటే అధికంగానే ఉండొచ్చన్న భయాందోళనలతో ప్రపంచ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. ఆసియా మార్కెట్లు 2-3 శాతం రేంజ్‌లో, యూరప్ మార్కెట్లు 4 శాతం మేర నష్టపోయాయి. అన్ని దేశాల్లో పర్యాటక, విమాన యాన రంగ షేర్లు బాగా నష్టపోయాయి.

రూ.3 లక్షల కోట్ల సంపద ఆవిరి

స్టాక్ మార్కెట్ భారీ నష్టాల కారణంగా రూ.3 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.3.18 లక్షల కోట్లు హరించుకుపోయి రూ.155.33 లక్షల కోట్లకు పరిమితమైంది.

2. రూపాయి 34 పైసలు డౌన్...

డాలర్‌తో రూపాయి మారకం విలువ 34 పైసలకు పైగా పతనమై 71.98కు తగ్గడం కూడా ప్రతికూల ప్రభావం చూపించింది. ఇది మూడు నెలల కనిష్ట స్థాయి. ఇంట్రాడేలో 72.01ను తాకింది.

3. సరఫరాలపై ప్రభావం....

వాహన, మొబైల్ ఇతర పరిశ్రమలకు అవసరమైన విడిభాగాలను మన కంపెనీలు ఎక్కువగా చైనా నుంచే దిగుమతి చేసుకుంటున్నాయి. కోవిడ్-19 వైరస్ కారణంగా ఈ విడిభాగాల సరఫరాల్లో సమస్యలు తలెత్తుతాయని, ఇది డిమాండ్, అమ్మకాలపై తీవ్రంగానే ప్రభావం చూపగలదన్న అంచనాలతో అన్ని రంగాల కంపెనీల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి.

4. జీడీపీ అంచనాలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2019-2020) భారత్ వృద్ధి 4.9 శాతం మాత్రమే ఉంటుందని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైయిడ్ ఎకనామిక్ రీసెర్చ్(ఎన్‌సీఏఈఆర్) అంచనా వేస్తోంది. కేంద్ర గణాంకాల సంస్థ 5 శాతం అంచనాల కంటే ఇది తక్కువ. కాగా ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్ జీడీపీ అంచనాలు ఈ వారంలోనే వెలువడుతాయి.

మరిన్ని విశేషాలు...

- సెన్సెక్స్‌లోని అన్ని (30) షేర్లూ నష్టపోయాయి.
- టాటా స్టీల్ 6.3% నష్టంతో రూ.415 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా నష్టపోయిన షేర్ ఇదే.
- ఎయిర్‌పోర్ట్ బిజినెస్‌లో 49 శాతం వాటాను ఫ్రాన్స్‌కు చెందిన గ్రూప్ ఏడీపీ కంపెనీకి జీఎమ్ఆర్ ఇన్‌ఫ్రా విక్రయించనున్నది. ఈ విక్రయానికి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆమోదం తెలపడంతో జీఎమ్ఆర్ ఇన్‌ఫ్రా షేర్ 8 శాతం లాభంతో రూ.25.45 వద్ద ముగిసింది.
- 170కు పైగా షేర్లు ఏడాది కనిష్ట స్థాయిలకు పడిపోయాయి. జిల్లెట్ ఇండియా, హీరో మోటొకార్ప్, ఎల్ అండ్ టీ, హిందుస్తాన్ జింక్, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్, షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి. మార్కెట్ భారీగా నష్టపోయినా, 50కు పైగా షేర్లు ఏడాది గరిష్ట స్థాయిలకు ఎగిశాయి.

అద్భుతమైన వాణిజ్య ఒప్పందం

- అతి పెద్ద డీల్ అవుతుంది
- ఇరుదేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయి
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

అహ్మదాబాద్: ఓ అద్భుతమైన, ఇప్పటి వరకు చరిత్రలో అతి పెద్దది అయిన వాణిజ్య ఒప్పందంపై భారత్, అమెరికా చర్చలు నిర్వహిస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. భారత పర్యటనలో తొలి రోజు సోమవారం అహ్మదాబాద్‌లోని మొతెరా స్టేడియం నుంచి ఆయన ప్రసంగించారు. పెట్టుబడులకు అవరోధాలను తగ్గించే దిశగా అద్భుతమైన వాణిజ్య ఒప్పందంపై చర్చలు ఆరంభ దశలో ఉన్నాయని ప్రకటించారు. ''నా పర్యటన సమయంలో ప్రధాని మోదీ, నేను ఇరు దేశాల మధ్య ఆర్థిక సంబంధాల విస్తృతికి చర్చించనున్నాం. ప్రధాని మోదీతో కలసి ఇరు దేశాలకూ మంచి చేసే గొప్ప అద్భుతమైన ఒప్పందానికి వస్తామన్న విశ్వాసం నాకుంది'' అని ట్రంప్ వివరించారు.

అమెరికా బూమింగ్ ప్రపంచానికి ప్రయోజనం

అమెరికా అభివృద్ధి చెందితే అది భారత్‌కు, ప్రపంచానికి మంచిదన్నారు ట్రంప్. అమెరికా చరిత్రలోనే ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు ఎంతో గొప్పగా వృద్ధి చెందుతోందని చెప్పేందుకు సంతోషిస్తున్నట్టు పేర్కొన్నారు. ఉద్యోగాలను ఆకర్షించడం, వ్యాపారాల్లో సమస్యలను తగ్గించడం, నూతన పెట్టుబడులకు అవరోధాల్లేకుండా చేయడం, అనవసర బ్యూరోక్రసీ, నియంత్రణలను తొలగించినట్టు ట్రంప్ వివరించారు.

వ్యాపార వాతావరణం మరింత మెరుగవ్వాలి..

ప్రధానమంత్రి మోదీ ఇప్పటికే గణనీయమైన సంస్కరణలను చేపట్టారన్న ట్రంప్.. భారత్‌లో వ్యాపార వాతావరణం మరింత మెరుగవ్వాలని ప్రపంచం కోరుకుంటోందన్నారు. ఆయన (మోదీ) దీన్ని రికార్డు వేగంతో చేయగలరన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. సున్నితమైన వ్యవసాయం, పాడి, డేటా పరిరక్షణ, డేటా స్థానికంగా నిల్వ చేయడం, ఈ కామర్స్ తదితర రంగాలపై ఇరు దేశాల మధ్య అంగీకారం కుదరాల్సి ఉంది. ఒప్పందం ఇరు దేశాలకూ ప్రయోజనం కలిగించే విధంగా ఉంటుందని, భారత ప్రయోజనాల విషయంలో రాజీ ఉండదని ఓ అధికారి తెలిపారు. వాణిజ్య చర్చలు పురోగతి చెందితే అమెరికా మరిన్ని డిమాండ్లను ముందుకు తీసుకురావచ్చని అమెరికా అధికారి ఒకరు తెలిపారు. అమెరికాకు భారత్‌తో 17 బిలియన్ డాలర్ల మేర వాణిజ్య లోటు ఉంది. దీన్ని తగ్గించుకునేందుకు తమ దేశ పాడి, పౌల్ట్రీ, వైద్య పరికరాలకు మరిన్ని మార్కెట్ అవకాశాలు కల్పించాలన్నది అమెరికా డిమాండ్. భారత్ నుంచి వచ్చే అల్యూమినియం, స్టీల్ ఉత్పత్తులపై సుంకాలు తగ్గించాలని, వాణిజ్య పరంగా ప్రాధాన్య దేశం హోదా తిరిగి కల్పించాలని మన దేశం కోరుతోంది.

సాగు రుణాల మాఫీ అందరికీ కాదు..

లక్ష్యిత వర్గాలకు ఇస్తేనే ప్రయోజనం: ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్

ముంబై: సాగు రుణాలను అందరికీ మాఫీ చేయడం అన్నది పరపతి పరంగా ప్రతికూలమైన చర్యగా ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ పేర్కొన్నారు. అలా కాకుండా, లక్ష్యిత వర్గాల వారికే ఆ ప్రయోజనం అందించడం వల్ల ఫలితం ఉంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అందరినీ ఒకే సాధారణ గాట కట్టి రుణ మాఫీ చేయడం కాకుండా, చెల్లింపులు చేయలేని, బాధిత రైతు వర్గాలకే అందించడం మంచిదన్న అభిప్రాయం ఆయన మాటల్లో వ్యక్తమైంది. ముంబైలో జరిగిన మింట్ వార్షిక సదస్సులో మాట్లాడారు.

గెయిల్ రూ.1.05 లక్షల కోట్ల పెట్టుబడులు: సీఎండీ

న్యూఢిల్లీ: గెయిల్ ఇండియా కంపెనీ విస్తరణ కార్యకలాపాల నిమిత్తం ఐదేళ్లలో రూ.1.05 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టనున్నది. గ్యాస్ పైప్‌లైన్ల విస్తరణ, నగరాల్లో గ్యాస్ పంపిణీ నెట్‌వర్క్ ఏర్పాటు, పెట్రో రసాయనాల ఉత్పత్తి సామర్థ్యం పెంపు... వీటి కోసం ఈ పెట్టుబడులు పెట్టనున్నామని గెయిల్‌కు సీఎండీగా నియమితులైన మనోజ్ జైన్ పేర్కొన్నారు. గ్యాస్ పైప్‌లైన్ల విస్తరణ కోసం రూ.45,000-50,000 కోట్లు పెట్టుబడులు పెడతామని తెలిపారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్(సీజీడీ) వ్యాపారం కోసం రూ.50,000 కోట్లు ఇన్వెస్ట్ చేస్తామని చెప్పారు. అలాగే పెట్రో రసాయనాల ఉత్పత్తి సామర్థ్యం పెంపు కోసం రూ.10,000 కోట్ల మేర పెట్టుబడులు పెడతామని వివరించారు. భారత ఇంధన వినియోగం ప్రస్తుతం నేచురల్ గ్యాస్ వాటా 6.2%గా ఉందన్నారు. 2030 కల్లా దీనిని 15 శాతానికి పెంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. ఈ లక్ష్యానికనుగుణంగానే పెట్టుబడులు పెడుతున్నామని పేర్కొన్నారు.

సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...

- కోవిడ్ 19 ప్రభావంతో నిఫ్టీ కంపెనీల లాభాలు 3-4 శాతం తగ్గొచ్చు
- స్టాప్‌లాస్‌తో స్వల్పకాలానికి రికమండేషన్లు
- 52 వారాల కనిష్టస్థాయికి పడిపోయిన షేర్లివే
- ఈ మూడు స్టాక్స్ టెక్నికల్ బ్రేకవుట్స్!

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్- మార్కెట్ అప్‌డేట్స్, విశ్లేషణలు, అప్‌డేట్స్ కోసం... SAKSHIBUSINESS వెబ్‌సైట్ కోసం.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

WWW.BUSINESS.SAKSHI.COM

టాప్ 3 ఎకానమీల్లోకి భారత్

- దశాబ్దకాలంలో సాధ్యమే
- డిజిటల్ సొసైటీగా ఎదుగుతాం
- టెక్నాలజీ ఇందుకు ఊతంగా నిలుస్తుంది
- రిలయన్స్ ఇండస్ట్రీస్ చీఫ్ ముకేశ్ అంబానీ వెల్లడి

న్యూఢిల్లీ: వచ్చే దశాబ్దకాలంలో ప్రపంచంలోని టాప్ 3 ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్.. కచ్చితంగా ఎదుగుతుందని పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ ధీమా వ్యక్తం చేశారు. అత్యుత్తమ డిజిటల్ సమాజంగా భారత్ రూపొందుతుందని ఆయన చెప్పారు. కొత్త పుంతలు తొక్కుతున్న టెక్నాలజీ ఇందుకు ఊతంగా నిలుస్తుందన్నారు. ఐటీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లతో కలిసి సోమవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు చెప్పారు. 'ప్రపంచంలోని టాప్ 3 ఎకానమీల్లో ఒకటిగా భారత్ ఎదుగుతుందనడంలో నాకెలాంటి సందేహం లేదు. ఇందుకు అయిదేళ్లు పడుతుందా లేక పదేళ్లు పడుతుందా అన్నది చెప్పలేము కానీ.. కచ్చితంగా ఇది మాత్రం జరుగుతుంది. అప్పటికల్లా మన దేశం సాంకేతికంగా అత్యంత అభివృద్ధి చెందినదిగా ఉంటుందా? అభివృద్ధి పనుల్లో టెక్నాలజీ వాడకం ఎలా ఉంటుంది? టెక్నాలజీ వినియోగం విషయంలో మనం మిగతా వాళ్లకు దిశానిర్దేశం చేసే స్థాయిలో ఉండగలమా? ఇలాంటి విషయాలను మనం తేల్చుకోవాలి. ప్రపంచంలోనే ప్రీమియర్ డిజిటల్ సొసైటీగా ఎదిగేందుకు భారత్ ముందు అద్భుతమైన అవకాశం ఉంది. మనం అస్త్ర శస్త్రాలన్నీ అందిపుచ్చుకుని ముందుకు దూసుకెళ్లడమే తరువాయి' అని అంబానీ చెప్పారు.

300 బిలియన్ డాలర్ల నుంచి .. 3 ట్రిలియన్ డాలర్లకు..

సత్య నాదెళ్ల 1992లో మైక్రోసాఫ్ట్‌లో చేరినప్పుడు భారత ఎకానమీ పరిమాణం 300 బిలియన్ డాలర్లుగా ఉండేదని.. ప్రస్తుతం ఇది 3 ట్రిలియన్ డాలర్లకు ఎగిసిందని ముకేశ్ అంబానీ చెప్పారు. టెక్నాలజీ ఊతంతోనే ఇది సాధ్యపడిందన్నారు. 2014లో ప్రధాని నరేంద్ర మోదీ అధికార పగ్గాలు చేపట్టాక పురోగతి మరింత వేగవంతం అయిందన్నారు. 'జియో రాక ముందు దేశీయంగా డేటా ఖరీదు జీబీకి రూ. 300 నుంచి రూ. 500 దాకా ఉండేది. 2జీ ఫోను ఉపయోగించే అత్యంత సామాన్యుడికైతే ఏకంగా రూ. 10,000 దాకా జీబీ ధర ఉండేది. కానీ జియో వచ్చిన తర్వాత ఇది జీబీకి రూ. 12-14 స్థాయికి తగ్గిపోయింది. గడిచిన మూడేళ్లలో 38 కోట్ల మంది కస్టమర్లు 4జీ టెక్నాలజీకి మారారు. సగటు నెట్ స్పీడ్ 256 కేబీపీఎస్ నుంచి ఇప్పుడు 21 ఎంబీపీఎస్‌కు చేరింది' అని ఆయన తెలిపారు.

ట్రంప్ చూస్తున్నది.. నవ భారతం..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటనను కూడా అంబానీ ప్రస్తావించారు. గతంలో వచ్చిన అమెరికా అధ్యక్షులు కార్టర్ గానీ బిల్‌క్లింటన్.. ఆఖరుకు ఇటీవలి బరాక్ ఒబామా కూడా చూడని ఒక కొత్త భారత్‌ను ట్రంప్ నేడు చూస్తున్నారని ఆయన చెప్పారు. రిలయన్స్ వ్యవస్థాపకుడు, తండ్రి ధీరూభాయ్ అంబానీ అప్పట్లో ఒక టేబులు, కుర్చీ, చేతిలో రూ. 1,000 పెట్టుబడితో ప్రారంభించిన స్టార్టప్ సంస్థ నేడు దిగ్గజంగా వృద్ధి చెందిందని తెలిపారు. చిన్న వ్యాపారస్తులైనా.. ధీరూభాయ్ లేదా బిల్‌గేట్స్ స్థాయికి ఎదిగేందుకు భారత్‌లో పుష్కలమైన అవకాశాలు, సామర్థ్యాలు ఉన్నాయని తెలియజెప్పడానికి ఇది నిదర్శనంగా అంబానీ వివరించారు.

నాదెళ్లపై ప్రశంసలు..

మైక్రోసాఫ్ట్‌కి సత్య నాదెళ్ల సారథ్యం వహించడం ప్రతి భారతీయుడికి ఎంతో గర్వకారణమని అంబానీ చెప్పారు.

సొంత సాంకేతిక సామర్థ్యాలను పెంచుకోవాలి

- సమ్మిళిత వృద్ధిపై దృష్టి పెట్టాలి
- దేశీ సంస్థలకు మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల సూచన

ముంబై: సమ్మిళిత వృద్ధి సాధనపై మరింతగా దృష్టి పెట్టాలని, సొంతంగా సాంకేతిక సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవాలని టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల భారతీయ సంస్థలకు సూచించారు. గత దశాబ్దంలో మొబైల్ ద్వారా స్మార్ట్ టెక్నాలజీలు విరివిగా వాడకంలోకి వచ్చాయన్నారు. అయితే, అగ్రిగేటర్ సంస్థలు మాత్రమే దీనివల్ల ఎక్కువగా లబ్ధి పొందాయని పేర్కొన్నారు. మూడు రోజుల భారత పర్యటనలో భాగంగా మైక్రోసాఫ్ట్ నిర్వహించిన ఫ్యూచర్ డీకోడెడ్ సీఈవోల సదస్సులో సత్య నాదెళ్ల పాల్గొన్నారు. టెక్నాలజీ భవిష్యత్తు, భారతీయ కంపెనీలతో కలిసి మైక్రోసాఫ్ట్ పని చేసే తీరుతెన్నులు మొదలైన వాటి గురించి ఈ సందర్భంగా ఆయన వివరించారు. 'మనం ఏదైనా టెక్నాలజీని రూపొందించినప్పుడు.. సమ్మిళిత ఆర్థిక వృద్ధికి అది ఏవిధంగా ఉపయోగపడుతుందన్నది కూడా దృష్టిలో ఉంచుకోవాలి' అని నాదెళ్ల పేర్కొన్నారు. నాయకత్వ హోదాల్లో ఉన్న సంస్థలు ఓవైపు సాంకేతిక సామర్థ్యాలను నిర్మించుకుంటూనే మరోవైపు టెక్నాలజీపరమైన మార్పులను సాధ్యమైనంత త్వరగా అందిపుచ్చుకోవాలని చెప్పారు. గడిచిన దశాబ్దంలో వినియోగదారుల వ్యయాల ధోరణులే ప్రధానమన్న రీతిగా ఎకానమీ నడిచిందని.. కానీ ఆర్థిక వ్యవస్థ అంటే అదొక్కటే కాదని నాదెళ్ల తెలిపారు. టెక్నాలజీని వివిధ ప్రక్రియల్లో విరివిగా వాడే కంపెనీలన్నీ కూడా ప్రైవసీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం మొదలైన అంశాల్లో సంబంధిత వర్గాల విశ్వాసం చూరగొనే విధంగా వ్యవహరించాలని సూచించారు.

మారుతున్న టెక్నాలజీ ఉద్యోగాల తీరు..

సాంకేతిక రంగంలో ఉద్యోగాల తీరుతెన్నులు మారిపోతున్నాయని, కొంగొత్త నైపుణ్యాల్లో ఎప్పటికప్పుడు శిక్షణ పొందుతుండటం కీలకంగా మారిందని ఆయన చెప్పారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ విభాగంలో సుమారు 72 శాతం ఉద్యోగాలు.. టెక్నాలజీయేతర కంపెనీల్లోనే ఉంటున్నాయన్న నెట్‌వర్కింగ్ సైట్ లింక్డ్‌ఇన్ డేటా ఇందుకు నిదర్శనమని చెప్పారు. పిరమల్ గ్లాస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి కంపెనీల్లో సాంకేతికత వినియోగాన్ని నాదెళ్ల ప్రస్తావించారు. రిలయన్స్‌తో మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యం .. రాబోయే దశాబ్దంలో అత్యంత కీలకమైనదిగా ఆయన అభివర్ణించారు.

టెలికం రంగం నాశనాన్ని ఎవరూ కోరుకోరు

ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్

ముంబై: టెలికం రంగాన్ని నష్టపరచాలని, నాశనం చేయాలని ఎవరూ కోరు కోరని ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్ అన్నారు. టెలికం కంపెనీలు కేంద్ర ప్రభుత్వానికి రూ.1.47 లక్షల కోట్ల బకాయిలు చెల్లించాల్సిన పరిస్థితుల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ముఖ్యంగా వొడాఫోన్ ఐడియా రూ.53,000 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉండగా, ఈ స్థాయి బకాయిలు చెల్లించే పరిస్థితి లేదని ఆ సంస్థ ప్రకటించడం కూడా గమనార్హం. ఈ నేపథ్యంలో టెలికం రంగ సమస్యలపై మీడియా ప్రతినిధులు రజనీష్ కుమార్ స్పందన కోరగా.. ఈ అంశంపై ప్రభుత్వం నుంచి తమకు ఎటువంటి ఆదేశాలు లేవన్నారు.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్లు)	44,100
బంగారం (22 క్యారెట్లు)	42,000
వెండి (కిలో)	53,300
హైదరాబాద్/చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	43,740
బంగారం (22 క్యారెట్లు)	41,660
వెండి (కిలో)	53,000
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	44,580
బంగారం (22 క్యారెట్లు)	41,660
వెండి (కిలో)	50,000
ఏపీ బులియన్ అసోసియేషన్	
బంగారం (24 క్యారెట్లు)	44,880
బంగారం (22 క్యారెట్లు)	41,660
వెండి (కిలో)	50,400

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	50.75 రాత్రి 11.30కు	$ 53.38 శుక్రవారం ముగింపు
బ్రెంట్	54.85 రాత్రి 11.30కు	$ 57.94 శుక్రవారం ముగింపు

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 25-2-2020

విశాఖ	375-00
చిత్తూరు	383-00
వరంగల్	313-00
విజయవాడ	330-00
గోదావరి	330-00
24-2-2020 ఫామ్ ధర...	
హైదరాబాద్	310-00

నగదు రాజు అయితే.. డిజిటల్ దైవం

ఆర్‌బీఐ సరికొత్త నినాదం

ముంబై: నగదు రాజు అయితే డిజిటల్ కరెన్సీ దైవంగా ఆర్‌బీఐ పేర్కొంటోంది. డీమోనిటైజేషన్ తర్వాత వ్యవస్థలో రూ.3.5 లక్షల కోట్ల మేర నగదు వినియోగం తగ్గిందన్న ఆర్‌బీఐ, డిజిటల్ చెల్లింపులను గొప్ప అనుభవంగా మార్చడమే తన ప్రయత్నమని తెలిపింది. వ్యవస్థలో నగదు చెల్లింపులకు సంబంధించి కచ్చితమైన కొలమానాలు లేవని, డిజిటల్ చెల్లింపుల ప్రగతిని మాత్రం కచ్చితంగా లెక్కించొచ్చని పేర్కొంది. గత ఐదేళ్లలో డిజిటల్ చెల్లింపులు సంఖ్యా పరంగా వార్షికంగా 61 శాతం, విలువ పరంగా వార్షికంగా 19 శాతం చొప్పున వృద్ధి చెందినట్టు తెలిపింది. ఇప్పటికీ నగదు ఆధిపత్యం కొనసాగుతోంది. చెల్లింపులకు బదులు నిల్వ చేసుకునే ఆర్థిక సాధనంగా చూస్తున్నారు'' అని ఆర్‌బీఐ తెలిపింది. వ్యవస్థలో నోట్ల చలామణి 2014 అక్టోబర్ నుంచి 2016 అక్టోబర్ మధ్య 14 శాతం చొప్పున పెరిగినట్టు వెల్లడించింది. ఇదే వృద్ధి రేటు ప్రకారం 2019 అక్టోబర్ నాటికి చలామణిలో ఉన్న నోట్లు రూ.26,04,953 కోట్లు అని తెలిపింది. డిజిటైజేషన్, నగదు వినియోగం తగ్గడం వల్ల చలామణిలో ఉన్న నోట్లు రూ.3.5 లక్షల కోట్ల మేర తగ్గిపోయినట్టు వెల్లడించింది. ''డీమోనిటైజేషన్, జీడీపీ చురుకైన వృద్ధి రేటు ఫలితంగా చలామణిలో ఉన్న నగదు 2016-17 నాటికి జీడీపీలో 8.7 శాతానికి తగ్గింది. ఇది తదుపరి 2017-18 నాటికి 10.7 శాతానికి, 2018-19 నాటికి 11.2 శాతానికి పెరిగింది. అయినప్పటికీ డీమోనిటైజేషన్‌కు పూర్వం 2015-16 నాటికి ఉన్న 12.1 శాతం కంటే తక్కువ నగదే చలామణిలో ఉంది'' అని ఆర్‌బీఐ తెలిపింది.

విటారా బ్రెజాలో పెట్రోల్ వేరియంట్

- ధరలు రూ.7-11 లక్షల రేంజ్‌లో
- ఏఎమ్‌టీ వెర్షన్ కూడా లభ్యం
- దశలవారీగా డీజిల్ వేరియంట్ ఉపసంహరణ

న్యూఢిల్లీ: మారుతీ సుజుకీ కంపెనీ తన పాపులర్ ఎస్‌యూవీ మోడల్, విటారా బ్రెజాలో పెట్రోల్ వేరియంట్‌ను అందుబాటులోకి తెచ్చింది. ధరలు రూ.7.34 లక్షల నుంచి రూ.11.4 లక్షలు (ఎక్స్ షోరూమ్, ఢిల్లీ) రేంజ్‌లో నిర్ణయించామని మారుతీ సుజుకీ ఇండియా కంపెనీ ఎమ్‌డీ, సీఈఓ కెనిచి అయుకవ చెప్పారు. బీఎస్-సిక్స్ పెట్రోల్ విటారా బ్రెజాను 1.5 లీటర్ కె-సిరీస్ ఇంజిన్‌తో రూపొందించామని పేర్కొన్నారు. పెట్రోల్ వేరియంట్‌లో 5 గేర్లు(మాన్యువల్) వెర్షన్‌తో పాటు ఏఎమ్‌టీ(ఆటోమేటిక్ ట్రాన్సిషన్)ను కూడా అందిస్తున్నామని తెలిపారు.

డీజిల్ కార్లకు టాటా...

ఈ కొత్త విటారా బ్రెజాకు వినియోగదారుల నుంచి మంచి స్పందనే లభించగలదన్న ధీమాను కెనిచి అయుకవ వ్యక్తం చేశారు. బీఎస్-సిక్స్ పర్యావరణ నిబంధనలు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అమల్లోకి రానుండటంతో డీజిల్ ఇంజిన్ కార్ల ఉత్పత్తి నుంచి వైదొలుగుతున్నామని తెలిపారు. విటారా బ్రెజాలో డీజిల్ వేరియంట్‌ను దశలవారీగా ఉపసంహరిస్తామని వివరించారు. 2016లో విటారా బ్రెజా(డీజిల్)మోడల్‌ను మారుతీ సుజుకీ కంపెనీ మార్కెట్లోకి తెచ్చింది. అనతికాలంలోనే యుటిలిటి వెహికల్ సెగ్మెంట్‌లో అగ్రస్థానంలో నిలిచింది. ఇప్పటివరకూ ఐదు లక్షల విటారా బ్రెజాలు అమ్ముడయ్యాయి.

ఏజీఆర్‌పై స్వీయ మదింపు వివరాలు ఇవ్వండి

టెలికం కంపెనీలను కోరిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: ఏజీఆర్ బకాయిల విషయమై స్వీయ మదింపునకు సంబంధించి వివరాలు ఇవ్వాలని టెలికం కంపెనీలు వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్‌టెల్, టాటా టెలీసర్వీసెస్‌లను టెలికం శాఖ కోరింది. ఏజీఆర్ లెక్కలను పరిశీలించేందుకు ఈ ఆధారాలు టెలికం శాఖకు సాయపడతాయని ఓ అధికారి తెలిపారు. 15 టెలికం కంపెనీలు రూ.1.47 లక్షల కోట్ల ఏజీఆర్ బకాయిలు చెల్లించాలన్నది టెలికం శాఖ డిమాండ్. ఇందులో రూ.92,642 కోట్లు లైసెన్స్ ఫీజు, రూ.55,054 కోట్లు స్పెక్ట్రమ్ యూసేజీ చార్జీల రూపంలో చెల్లించాల్సి ఉంది. ఇందులో 60 శాతం వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్ కంపెనీలకు సంబంధించినదే. టెలికం శాఖ లెక్కల ప్రకారం వొడాఫోన్ ఐడియా చెల్లించాల్సిన బకాయిలు రూ.53,000 కోట్లు. కానీ, వొడాఫోన్ లెక్కల ప్రకారం ఇది రూ.35,000 కోట్లుగానే ఉంది. అంటే టెలికం కంపెనీల లెక్కలకు, టెలికం శాఖ లెక్కలకు మధ్య అంతరం ఉండడంతో, మరో విడత అన్ని సర్కిళ్లలోనూ టెలికం అధికారులు ఖాతాల మదింపు కార్యక్రమం చేపట్టారు.

గెయిల్‌కు రూ.7,608 కోట్ల నోటీస్

2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.7,608 కోట్లు చెల్లించాలంటూ ప్రభుత్వరంగ గెయిల్‌కు టెలికం శాఖ నోటీసు జారీ చేసింది. ఏజీఆర్ బకాయిల రూపంలో రూ.1.83 కోట్లు చెల్లించాలంటూ గెయిల్‌కు గతంలో జారీ చేసిన డిమాండ్ నోటీసు గురించి తాజాగా ప్రస్తావించకపోవడం గమనార్హం. అంతర్గత సమాచార అవసరాల కోసం గెయిల్, ఆయిల్ ఇండియా, పవర్‌గ్రిడ్ సంస్థలు ఐపీ-2 లైసెన్స్‌లను గతంలో తీసుకున్నాయి. టెలికం కంపెనీల అన్ని రకాల ఆదాయంపై చార్జీలను రాబట్టాలన్నది సుప్రీంకోర్టు ఆదేశం. అంటే టెలికం కంపెనీలు, టెలికం సేవలు కాకుండా ఇతర రూపాల్లో ఆర్జించే ఆదాయం పైనా ప్రభుత్వానికి చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఫలితంగా టెలికం లైసెన్స్‌లు కలిగిన ప్రభుత్వరంగ కంపెనీలూ గత 14 ఏళ్ల కాలానికి సంబంధించిన ఆదాయాలపై బకాయిలు చెల్లించాలంటూ టెలికం శాఖ నోటీసులు జారీ చేయడం గమనార్హం.

మేక్‌మైట్రిప్, ఓయోలపై సీసీఐ విచారణ

న్యూఢిల్లీ: అనుచిత వ్యాపార విధానాలు పాటిస్తున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆన్‌లైన్ ట్రావెల్ ఏజెన్సీ మేక్‌మైట్రిప్ (ఎంఎంటీ), హోటల్ సేవల సంస్థ ఓయోలపై మరింత లోతుగా దర్యాప్తు చేయాలంటూ కంపిటీషన్ కమిషన్ (సీసీఐ) ఆదేశించింది. ఓయో ప్రత్యర్థి ట్రీబో హోటల్స్ మాతృసంస్థ రబ్‌టబ్ సొల్యూషన్స్ ఫిర్యాదు మేరకు సీసీఐ ఈ మేరకు ఆదేశాలిచ్చింది. పోటీ నిబంధనలను ఉల్లంఘించాయన్న ప్రాథమిక ఆధారాలతో ఈ రెండు సంస్థల మీద సీసీఐ విచారణకు ఆదేశించడం ఆరు నెలల వ్యవధిలో ఇది రెండోసారి. ఓయోతో ఒప్పందం కుదుర్చుకున్న ఎంఎంటీ.. తన పోర్టల్‌లో ట్రీబో భాగస్వామ్య హోటళ్లను లిస్ట్ చేయకుండా మినహాయించడం, పోర్టల్‌లో చార్జీలపరంగా పరిమితులు విధించడం తదితర అంశాలపై ట్రీబో ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ జరిపిన సీసీఐ.. మార్కెట్లో గుత్తాధిపత్యాన్ని ఎంఎంటీ దుర్వినియోగం చేస్తున్నట్లు ప్రాథమిక ఆధారాల బట్టి తెలుస్తోందని 13 పేజీల ఉత్తర్వుల్లో పేర్కొంది.

వ్యాపార ప్రారంభానికి నూతన ఈ-ఫామ్

న్యూఢిల్లీ: కంపెనీల ఏర్పాటుకు సంబంధించి రిజిస్ట్రేషన్ వేగంగా జరిగేందుకు వీలుగా నూతన ఈఫామ్ 'ఎస్‌పీఐసీఈ ప్లస్'ను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. ప్రస్తుతమున్న ఎస్‌పీఐసీఈ పత్రం స్థానంలో దీన్ని తీసుకొచ్చింది. ఇది సమగ్ర వివరాలతో కూడిన వెబ్‌ఫామ్. ఎస్‌పీఐసీఈప్లస్ ద్వారా ఏర్పాటయ్యే అన్ని కంపెనీలకూ ఈపీఎఫ్‌వో, ఈఎస్‌ఐసీ తప్పనిసరి అని, ఆ తర్వాత విడిగా ఈపీఎఫ్‌వో, ఈఎస్‌ఐసీ నంబర్ల జారీ ఉండదని కార్పొరేట్ వ్యవహారాల శాఖ తన ప్రకటనలో స్పష్టం చేసింది.

విమెన్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనీషియేటివ్‌లో దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆర్థిక రంగంలో మహిళలకు ప్రోత్సాహాన్ని అందించే 'విమెన్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనీషియేటివ్-2020' కార్యక్రమానికి చార్టెర్డ్ ఫైనాన్షియల్ అనలిస్ట్ (సీఎఫ్ఏ) ఔత్సాహిక మహిళ పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆర్థిక క్రమశిక్షణ, పెట్టుబడులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై నాలుగు వారాల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని సీఎఫ్ఏ సౌత్ ఈస్ట్ ఏషియా డైరెక్టర్ అమిత్ చక్రభర్తి సోమవారమిక్కడ విలేకరులకు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు సీఎఫ్ఏలో సభ్యులైన 30 ఫైనాన్షియల్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలను కూడా కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు www.empowering youngwomen.cfa ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. చివరి తేదీ మార్చి8.

భారత్‌లో తొలి 5జీ స్మార్ట్‌ఫోన్

ఆవిష్కరించిన రియల్‌మీ • ధర రూ. 37,999 నుంచి ప్రారంభం

న్యూఢిల్లీ: చైనాకి చెందిన హ్యాండ్‌సెట్స్ తయారీ దిగ్గజం రియల్‌మీ తాజాగా భారత్‌లో తొలి 5జీ స్మార్ట్‌ఫోన్ ఆవిష్కరించింది. దీని ధర రూ. 37,999 నుంచి ప్రారంభమవుతుంది. రియల్‌మీ ఎక్స్50 ప్రో 5జీ పేరిట ఈ ఫోన్‌ను ప్రవేశపెట్టినట్లు సంస్థ భారత విభాగం సీఈవో మాధవ్ సేఠ్ తెలిపారు. మెమరీ స్టోరేజీ సామర్థ్యాన్ని బట్టి మూడు వేరియంట్ల ధర వరుసగా రూ. 37,999, రూ. 39,999, రూ. 44,999గా ఉంటుందని ఆయన వివరించారు. ఆన్‌లైన్ షాపింగ్ పోర్టల్ ఫ్లిప్‌కార్ట్ ద్వారా వీటిని విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. 4జీ, 5జీ టెక్నాలజీపై పనిచేసేలా డ్యుయల్ సిమ్ ఫీచర్‌తో ఈ స్మార్ట్‌ఫోన్ పనిచేస్తుంది. అయితే, దేశీయంగా ఇంకా 5జీ టెక్నాలజీ అమల్లోకే రానందున.. ఈ ఫోన్‌కు అప్‌గ్రేడ్ కావడం వల్ల పెద్దగా ఉపయోగమేమీ ఉండబోదని మార్కెట్ రీసెర్చ్ సంస్థ టెక్‌ఆర్క్ వ్యవస్థాపకుడు, చీఫ్ అనలిస్ట్ ఫైసల్ కవూసా వ్యాఖ్యానించారు. 2022 నాటికి గానీ భారత్‌లో 5జీ నెట్‌వర్క్ పూర్తిగా విస్తరించకపోవచ్చని, అప్పటికి ఈ ఫోన్లలోని టెక్నాలజీ పాతబడిపోవచ్చని పేర్కొన్నారు. అప్పటికి వీటి రేట్లు కూడా గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. 4జీ ఫోన్ల విషయంలో ఇదే జరిగిందని ఫైసల్ చెప్పారు.

మ్యూచువల్ ఫండ్స్ విభాగంలోకి రియల్‌మీపైసా

కాగా, ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ రియల్‌మీకి చెందిన డిజిటల్ రుణాల వ్యాపార విభాగం రియల్‌మీపైసా మ్యూచువల్ ఫండ్స్ విభాగంలోకి ఎంట్రీ ఇవ్వనుంది. అనుమతుల కోసం సంబంధిత నియంత్రణ సంస్థకు దరఖాస్తు చేసుకున్నామని.. 3 నెలల్లో సేవలను ప్రారంభిస్తామని కంపెనీ సీఈఓ వరుణ్ శ్రీధర్ సోమవారమిక్కడ విలేకరులకు తెలిపారు. త్వరలోనే యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

హెచ్‌యూఎల్ కొత్త అనుబంధ సంస్థ

కార్పొరేట్ ట్యాక్స్ తగ్గింపు ప్రయోజనాల కోసం...

న్యూఢిల్లీ: ఎఫ్ఎమ్‌సీజీ దిగ్గజం, హిందుస్తాన్ యూనిలివర్(హెచ్‌యూఎల్) కొత్త అనుబంధ సంస్థను ఏర్పాటు చేయనున్నది. తయారీ రంగ కార్యకలాపాలకు సంబంధించిన ఈ అనుబంధ సంస్థ ఏర్పాటుకు కంపెనీ డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపింది. ఈ అనుబంధ కంపెనీని రూ.2,000 కోట్ల అధీకృత వాటా మూలధనంతో ఏర్పాటు చేస్తామని హెచ్‌యూఎల్ తెలిపింది. కొత్త తయారీ కంపెనీలు 15 శాతం కార్పొరేట్ ట్యాక్స్ చెల్లిస్తే సరిపోతుంది. ఇది గతంలో 25 శాతంగా ఉంది. కార్పొరేట్ ట్యాక్స్ తగ్గింపు ప్రయోజనాలు పొందడానికి హెచ్‌యూఎల్ ఈ తయారీ రంగ అనుబంధ సంస్థను ఏర్పాటు చేస్తోందని సమాచారం. ఎఫ్ఎమ్‌సీజీ రంగానికి చెందిన ఉత్పత్తులనే అధికంగా ఈ కొత్త అనుబంధ కంపెనీ తయారు చేస్తుందని అంచనా. ఈ కొత్త అనుబంధ కంపెనీ కోసం హెచ్‌యూఎల్ ఆరంభంలో రూ.500-600 కోట్ల మేర ఇన్వెస్ట్ చేస్తుందని సమాచారం.

ఆ ఐదెకరాల్లో మసీదు.. ఆసుపత్రి..

లక్నో: అయోధ్య కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సంక్రమించిన ఐదెకరాల స్థలంలో మసీదు, ఆసుపత్రితో పాటు లైబ్రరీని నిర్మించనున్నట్లు ఉత్తరప్రదేశ్ సున్నీ సెంట్రల్ వక్ఫ్ బోర్డు వెల్లడించింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కేటాయించనున్న ఐదెకరాల స్థలంలో మసీదు నిర్మించాలని నిర్ణయించినట్లు వక్ఫ్ బోర్డు చైర్మన్ జుఫర్ ఫారూకీ వెల్లడించారు. సోమవారం ఇక్కడ జరిగిన బోర్డు సమావేశంలో ఈ మేరకు నిర్ణయించామని చెప్పారు. మసీదు నిర్మాణానికి సంబంధించి త్వరలో ట్రస్ట్‌ను ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారు. మసీదుకు బాబ్రీ మసీదు పేరు పెడతారా? అని మీడియా ప్రశ్నించగా.. దానిపై ట్రస్ట్ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

షహీన్‌బాగ్ నిరసనలపై 26న విచారణ

న్యూఢిల్లీ: షహీన్‌బాగ్ ఆందోళనలపై సుప్రీంకోర్టు నియమించిన మధ్యవర్తులు తమ నివేదికను సోమవారం సీల్డు కవర్‌లో అందజేశారు. పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)కు వ్యతిరేకంగా ఢిల్లీలోని షహీన్‌బాగ్‌లో రెండు నెలలుగా ఆందోళనలు సాగిస్తున్న విషయం తెలిసిందే. రహదారిపై చేపట్టిన ఈ నిరసనలు ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారాయంటూ దాఖలైన పిటిషన్‌పై స్పందించిన సుప్రీంకోర్టు ఈ నెల 17వ తేదీన మధ్యవర్తులుగా సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, సాధనా రామచంద్రన్‌లను నియమించింది. ఆందోళనకారులతో మాట్లాడి, ప్రజలకు ఇబ్బంది కలగని మరో ప్రాంతంలో నిరసనలు చేపట్టేలా ఒప్పించాలంటూ వీరిని ఆదేశించింది. ఈ మేరకు న్యాయవాదులు తమ పనిని పూర్తి చేసి, సంబంధిత నివేదికను సీల్డు కవర్‌లో ధర్మాసనానికి అందజేశారు. ఈ నెల 26వ తేదీన ఈ అంశంపై విచారణ జరుపుతామని ధర్మాసనం పేర్కొంది.

సుప్రీంకోర్టులో బ్రిటన్ అత్యున్నత న్యాయమూర్తి

న్యూఢిల్లీ: బ్రిటన్ సుప్రీంకోర్టు ప్రెసిడెంట్ లార్డ్ రాబర్ట్ జాన్ రీడ్ సోమవారం సుప్రీంకోర్టులో విచారణ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. అంతర్జాతీయ న్యాయ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన లార్డ్ జాన్ రీడ్, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బాబ్డేతోపాటు పావుగంట సేపు సుప్రీంకోర్టులో కూర్చున్నారు. అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ ఆయన్ను కోర్టు హాల్‌లోకి ఆహ్వానించారు.

డాన్ రవి పూజారి అరెస్టు

బనశంకరి: కర్ణాటకకు చెందిన ప్రముఖ మాఫియా డాన్ రవి పూజారిని బెంగళూరు పోలీసులు ఆఫ్రికా దేశమైన సెనెగల్ నుంచి బెంగళూరుకు తీసుకొచ్చారు. సోమవారం ఉదయం భారీ బందోబస్తు మధ్య బెంగళూరులోని కోర్టులో హాజరుపరచగా, మార్చి 7 వరకు పోలీస్ కస్టడీ విధిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. 2018లో రవిపూజారిని సెనెగల్ పోలీసులు అరెస్ట్ చేసి అక్కడే జైలులో ఉంచారు. న్యాయపరమైన చిక్కులు తొలగిపోవడంతో రవిపూజారిని ఇప్పుడు బెంగళూరుకు తీసుకొచ్చారు. ఇతనిపై బెంగళూరులో 39, మంగళూరులో 36, ఉడుపిలో 11, మైసూరు, హుబ్లీ-ధార్వాడ, కోలారు, శివమొగ్గలలో ఒక్కో కేసు చొప్పున నమోదయ్యాయి.

పీఎం కిసాన్‌కు మొబైల్ యాప్

న్యూఢిల్లీ: పథకం సేవలు మరింత విస్తృతం చేసేందుకు కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ పీఎం కిసాన్ పథకం మొదటి వార్షికోత్సవం సందర్భంగా మొబైల్ యాప్‌ను ప్రారంభించారు. అర్హులైన 6వేల మంది రైతులకు చేరువయ్యేలా లక్ష్యం పెట్టుకున్నారు. పీఎం-కిసాన్ పథకాన్ని పశ్చిమ బెంగాల్ తప్ప అన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి. 14 కోట్ల మంది రైతులకు ఈ పథకం చేరాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటివరకు 9.74 కోట్ల మంది రైతులు నమోదు చేసుకున్నారు. అందులో 8.45 కోట్ల మంది రైతులకు చెల్లింపులు చేసినట్లు అధికారికంగా నమోదైంది. రైతుల ఆదాయం 2022 కల్లా రెట్టింపు చేయాలన్నదే లక్ష్యమని నరేంద్రసింగ్ అన్నారు.

సీఏఏ అల్లర్లలో హింస

హెడ్ కానిస్టేబుల్ సహా నలుగురు మృతి

- డీసీపీ సహా 50 మందికి పైగా గాయాలు
- హింసాయుతంగా మారుతున్న నిరసనలు
- అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్న బలగాలు

ఢిల్లీలో సీఏఏ నిరసనకారుడిపై దాడి చేస్తున్న సీఏఏ మద్దతుదారులు.

వాహనాలను తగులబెడుతున్న నిరసనకారులు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై జరుగుతున్న అల్లర్లు తీవ్ర హింసారూపం దాల్చాయి. సోమవారం సీఏఏ మద్దతుదారులు, వ్యతిరేకుల మధ్య జరిగిన అల్లర్లలో నలుగురు ప్రాణాలు కోల్పోగా, మరో 50 మందికి పైగా గాయపడ్డారు. మరణించినవారిలో హెడ్ కానిస్టేబుల్ రతన్ లాల్, మరో ముగ్గురు పౌరులు ఉన్నారు. గాయపడినవారిలో డీసీపీ అమిత్ శర్మ సహా, ఏసీపీ, ఇద్దరు సీఆర్‌పీఎఫ్ జవాన్లు సహా 11 మంది పోలీసులు ఉన్నారని ఢిల్లీ ప్రభుత్వం వెల్లడించింది. తీవ్రమైన అల్లర్లు చెలరేగుతున్న కారణంగా ఢిల్లీలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు మంగళవారం సెలవు ప్రకటించారు. ముఖ్యంగా ఢిల్లీ ఈశాన్య దిక్కున ఉన్న మౌజ్‌పూర్ ప్రాంతంలో సీఏఏ మద్దతుదారులు, వ్యతిరేకులు ఇద్దరూ ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు స్వల్పంగా లాఠీచార్జ్ చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే బాష్పవాయు గోళాలను సైతం ప్రయోగించారు. ఆందోళనకారులు వాహనాలకు, దుకాణాలకు నిప్పు పెట్టారని తెలిపారు. కొన్ని గంటల తరువాత పరిస్థితి అదుపులోకి వచ్చినప్పటికీ జఫరాబద్, మౌజ్‌పూర్-బాబర్‌పూర్ మార్గంలో మెట్రో సర్వీసులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. బీజేపీ నేత కపిల్ మిశ్రా పిలుపు మేరకు సోమవారం కొందరు వ్యక్తులు మౌజ్‌పూర్‌లో గుమికూడినపుడు తాజా ఘర్షణలు చెలరేగాయి. సీఏఏను వ్యతిరేకిస్తున్న వారిని మూడు రోజుల్లో ఆ ప్రాంతం నుంచి ఖాళీ చేయించాలని ఈ సందర్భంగా కపిల్ మిశ్రా పోలీసులను డిమాండ్ చేశారు. విషాదకర ఘటనలను అదుపులోకి తీసుకొచ్చే చర్యలు చేపట్టాలంటూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ట్వీట్ ద్వారా లెఫ్టినెంట్ గవర్నర్, హోంశాఖ మంత్రి అమిత్‌షాలను కోరారు.

కావాలని చేయించిన అల్లర్లు.. !

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రాక సందర్భంగా ఉద్దేశపూర్వకంగా ఢిల్లీలో అల్లర్లు చేయించినట్లు తమ వద్ద సమాచారం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయితే ఈ అల్లర్ల వెనుక ఎవరున్నారనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. ఢిల్లీ పోలీస్ కమిషనర్ అమూల్య పట్నాయక్ పోలీస్ కంట్రోల్ రూం నుంచి పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నట్లు చెప్పాయి.

హింసాయుతం కారాదు: రాహుల్

శాంతియుత నిరసనలు ప్రజాస్వామ్యానికి గుర్తు అని, హింస ఉండరాదని రాహుల్ చెప్పారు. ఎవరు రెచ్చగొట్టినా సామరస్యం చూపించాలని చెప్పారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ.. హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. అమిత్ షా ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించింది. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తన బాధ్యతలను గాలికొదిలేశారని దుయ్యబట్టింది.

కఠిన చర్యలు తీసుకుంటాం: కిషన్‌రెడ్డి

ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు సబబేనని, హింసాయుత నిరసనలకు తావివ్వకూడదని హోంశాఖ సహాయక మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి భారత ప్రభుత్వం తరపున తాను సంతాపం తెలుపుతున్నానని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు దేశంలో పర్యటిస్తున్న వేళ ప్రభుత్వ పరువును దెబ్బతీసేందుకే ఈ నిరసనలు జరుపుతున్నారని ఆరోపించారు. ఈ అల్లర్లకు కారణమైన ఏ ఒక్కరినీ విడిచిపెట్టేది లేదని, ఇప్పటికే పోలీసులకు కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు ఇచ్చామని చెప్పారు.

మలేసియా ప్రధాని రాజీనామా

కౌలాలంపూర్: మలేసియా అధ్యక్షుడు మహాతీర్ మహమ్మద్ తన పదవికి రాజీనామా చేశారు. 2018 ఎన్నికల్లో అన్వర్ నేతృత్వంలోని 'ప్యాక్ట్ ఆఫ్ హోప్' కూటమి విజయం సాధించినా.. స్వలింగ సంపర్కపు ఆరోపణలతో ప్రధాని పదవి చేపట్టలేకపోయారు. అయితే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రభుత్వాన్ని ఎలాగైనా గద్దె దింపాలన్న లక్ష్యంతో తమ శత్రుత్వాన్ని పక్కనబెట్టి అన్వర్, మహాతీర్ మహమ్మద్‌లు చేతులు కలిపారు. ప్రపంచంలోనే అతి పెద్ద వయస్కుడైన ప్రధాని (94)గా గుర్తింపు పొందిన మహాతీర్ 1981 నుంచి 2003 వరకూ ప్రధానిగా కొనసాగిన విషయం తెలిసిందే. 2018 నాటి ఎన్నికల సందర్భంగా తన వారసుడిగా అన్వర్‌ను ప్రధానిగా చేస్తానని మహాతీర్ మాట ఇచ్చారు. అయితే ఇది కార్యరూపం దాల్చేలా కనిపించడం లేదు.

కొత్త కూటమికి ప్రయత్నాలు...

స్థానిక మీడియా కథనాల ప్రకారం కొత్త కూటమిలో 2018లో అధికారం కోల్పోయిన నజీబ్ రజాక్ నేతృత్వంలోని పార్టీ చేరవచ్చునని అంచనా. తనను కూలదోసేందుకు జరుగుతున్న కుట్రలకు నిరసనగానే మహాతీర్

అమ్మాయిలు అదరగొట్టేశారు

డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాపై శుభారంభం ఇచ్చిన ఆత్మవిశ్వాసంతో భారత మహిళలు గ్రూప్ 'ఎ'లో టాప్ గేర్‌లో దూసుకెళ్తున్నారు. బంగ్లాదేశ్‌తో జరిగిన పోరులో బ్యాటింగ్‌లో షఫాలీ మెరిపించగా... బౌలింగ్‌లో పూనమ్ యాదవ్ మళ్లీ ప్రత్యర్థిని తిప్పేసింది. దీంతో భారత అమ్మాయిల జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించి సెమీఫైనల్ దిశగా అడుగు ముందుకేసింది.

షఫాలీ వర్మ
17 బంతుల్లో 39
2 ఫోర్లు, 4 సిక్స్‌లు

పూనమ్ యాదవ్
3/18

మెరిపించిన షఫాలీ • పూనమ్ మాయాజాలం • బంగ్లాదేశ్‌పై భారత్ విజయం • మహిళల టి20 ప్రపంచకప్

పెర్త్: ఆల్‌రౌండ్ ప్రతాపంతో భారత మహిళల జట్టు టి20 ప్రపంచకప్‌లో వరుసగా రెండో విజయాన్ని సాధించింది. సోమవారం హర్మన్‌ప్రీత్ కౌర్ సేన 18 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. మొదట భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 142 పరుగులు చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ (17 బంతుల్లో 39; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగింది. తర్వాత బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 124 పరుగులకే పరిమితమైంది. నిగర్ సుల్తానా (26 బంతుల్లో 35; 5 ఫోర్లు) మెరుగ్గా ఆడింది. లెగ్ స్పిన్నర్ పూనమ్ యాదవ్ (3/18) మళ్లీ ఆకట్టుకుంది. షఫాలీకి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. దాంతో షఫాలీ టి20 ప్రపంచకప్ చరిత్రలో పిన్న వయస్సులో (16 ఏళ్ల 27 రోజులు) 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన క్రీడాకారిణిగా గుర్తింపు పొందింది. భారత్ తమ తదుపరి మ్యాచ్‌లో ఈనెల 27న మెల్‌బోర్న్‌లో న్యూజిలాండ్ జట్టుతో ఆడుతుంది.

షఫాలీ సిక్సర్లు...

భారత టీనేజ్ ఓపెనర్ షఫాలీ వర్మ సిక్సర్లతో దంచేసింది. దీంతో స్కోరు శరవేగంగా కదిలింది. జ్వరం కారణంగా రెగ్యులర్ ఓపెనర్ స్మృతి మంధాన ఈ మ్యాచ్‌కు దూరమైంది. తానియా భాటియా ఓపెనర్‌గా వచ్చినా 2 పరుగులే చేసి అవుటైంది. అయితే షఫాలీ, జెమీమా రోడ్రిగ్స్ (37 బంతుల్లో 34; 2 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి మెరుపులు మెరిపించింది. భారత్ 5.1 ఓవర్లోనే 50 పరుగులను చేరుకుంది. ఆమె అవుటయ్యాక స్కోరు మందగించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (8), దీప్తి శర్మ (11)లు పెద్దగా స్కోర్లేమీ చేయలేదు. కానీ చివర్లో వేద కృష్ణమూర్తి (11 బంతుల్లో 20 నాటౌట్; 4 ఫోర్లు) ధాటిగా ఆడింది. దీంతో ప్రత్యర్థి ముందు సవాల్‌తో కూడిన లక్ష్యాన్ని ఉంచగలిగింది.

క్రమం తప్పని పతనం...

తర్వాత లక్ష్యఛేదనకు దిగిన బంగ్లాదేశ్ ఆరంభం నుంచే వికెట్లను పారేసుకుంది. దీంతో ఏ దశలోనూ లక్ష్యంవైపు కన్నెత్తి చూడలేదు. ఓపెనర్ ముర్షిదా ఖాతున్ (26 బంతుల్లో 30; 4 ఫోర్లు), మిడిలార్డర్‌లో నిగర్ సుల్తానా (26 బంతుల్లో 35; 5 ఫోర్లు) మెరుగ్గా ఆడగలిగారు. మిగతా వాళ్లను భారత బౌలర్లు సులభంగానే బోల్తా కొట్టించడంతో క్రమం తప్పకుండా బంగ్లాదేశ్ వికెట్లు పతనమయ్యాయి. శిఖా పాండే, హైదరాబాద్ అమ్మాయి అరుంధతి రెడ్డి తలా 2 వికెట్లు తీశారు. రాజేశ్వరి గైక్వాడ్‌కు ఒక వికెట్ దక్కింది. సోమవారమే జరిగిన మరో మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా 5 వికెట్ల తేడాతో శ్రీలంకపై గెలిచింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: తానియా (స్టంప్డ్) నిగర్ (బి) సల్మా 2; షఫాలీ వర్మ (సి) షమీమా (బి) పన్నా ఘోష్ 39; రోడ్రిగ్స్ (రనౌట్) 34; హర్మన్‌ప్రీత్ (సి) రుమానా (బి) పన్నా ఘోష్ 8; దీప్తి శర్మ (రనౌట్) 11; రిచా (సి) నహీదా అక్తర్ (బి) సల్మా 14; వేద (నాటౌట్) 20; శిఖా పాండే (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 142. వికెట్ల పతనం:** 1-16, 2-53, 3-78, 4-92, 5-111, 6-113.

బౌలింగ్: జహనారా 4-0-33-0, సల్మా 4-0-25-2, నహీదా అక్తర్ 4-0-34-0, పన్నా ఘోష్ 4-0-25-2, రుమానా 2-0-8-0, ఫాహిమా 2-0-16-0.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: షమీమా సుల్తానా (సి) దీప్తి (బి) శిఖా 3; ముర్షిదా (సి) రిచా (బి) అరుంధతి రెడ్డి 30; సంజిదా ఇస్లామ్ (సి) తానియా (బి) పూనమ్ యాదవ్ 10; నిగర్ సుల్తానా (సి) అరుంధతి (బి) రాజేశ్వరి 35; ఫర్జానా హక్ (సి) తానియా (బి) అరుంధతి రెడ్డి 0; ఫాహిమా (సి) షఫాలీ (బి) పూనమ్ యాదవ్ 17; జహనార (స్టంప్డ్) తానియా (బి) పూనమ్ యాదవ్ 10; రుమానా (బి) శిఖా 13; సల్మా (నాటౌట్) 2; నహీదా (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 124. వికెట్ల పతనం:** 1-5, 2-44, 3-61, 4-66, 5-94, 6-106, 7-108, 8-121. **బౌలింగ్:** దీప్తి శర్మ 4-0-32-0, శిఖా పాండే 4-0-14-2, రాజేశ్వరి 4-0-25-1, అరుంధతి 4-0-33-2, పూనమ్ 4-0-18-3.



విహారి బౌల్డ్

ఓటమి లాంఛనం ముగిసింది

తొలి టెస్టులో 10 వికెట్లతో భారత్ పరాజయం

రెండో ఇన్నింగ్స్‌లో 191 ఆలౌట్ • టెస్టుల్లో న్యూజిలాండ్‌కు 100వ విజయం
సిరీస్‌లో కివీస్‌కు 1-0 ఆధిక్యం • 29 నుంచి రెండో టెస్టు

అనూహ్యం, అద్భుతంలాంటివేమీ జరగలేదు. కొంత గౌరవప్రదమైన లక్ష్యాన్ని ప్రత్యర్థి ముందు ఉంచి మనోళ్లు పోరాడగలరనుకున్న ఆశా నెరవేరలేదు. టెస్టు మ్యాచ్ తొలి రోజు బ్యాటింగ్‌లో భారత్ చూపించిన తడబాటు చివరకు పరాజయం వరకు కొనసాగింది. సోమవారం ఆటలో మిగిలిన 6 భారత వికెట్లు పడగొట్టేందుకు కివీస్‌కు 16 ఓవర్లు సరిపోయాయి. 47 పరుగులు మాత్రమే టీమిండియా జోడించగా... విజయానికి అవసరమైన 9 పరుగులను రెండో ఓవర్లో కివీస్ అందుకుంది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో వరుసగా ఏడు టెస్టుల్లో విజయాల తర్వాత కోహ్లి సేనకు ఇది తొలి పరాజయం కాగా... ఆసీస్ చేతిలో మూడు మ్యాచ్‌లు ఓడిన అనంతరం సొంత గడ్డపై దక్కిన విజయంతో కివీస్‌కు ఊరట లభించింది. పైగా ఇది న్యూజిలాండ్‌కు 100వ టెస్టు విజయం కావడం ఆ జట్టు ఆనందాన్ని రెట్టింపు చేసింది.

వెల్లింగ్టన్: టి20, వన్డే సిరీస్‌లు సమంగా ముగిసిన తర్వాత జరుగుతున్న టెస్టు సిరీస్‌లో న్యూజిలాండ్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. బేసిన్ రిజర్వ్ మైదానంలో సోమవారం నాలుగో రోజు తొలి సెషన్‌లోనే ముగిసిన తొలి టెస్టులో కివీస్ 10 వికెట్ల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 144/4తో ఆట ప్రారంభించిన భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 191 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' టిమ్ సౌతీ 5 వికెట్లతో చెలరేగగా... ట్రెంట్ బౌల్ట్ 4 వికెట్లతో భారత్‌ను దెబ్బ తీశాడు. తొలి ఇన్నింగ్స్‌లో సాధించిన 183 పరుగుల ఆధిక్యాన్ని మినహాయించగా, కివీస్ ముందు 9 పరుగుల లక్ష్యం నిలిచింది. ఓపెనర్లు లాథమ్ (7 నాటౌట్), బ్లన్‌డెల్ (2 నాటౌట్) కలిసి 1.4 ఓవర్లలో ఈ స్కోరు సాధించి లాంఛనాన్ని పూర్తి చేశారు. ఇరు జట్ల మధ్య రెండో టెస్టు ఈ నెల 29 నుంచి క్రైస్ట్‌చర్చ్‌లో జరుగుతుంది.

అందరూ అదే దారిలో...

39 పరుగులు వెనుకబడిన స్థితిలో నాలుగో రోజు ఆట ప్రారంభించిన భారత్ రెండో ఇన్నింగ్స్ ముగిసేందుకు ఎక్కువ సేపు పట్టలేదు. మూడో ఓవర్లోనే రహానే (75 బంతుల్లో 29; 5 ఫోర్లు)ను కీపర్ క్యాచ్ ద్వారా బౌల్ట్ వెనక్కి పంపించాడు. తర్వాతి ఓవర్లోనే సౌతీ చక్కటి ఇన్‌స్వింగర్‌తో విహారి (15)ని బౌల్డ్ చేయడంతో ఇద్దరు ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ పెవిలియన్ చేరారు. మరోవైపు క్రీజ్‌లో ఉన్న కొద్ది సేపు రిషభ్ పంత్ (41 బంతుల్లో 25; 4 ఫోర్లు) దూకుడుగా ఆడే ప్రయత్నం చేసినా... అశ్విన్ (4) కూడా సౌతీ బౌలింగ్‌లోనే వికెట్ల ముందు దొరికిపోయాడు. ఇషాంత్ (12)ను గ్రాండ్‌హోమ్ అవుట్ చేయగా, తర్వాతి ఓవర్ వేసిన సౌతీ... పంత్, బుమ్రా (0)ల వికెట్లు తీయడంతో భారత్ ఇన్నింగ్స్ ముగిసింది. ఆ తర్వాత లక్ష్యాన్ని ఛేదించేందుకు కివీస్‌కు 10 బంతులు సరిపోయాయి.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 165; న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 348; భారత్ రెండో ఇన్నింగ్స్: పృథ్వీ షా (సి) లాథమ్ (బి) బౌల్ట్ 14; మయాంక్ (సి) వాట్లింగ్ (బి) సౌతీ 58; పుజారా (బి) బౌల్ట్ 11; కోహ్లి (సి) వాట్లింగ్ (బి) బౌల్ట్ 19; రహానే (సి) వాట్లింగ్ (బి) బౌల్ట్ 29; విహారి (బి) సౌతీ 15; పంత్ (సి) బౌల్ట్ (బి) సౌతీ 25; అశ్విన్ (ఎల్బీ) (బి) సౌతీ 4; ఇషాంత్ (ఎల్బీ) (బి) గ్రాండ్‌హోమ్ 12; షమీ (నాటౌట్) 2; బుమ్రా (సి) (సబ్) మిషెల్ (బి) సౌతీ 0; **ఎక్స్‌ట్రాలు 2; మొత్తం (81 ఓవర్లలో ఆలౌట్) 191.**

వికెట్ల పతనం: 1-27; 2-78; 3-96; 4-113; 5-148; 6-148; 7-162; 8-189; 9-191; 10-191. **బౌలింగ్:** సౌతీ 21-6-61-5; బౌల్ట్ 22-8-39-4; గ్రాండ్‌హోమ్ 16-5-28-1; జేమీసన్ 19-7-45-0; ఎజాజ్ పటేల్ 3-0-18-0.

న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లాథమ్ (నాటౌట్) 7; బ్లన్‌డెల్ (నాటౌట్) 2; **మొత్తం (1.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 9.**

బౌలింగ్: ఇషాంత్ 1-0-8-0; బుమ్రా 0.4-0-1-0.

సిగ్గు పడాల్సిందేమీ లేదు...

"మేం బాగా ఆడలేదని తెలుసు. కానీ కొందరు ఈ ఓటమిని అవసరానికి మించి పెద్దదిగా చేసి చూపిస్తున్నారు. మేం ఆ రకంగా ఆలోచించడం లేదు. దీంతో ప్రపంచం ముగిసిపోయినట్లు కాదు. క్రికెట్ మ్యాచ్‌లోనే ఓడాం. అంతర్జాతీయ క్రికెట్‌లో ఏదీ సులువు కాదు. ప్రతీ జట్టు విజయం కోసమే ప్రయత్నిస్తుంది. బయటి వ్యక్తులు ఏం మాట్లాడుకుంటున్నారో మేం పట్టించుకోం. అలా చేస్తే మళ్లీ ఏడు లేదా ఎనిమిది ర్యాంక్‌కు పడిపోతాం. వరుసగా టెస్టులు గెలుస్తున్న జట్టు స్థాయి ఒక్క మ్యాచ్‌తో తగ్గిపోదు. పరాజయాన్ని ఒప్పుకోవడంలో సిగ్గు పడాల్సిందేమీ లేదు. న్యూజిలాండ్ బౌలర్లు మాపై ఒత్తిడి పెంచేలా మేమే అవకాశమిచ్చాం. ఒకటి రెండు మంచి భాగస్వామ్యాలతో వారిని అడ్డుకోవాల్సింది. నా బ్యాటింగ్ గురించి ఆందోళన లేదు. నేను బాగానే ఆడుతున్నా. ఇంత సుదీర్ఘ క్రికెట్ ఆడుతున్నప్పుడు అప్పుడప్పుడూ విఫలం కావడం సహజం. తర్వాతి టెస్టు కోసం మరింతగా శ్రమించి సన్నద్ధమవుతాం."

-విరాట్ కోహ్లి, భారత కెప్టెన్

భారత నంబర్‌వన్‌గా సుమీత్ నాగల్

న్యూఢిల్లీ: అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో భారత నంబర్‌వన్ ప్లేయర్‌గా ఢిల్లీకి చెందిన 22 ఏళ్ల సుమీత్ నాగల్ అవతరించాడు. సోమవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో సుమీత్ 423 పాయింట్లతో 127వ స్థానంలో నిలిచాడు. ఇన్నాళ్లు భారత నంబర్‌వన్‌గా ఉన్న చెన్నైకి చెందిన 30 ఏళ్ల ప్రజ్నేశ్ గుణేశ్వరన్ తొమ్మిది స్థానాలు పడిపోయి 405 పాయింట్లతో 134వ ర్యాంక్‌లో నిలిచాడు.

సానియా జంట ఓటమి

దోహా: ఖతర్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో సానియా మీర్జా (భారత్)-కరోలినా గార్సియా (ఫ్రాన్స్) జంట పోరాటం ముగిసింది. సోమవారం జరిగిన డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో సానియా-గార్సియా ద్వయం 4-6, 5-7తో కాగ్లా బుయుకాక్‌కే (టర్కీ)-లారా సీజ్మెండ్ (జర్మనీ) జోడీ చేతిలో ఓడిపోయింది.

సెమీస్‌లో సౌరాష్ట్ర

- ఆంధ్రతో రంజీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ 'డ్రా'
- తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ముందుకు
- కర్ణాటక, బెంగాల్ కూడా సెమీస్‌లోకి

సాక్షి, ఒంగోలు: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టు ప్రయాణం ముగిసింది. సౌరాష్ట్రతో ఇక్కడి సీఎస్ఆర్ శర్మ కాలేజి మైదానంలో ముగిసిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ను ఆంధ్ర 'డ్రా' చేసుకున్నప్పటికీ... తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన సౌరాష్ట్ర సెమీఫైనల్ చేరింది. ఓవర్‌నైట్ స్కోరు 375/9తో చివరి రోజైన సోమవారం ఆటను కొనసాగించిన సౌరాష్ట్ర తమ రెండో ఇన్నింగ్స్‌లో 138 ఓవర్లలో 426 పరుగులకు ఆలౌటైంది. ఫలితంగా ప్రత్యర్థికి 710 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తమ రెండో ఇన్నింగ్స్‌లో 51 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసింది. శ్రీకర్ భరత్ (55 నాటౌట్; 6 ఫోర్లు, సిక్స్) రాణించాడు.

కర్ణాటక విజయం...

మరోవైపు జమ్మూలో జమ్మూ కశ్మీర్‌తో జరిగిన మరో క్వార్టర్ ఫైనల్లో కర్ణాటక 167 పరుగుల ఆధిక్యంతో గెలిచి సెమీస్‌కు చేరింది. 331 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జమ్మూ కశ్మీర్ 163 పరుగులకే ఆలౌటైంది. కర్ణాటక బౌలర్ కృష్ణప్ప గౌతమ్ 7 వికెట్లతో జట్టుకు విజయాన్ని కట్టబెట్టాడు. కటక్ వేదికగా బెంగాల్, ఒడిశా మ్యాచ్ 'డ్రా' అయింది.

సౌరాష్ట్ర జట్టు

తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో బెంగాల్ సెమీస్‌లోకి ప్రవేశించింది. గోవాతో జరిగిన మ్యాచ్‌లో ఆదివారమే నెగ్గిన గుజరాత్ ఇప్పటికే సెమీస్ చేరింది. ఈ నెల 29 నుంచి మొదలయ్యే సెమీఫైనల్స్‌లో గుజరాత్‌తో సౌరాష్ట్ర; బెంగాల్‌తో కర్ణాటక తలపడతాయి.

ముష్ఫికర్ డబుల్ సెంచరీ

బంగ్లాదేశ్ 560/6 డిక్లేర్డ్

ఢాకా: ముష్ఫికర్ రహీమ్ కెరీర్‌లో మూడో డబుల్ సెంచరీతో (203 నాటౌట్; 28 ఫోర్లు) కదం తొక్కడంతో... జింబాబ్వేతో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌కు పట్టుదొరికింది. ఓవర్‌నైట్ స్కోరు 240/3తో సోమవారం ఆటను కొనసాగించిన బంగ్లాదేశ్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 6 వికెట్లకు 560 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. దాంతో 295 పరుగుల భారీ ఆధిక్యాన్ని సాధించింది. కెప్టెన్ మోమినుల్ (132; 14 ఫోర్లు) సెంచరీతో ఆకట్టుకున్నాడు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 222 పరుగులు జోడించారు. లిటన్ దాస్ (53; 5 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. అనంతరం 295 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన జింబాబ్వే ఆట ముగిసే సమయానికి 2 వికెట్లకు 9 పరుగులు చేసింది.

ఆ రెండు... మీరు నిర్వహించుకోండి

- పతకాల్ని పట్టికలో చేరుస్తాం
- షూటింగ్, ఆర్చరీపై సీజీఎఫ్ స్పష్టీకరణ

లండన్: కామన్వెల్త్ గేమ్స్‌లో షూటింగ్, ఆర్చరీ ఈవెంట్ల కోసం బెట్టు వీడని పోరాటం చేసిన భారత్ ఒకింత విజయం సాధించినట్లే! భారత్‌కు ఈ రెండు ఈవెంట్లను ప్రత్యేకంగా నిర్వహించుకునే స్వేచ్ఛనిచ్చిన కామన్వెల్త్ గేమ్స్ సమాఖ్య (సీజీఎఫ్) అందులో సాధించిన పతకాలను గేమ్స్ పట్టికలో తర్వాత చేరుస్తామని ప్రకటించింది. 2022 కామన్వెల్త్ గేమ్స్‌కు బర్మింగ్‌హామ్ జూలై 27 నుంచి ఆగస్టు 7 వరకు ఆతిథ్యమివ్వనుంది. అయితే అతిథ్య దేశానికి ఉన్న సౌలభ్యం మేరకు ఇంగ్లండ్ రోస్టర్ విధానంలో భాగంగా షూటింగ్, ఆర్చరీ ఈవెంట్లను గేమ్స్ నుంచి తప్పించింది. దీనిపై గుర్రుగా ఉన్న భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) గేమ్స్‌ను బహిష్కరిస్తామని హెచ్చరించింది. కొన్ని నెలలుగా ఈ అంశం సీజీఎఫ్‌లో రగులుతూనే ఉంది. ఎట్టకేలకు దీనికి ముగింపు పలికే నిర్ణయాన్ని తాజా సీజీఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డు మీటింగ్‌లో తీసుకున్నారు. కామన్వెల్త్ గేమ్స్ కంటే ముందుగా ఆ రెండు క్రీడల్ని భారత్‌లో నిర్వహించాలని, అందులో సాధించిన పతకాల్ని ప్రధాన గేమ్స్ పట్టికలో ఓ వారం తర్వాత చేరుస్తామని సీజీఎఫ్ తెలిపింది. షూటింగ్, ఆర్చరీ ఈవెంట్లను 2022 జనవరిలో నిర్వహిస్తామని ఐఓఏ తెలిపింది.

epaper.sakshi.com

యాదవ సమ్మేళనానికి మంత్రి తలసానికి ఆహ్వానం



సాక్షి, హైదరాబాద్: ఆలిండియా గొల్ల యాదవ సమితి ఆధ్వర్యంలో మార్చి 1న మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగే సమ్మేళనానికి రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఆహ్వానం లభించింది. నాందేడ్ యాదవ సమితి సభ్యులు పతి శివకుమార్, బోస్‌నాథ్, సత్పాల్ రాజాం, సందీప్ జాల్వాద్, ఇందిరా వాద్ తదితరులు సోమవారం హైదరాబాద్‌లోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో మంత్రిని కలిసి ఈ మేరకు ఆహ్వానించారు. నాందేడ్ సమితి ఆహ్వానం పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారు.

నేడు సినీ నటుడు రావి కొండలరావుపై ప్రత్యేక తపాలా కవర్



సాక్షి, హైదరాబాద్: తపాలా శాఖ.. సినీ నటుడు రావి కొండలరావుపై ప్రత్యేక తపాలా కవర్‌ను రూపొందించింది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ డాక్ సదన్‌లో జరిగే కార్యక్రమంలో తపాలా శాఖ తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కె.సంధ్యారాణి ఈ ప్రత్యేక తపాలా కవర్‌ను విడుదల చేస్తారు. రావి కొండలరావు సుమారు 600కుపైగా చిత్రాల్లో నటించారు. తాను తీసిన సీరియల్స్‌కు 12 నంది అవార్డులు, 50 కథలకు మరెన్నో అవార్డులు అందుకున్నారు. ఆరు జాతీయ భాషల్లోకి ఆయన కథలు అనువాదమయ్యాయి. ఆకాశవాణి కోసం పదేళ్లలో వంద నాటికలు రాసిన ఏకైనా రచయితగా పేరొందారు. 127 చిత్రాల్లో భార్యభర్తలుగా రావి కొండలరావు తన సతీమణి రాధాకుమారితో కలిసి నటించారు. ఇది ప్రపంచ చలన చిత్ర రంగంలో అరుదైన రికార్డు. ఇవన్నీ గుర్తించిన తపాలా శాఖ ఆయనపై ప్రత్యేక తపాలా కవర్‌ను విడుదల చేస్తోంది.

జేఎన్టీయూ వీసీకి వెసులుబాటు

వీసీకి బదులు రిజిస్ట్రార్ హాజరు కావాలన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించలేదని వచ్చిన ఫిర్యాదుపై వివరణ ఇచ్చేందుకు బీసీ కమిషన్ ఎదుట జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్టీయూ) వైస్ చాన్స్‌లర్ (వీసీ) హాజరుకు బదులుగా వర్సిటీ రిజిస్ట్రార్ హాజరుకావాలని హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. జాతీయ బీసీ కమిషన్ ఇటీవల జారీచేసిన ఉత్తర్వులను వర్సిటీ వీసీ సవాల్ చేస్తూ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని సోమవారం విచారించిన న్యాయమూర్తి జస్టిస్ అభినందన్‌కుమార్ షావిలీ వీసీకి వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీసీకి నోటీసులు జారీచేసే అధికారం బీసీ కమిషన్‌కు లేదని, కోర్టు కేసులన్నీ రిజిస్ట్రార్ పేరిటే జరుగుతాయని, వివరణ కోరకుండానే వీసీ హాజరుకావాలని నోటీసు ఇవ్వడాన్ని కొట్టేయాలని జేఎన్టీయూ దాఖలు చేసిన రిట్ పిటిషన్ నేపథ్యంలో ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

పాదయాత్ర చేస్తా.. అనుమతించండి!

సస్పెన్షన్‌కు గురైన విద్యుత్ అధికారి విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్)లో తీవ్ర అవినీతి, అక్రమాలు జరిగాయని ఫేస్‌బుక్ లైవ్ వీడియో ద్వారా ఆరోపణలు చేసి సస్పెన్షన్‌కు గురైన సంస్థ అడిషనల్ డివిజనల్ ఇంజనీర్ కోటేశ్వర్‌రావు రాష్ట్రవ్యాప్త పాదయాత్రకు సిద్ధమయ్యారు. విద్యుత్‌కు సంబంధించిన విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తాండూరు నుంచి భద్రాచలం వరకు రోజూ 40 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించేందుకు అనుమతి కోరుతూ సంస్థ సీఎండీ జి.రఘుమారెడ్డి కార్యాలయంలో ఆయన సోమవారం వినతిపత్రం అందజేశారు. విద్యుదాఘాతాల నివారణతో పాటు ఇతర సమస్యల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు మార్చి 8 నుంచి పాదయాత్రను ప్రారంభించాలని యోచిస్తున్నానని లేఖలో తెలిపారు.

చైనాలోని వుహాన్‌లో విజృంభించిన కోవిడ్ వైరస్ పేరు వింటేనే ప్రపంచం గడగడలాడుతోంది. అలాగే దక్షిణ కొరియాలో కూడా కోవిడ్ బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో బయటకు రావొద్దని అక్కడి అధికారులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అక్కడి డేగు పట్టణంలో చాలా రద్దీగా ఉండే రోడ్లన్నీ జనం లేక ఇలా ఖాళీగా కనిపించాయి.

ఫీజు బకాయిలుండొద్దు!

- 2018-19 విద్యాసంవత్సరం వరకు తక్షణమే చెల్లించాలని ప్రభుత్వ నిర్ణయం
- చెల్లింపుల కోసం అదనంగా రూ.200 కోట్లు కేటాయించేందుకు అంగీకారం
- నిధుల విడుదలకు పరిపాలనా ఉత్తర్వులు సిద్ధం చేస్తున్న యంత్రాంగం
- పాత బకాయిలు చెల్లించిన తర్వాతే మిగులు నిధులు '2019-20'కి చెల్లింపులు

సాక్షి, హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కింద బకాయిలుండొద్దని ప్రభుత్వం నిర్ణయించింది. ఏటా చాలినన్ని నిధులు కేటాయిస్తున్నప్పటికీ.. సాంకేతిక కారణాలతో వంద శాతం చెల్లింపులు జరగడం లేదు. దీంతో ప్రతి సంవత్సరం కొంత మేర నిధులు విడుదల చేయకపోవడంతో అవన్నీ పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. ఇలా 2014-15 వార్షిక సంవత్సరం నుంచి 2018-19 వార్షిక సంవత్సరం మధ్య కాలంలో సుమారు రూ.613 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండిపోయాయి. వీటిని తక్షణమే చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రస్తుత వార్షిక సంవత్సరంలో కేటాయించిన నిధులకు అదనంగా రూ.200 కోట్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రెండ్రోజుల క్రితం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అధ్యక్ష తన సంక్షేమ శాఖల ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై లోతైన చర్చ జరిగింది. దీంతో ఏటా పెండింగ్‌లో పడుతున్న బకాయిలను పరిశీలించిన మంత్రి.. వీటిని యుద్ధప్రాతిపదికన చెల్లించాలని ఆదేశించారు.

బకాయిలు చెల్లించిన తర్వాతే...

ప్రస్తుతం 2019-20 వార్షిక సంవత్సరం మరో నెల రోజుల్లో ముగుస్తుంది. దీంతో ఈ వార్షిక సంవత్సరం డిమాండ్ ఎంతుందనే అంశంపై సంక్షేమ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నెల 15వ తేదీ వరకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తులు స్వీకరించిన అధికారులు.. వీటిని పరిశీలించే పనిలో పడ్డారు. 2019-20 వార్షిక సంవత్సరంలో 12.85 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటిని ప్రాథమికంగా అంచనావేయగా.. రూ.2,250 కోట్లు అవసరమని గుర్తించారు. దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించేందుకు మరో రెండు నెలల సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో గత బకాయిలన్నీ చెల్లించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ క్రమంలో పాత బకాయిలకు సంబంధించి జనవరి నెలాఖరు వరకు సంక్షేమ శాఖ అధికారులు కసరత్తు చేసి సంబంధిత కాలేజీ యాజమాన్యాల నుంచి ఆధారాలను సేకరించారు. తాజాగా ఆయా నిధుల విడుదలకు ప్రభుత్వం బీఆర్వో (బడ్జెట్ రిలీజింగ్ ఆర్డర్లు)లను సిద్ధం చేస్తోంది. అవి వెలువడిన వెంటనే బకాయిలన్నీ చెల్లించాలని సూచించింది. వాటి చెల్లింపులు పూర్తయిన తర్వాత మిగులు నిధులతో 2019-20 వార్షిక సంవత్సరం బిల్లులు క్లియర్ చేయాలని స్పష్టంచేసింది.

ఇంజనీరింగ్‌పై 26న ఉన్నత స్థాయి సమావేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజనీరింగ్ విద్య పరిస్థితులు, అమలు చేయాల్సిన మార్పులు, మార్కెట్ డిమాండ్, అందుకనుగుణంగా తీసుకొచ్చే కొత్త కోర్సులకు అందించాల్సిన సహకారంపై ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించేందుకు ఉన్నత విద్యా మండలి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అధికారులు, పారిశ్రామిక రంగాలకు చెందిన నిపుణులతో ఈ నెల 26వ తేదీన ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించనుంది. సమావేశంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్, సాంకేతిక విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్, ఉన్నత విద్యా మండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, వైస్ చైర్మన్లు ఆర్.లింబాద్రి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో కొత్త కాలేజీలు, కొత్త కోర్సుల అమలుకు రానున్న రెండేళ్లలో తీసుకురావాల్సిన మార్పులు, అందుకు రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యా మండలి, యూనివర్సిటీలు చేపట్టాల్సిన చర్యలు, కొత్త కోర్సులకనుగుణంగా అమలు చేయాల్సిన శిక్షణ కార్యక్రమాలను నివేదికలో పొందుపరచనున్నారు. ఈ నివేదికను అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) కి కూడా రాష్ట్ర ప్రభుత్వం పంపించనుంది.

అక్రమ లేఅవుట్లపై హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గాజుల రామారంలో సర్వే నంబర్ 221లోని భూమి ఆక్రమణలకు గురవుతోందని దాఖలైన పిటిషన్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులిచ్చింది. దీనిపై వివరణ ఇవ్వాలని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా కలెక్టర్, తదితరులకు సోమవారం కోర్టు నోటీసులిచ్చింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఫుల్‌ట్యాంక్ లెవల్, బఫర్ జోన్ పరిధిలోని ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా మార్చి అక్రమ లేఅవుట్లు వేస్తున్నారని నవీన్‌కుమార్ దాఖలు చేసిన వ్యాజ్యంపై 4 వారాలకు విచారణ వాయిదా పడింది.

SI & కానిస్టేబుల్స్ TM & EM వేరు వేరు బ్యాచులు
న్యూ బ్యాచ్: 28-02-2020 ఉ. 10 గంటలకు
ప్రతి ఆదివారం ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ టెస్టులు OMR షీట్‌తో EM & TMలో విద్యార్హతలు, అనంతరం టెస్ట్ వివరం కలదు.
శ్యామ్ కానిస్టేబుల్స్ H.O: కాచిగూడ - 98482 56254 B.O: హైదరాబాద్ - 88926 21234

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com